అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 15-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక



ఎన్నికల బాండ్ల స్కామ్‌పై సిట్ దర్యాప్తు చేయాలి

- సత్వర విచారణకు సుప్రీం హామీ

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడవడంతో బయటకు వచ్చిన క్విడ్ ప్రో కో, అవినీతి, ముడుపులు వంటి ప్రతి సంఘటన పైనా దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని కోరుతున్న పిటిషన్‌పై త్వరలో విచారణ జరుపుతామని సుప్రీం కోర్టు మంగళవారం న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌కు ...11లో

సంపుటి: 10 సంచిక: 135 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 12 పేజీలు వెల: 6.50

13 సీట్లు మావే



ప్రజాపాలనను ఓటర్లు ఆశీర్వదించారు

- కొన్ని చోట్ల రెండోస్థానంలో బీజేపీ
- బీఆర్ఎస్‌కు ఆరేడు స్థానాల్లో డిపాజిట్ కూడా రాదు
- ఇక నుంచి పరిపాలనపై దృష్టి
- ఏపీలో ఏ ప్రభుత్వం వచ్చినా కలిసి పనిచేస్తాం : సీఎం రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 13 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందని టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్ని చోట్ల పోలింగ్ తమకు అనుకూలంగా జరిగిందని పేర్కొన్నారు. ఓటర్లు తమ ప్రజాపాలనను ఆశీర్వదించారంటూ ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు ఉన్న సర్వేల రిపోర్టులు, పార్టీ నేతల అభిప్రాయాలు, వివిధ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం కాంగ్రెస్ 13 సీట్లను పక్కాగా గెలుస్తుందనే అంచనాకు వచ్చినట్టు చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లోని తన నివాసంలో సీఎం రేవంత్ పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, నియోజకవర్గాల ముఖ్య నేతలతో పోలింగ్ సరళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ అన్ని చోట్ల ఓటింగ్ కాంగ్రెస్‌కు అనుకూలంగా జరిగిందనీ, వంద రోజుల కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజలు మొగ్గు చూపారని అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల నుంచి సానుకూలత వ్యక్తమైందని అంచనాకు వచ్చినట్టు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం పెరుగుతుందని వివరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.40 శాతం ఓట్లు వచ్చాయనీ, అప్పటితో పోలిస్తే 5 శాతానికి మించి పార్టీకి ఓటు బ్యాంకు తప్పకుండా పెరుగుతుందని విశ్లేషించు కున్నట్టు పేర్కొన్నారు. వివిధ సర్వేల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ ప్రకారం 13 సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు పక్కాగా గెలిచే అవకాశాలున్నాయన్నారు. మిగతా నియోజకవర్గాల్లో ఫలితాలు అంచనా వేసేలా లేవని అభిప్రాయపడ్డారు. కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ రెండో స్థానానికి పోటీ పడిందన్నారు. బీఆర్ఎస్ ఎక్కడ కూడా పోటీలో కనిపించలేదనే సమాచారముందని చెప్పారు. నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల, సికింద్రాబాద్ సీట్లలో తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మిగతా నియోజకవర్గాల్లో సానుకూలత ఉన్నప్పటికీ ఓటర్ల నాడి అంచనాకు చిక్కలేదనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలిపారు. ఆరేడు స్థానాల్లో ...11లో

ఏపీలో ఎవరు అధికారంలోకి వచ్చినా కలిసి పని చేస్తాం

ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు పార్టీలతో సంబంధం లేదనీ, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డులు

రైతులు పండించిన ధాన్యాన్ని రేషన్ షాపుల్లో అందించే ఆలోచన చేస్తున్నామనీ, త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని రేవంత్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్, ధరణి తదితర అంశాలపై శాసనసభలో చర్చిస్తామని రేవంత్ చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు ప్రభాకరరావు ఎవరో తనకు తెలియదని కేసీఆర్ అంటున్నారనీ, కానీ ఈ కేసులో ఆయన ఉన్నట్టు కూడా తనకు తెలియదని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీపై, గిట్టుబాటు ధర, విద్యాశాఖ తదితర కీలక శాఖలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. రేసింగ్ కేసులో నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరుగుతోందన్నారు. ఆకస్మిక తనిఖీలు, పర్యటనలు ఉంటాయని చెప్పారు. మూసీ నదిని ఆదాయవనరుగా మారుస్తామనీ, దీనిపై త్వరలో బ్యాంకర్లతో సమావేశమవుతామని రేవంత్ చెప్పారు. అన్ని హాస్టళ్లకు సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులపై కేబినెట్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రేవంత్ చెప్పారు.

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వ్యవహారం

- రాష్ట్ర ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల విముఖత : సిరిసిల్ల మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కేటీఆర్
- పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు బీఆర్ఎస్‌వేనని ఆశాభావం



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీలాగా బీజేపీ, కాంగ్రెస్ వ్యవహరిస్తున్నాయని, ఈ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సోషల్ మీడియా వారియర్స్, నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా మొక్కవోని ధైర్యంతో పార్టీకి అండగా ...11లో

వారణాసిలో మోడీ నామినేషన్

ప్రతిపాదకులు ఆ నలుగురు

- ఇది ఓటు రాజకీయమే: ప్రతిపక్షాలు
- హాజరైన ఎన్డీఏ సీఎంలు, కేంద్ర మంత్రులు, మిత్రపక్షాల నేతలు



వారణాసి : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం వారణాసిలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాగస్వామ్య పక్షాల నేతలు పాల్గొన్నారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా మోడీ వారణాసి నుండే పోటీ చేసి విజయం సాధించారు. మోడీ నామినేషన్‌పై ప్రతిపాదకులుగా సమాజంలో విభిన్న వర్గాలకు చెందిన నలుగురు సంతకాలు చేయడం విశేషం. బ్రాహ్మణ సమాజానికి చెందిన పండిట్ జ్ఞానేశ్వర్ శాస్త్రి, ఆర్ఎస్ఎస్ ...11లో

రాష్ట్రంలో 65.67 శాతం పోలింగ్

5లో వివరాలు

- భువనగిరిలో అత్యధికంగా 76.78 శాతం
- హైదరాబాద్‌లో అత్యల్పంగా 48.48 శాతం : రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వెల్లడి



కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

- మే 20న హాజరు పర్చాలని ఉత్తర్వులు
- 8 వేల పేజీలతో కవితపై ఈడీ చార్జిషీట్
- అదే రోజు పరిశీలిస్తామన్న ట్రయల్ కోర్టు



5లో వివరాలు



సెల్‌ఫోన్ చార్జీల సెగలు

- ఎన్నికల తర్వాత రీచార్జ్ బాదుడు
- టెల్కోల యోచన.. 25 శాతం పెరగొచ్చు : ఆక్సిస్ కాపిటల్ రిపోర్ట్

న్యూఢిల్లీ : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు ముగియగానే మొబైల్ ఫోన్ రీచార్జ్ బాదుడు షురూ కానుందని తెలుస్తోంది. వినియోగదారులపై ఇప్పటికే భారంగా ఉన్న మొబైల్ ఫోన్ బిల్లులను టెలికం కంపెనీలు మరోమారు పెంచడానికి సిద్ధం అవుతున్నాయి. ప్రస్తుత ఎన్నికల ఫలితాల తర్వాత చార్జీల పెంపునకు టెలికం కంపెనీలు ప్రణాళికలు వేస్తున్నాయని బ్రోకరేజీ సంస్థ ఆక్సిస్ కాపిటల్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ప్రస్తుత ధరలపై 25 శాతం వరకు ధరలు పెంచాలని యోచిస్తున్నాయి. టెలికం పరిశ్రమలో పోటీ, టెక్నాలజీ కోసం పెట్టుబడులు పెరిగాయనే సాకుతో ప్రస్తుత ప్రభుత్వ మద్దతుతో టారిఫ్ ధరల పెంపునకు ప్లాన్లు వేస్తున్నాయి. ధరలు పెంచినా ప్రజలు భరించడానికి సిద్ధంగా ఉన్నారని టెలికం కంపెనీలు భావిస్తున్నాయని విశ్లేషించింది. జూన్ 1 నాటికి దేశంలో ...5లో

రైతన్న ఆగ్రహం..

సకాలంలో లారీలను పంపి వడ్లను కొనుగోలు చేయాలి

- భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- కొనుగోలు చేస్తామన్న అధికారుల హామీతో విరమణ
- కాగజ్‌నగర్‌లో తూకంలో మోసంపై రైతుల నిలదీత





నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్/ కాగజ్‌నగర్

సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో పాటు కొనుగోలు చేస్తున్న సమయంలో తూకంలో మోసంతో నష్టపోతున్నామని ఆరోపిస్తూ భువనగిరి, కాగజ్‌నగర్‌లో రైతులు ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని ఆకుతోటబావి తండాకు చెందిన రైతులు.. భువనగిరి కలెక్టరేట్ ఎదుట తడిసి మొలకెత్తిన ధాన్యం రాశులను పోసి ఆందోళన చేశారు. మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులు బస్తాలతో ధాన్యాన్ని తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు కొనుగోలు చేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలించేందుకు లారీలను ఏర్పాటు చేస్తామని, తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే ఆకుతోట బావితండా కొనుగోలు కేంద్రాల్లో లారీలను ఏర్పాటు చేశారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు సుధాకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, ఉమ్లా నాయక్, రవిందర్, దేవేందర్, సాగర్, లాలు, రవిందర్, రమేష్, రాములు, శాంతమ్మ, పద్మా, సుగుణ, సుజాత, బుజ్జి, లక్ష్మి, నరేష్, శ్రీనివాస్, శ్రీశైలం, బిచ్చపతిలు పాల్గొన్నారు.

కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామంలో దహెగాం ...11లో

జూన్ 4న రైతు రుణమాఫీ

ఇండియా బ్లాక్‌దే అధికారం


- ఎవరెన్ని కుట్రలు చేసినా భయపడం : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: జూన్ 4వ తేదీన పేద రైతుల రుణాలను మాఫీ చేయబోతున్నామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. యూపీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ మాట్లాడారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ అధికారంలోకి రాబోతోందని చెప్పారు. 'మేం అధికారంలోకి ...11లో

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

- జూన్ 4 వరకు పరిసరాల్లో 144 సెక్షన్
- ప్రభాకర్‌రావు కోసం రెడ్ కార్నర్ నోటీస్‌పై త్వరలోనే చర్యలు : 'నవతెలంగాణ'తో రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు, ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన పోలింగ్‌కు సంబంధిం చిన ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటైన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన 'నవతెలంగాణ'తో మూడంచెల భద్రతా ...11లో

ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తం



అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్.. అంతు చిక్కని ఓటరు నాడి

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత
- పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల సరళిపై పోస్ట్‌మార్టం
- మూడు పార్టీల్లోనూ గెలుపుపై ధీమా.. ఎవరి లెక్కలు వారివే

ఫలితాల కోసం 20 రోజుల నిరీక్షణ

అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఓటర్లు తమ అభిప్రాయాల్ని బ్యాలెట్ యూనిట్‌లో వ్యక్తం చేశారు. పోలింగ్ సరళి చూశాక ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. దీంతో అభ్యర్థుల్లో టెన్షన్ అధికమవుతోంది. నరాలు తెగే ఉత్కంఠకు గురి చేస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిపై పోస్ట్‌మార్టం చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పట్టణ ఓటర్లు ఓ తీరుగా.. గ్రామీణ ప్రాంత ఓటర్లు మరో తీరుగా.. పార్టీల వైపు మొగ్గు చూపినట్టు విశ్లేషణలు చెప్తున్నారు. ఫలితాలు ఎట్లా ఉంటాయనేది అభ్యర్థులకే కాదు.. పార్టీ అధినేతలతో సహా ఓటేసిన ఓటర్లకు సైతం అంతు చిక్కని పరిస్థితి నెలకొంది. తీరని ఉత్కంఠకు తెరపడేందుకు మరో 20 రోజుల పాటు నిరీక్షించక తప్పదు.

అంతు చిక్కని మెదక్ ఓటరు నాడి.. అభ్యర్థుల్లో టెన్షన్

పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఓటరు నాడి అంతు చిక్కట్లేదనే చెప్పాలి. ఓటర్ల తీర్పు పట్ల స్పష్టత రాకపోయే సరికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 75.09 శాతం ఓట్లు పోలయ్యాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 84.25 శాతం పోలవగా, పటాన్‌చెరు నియోజకవర్గంలో 63.01 శాతమే ఓట్లు పడ్డాయి. మెదక్ లోక్‌సభ నియోజక వర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మూడు పార్టీల మధ్య తీవ్రమైన పోటీ జరిగింది. ఓటర్లు సైతం ఒక వైపు మొగ్గలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం హరీశ్‌రావు, కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించి పోల్ మేనేజ్‌మెంట్ చేయగలిగారు. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను అనుకూలంగా మలుచుకున్నారు. గ్రామీణ ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినప్పటికీ పట్టణాల్లో ఆ పరిస్థితి కనిపించలేదు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ ఆధిక్యం సాధిస్తుందనే ...11లో

రాయ్‌బరేలీలో వీహెచ్ ప్రచారం

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయ్‌బరేలీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి మద్దతుగా మాజీ ఎంపీ వి. హనుమంతరావు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బుధవారం రాయ్‌బరేలీలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లు, జనసమీకరణపై ఆ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంకజ్ తివారీతో ఆయన చర్చించారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ హాజరుకానున్నారు.

భువనగిరి నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు

- సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్

నవతెలంగాణ - భువనగిరి



భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గంలోని ప్రజలు సీపీఐ(ఎం)ని ఆదరించి ఓట్లు వేసినందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు సీపీఐ(ఎం)ను పార్లమెంటు ఎన్నికల్లో పార్టీకి ఓటు వేసినందుకు, ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం కల్పించినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజా పోరాటాల ద్వారా నిరంతరం ప్రజలకు మరింత చేరువ అవుతామని తెలిపారు. ప్రజలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేసే పోరాటాలను మరింత బలపరిచి ఆదరించాలని కోరారు. ప్రజా పోరాటాలకు ఊతం ఇవ్వాలని, ఎల్లప్పుడూ సీపీఐ(ఎం) ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తుందని పేర్కొన్నారు.

ఢిల్లీ ఐటీ ఆఫీసులో అగ్ని ప్రమాదం

- ఒక ఉద్యోగి మృతి



న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఒక ఆదాయ పన్ను కార్యాలయంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక ఉద్యోగి మరణించారు. మంగళవారం మధ్యాహ్నం సెంట్రల్ రెవిన్యూ భవనంలో ఉన్న ఆదాయ పన్ను కార్యాలయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది 21 అగ్నిమాపక యంత్రాలతో అక్కడకు చేరుకున్నారు. సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఏడుగురిని కార్యాలయం నుంచి రక్షించారు. ఒక వ్యక్తి స్పృహ తప్పి ఉండగా గుర్తించి, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతున్ని 46 ఏళ్ల ఆఫీస్ సూపరింటెండెంట్‌గా గుర్తించారు. ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా వెల్లడి కాలేదు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టుల సలహాదారునిగా రంగారెడ్డి

- సర్కారు ఉత్తర్వులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల సలహాదారులుగా ఎన్.రంగారెడ్డి నియమితులయ్యారు. గతంలో సీఎం సలహాదారులుగా పనిచేసిన రంగారెడ్డి, ప్రధానంగా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో కీలకపాత్ర పోషించారు. ముక్కుసూటి అధికారిగా పేరు ఉండటంతో ఆయన్ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించలేదనే ప్రచారం సాగునీటి పారుదలశాఖలో ఉంది. కల్వకుర్తి, నెట్టెంపాడు, రాజీవ్ భీమాతోపాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందు కుగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాన్ని చేపట్టింది. ఈమేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నెలరోజుల తర్వాత రంగారెడ్డి బాధ్యతల్లోకి వస్తారని సమాచారం.

పారిస్‌లో జైలు వ్యాన్‌పై దుండగుల దాడి

- ఇద్దరు అధికారులు మృతి, తప్పించుకున్న ఖైదీ

పారిస్ : ఖైదీని తీసుకువెళుతున్న ఒక జైలు వ్యాన్‌పై మంగళవారం దాడి జరగడంతో ఇద్దరు జైలు అధికారులు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈలోగా ఆ ఖైదీ కూడా తప్పించుకుని పారిపోయాడని పారిస్ పోలీసు వర్గాలు న్యాయ శాఖ మంత్రి ఎరిక్ దూపాండ్ మొరెటికి తెలిపాయి. ఉత్తర ఫ్రాన్స్‌లోని ఇంకారవిల్లె ఏరియాలో ఈ దాడి జరిగింది.

ADVERTISEMENT

1. HQ 1 EME Centre, Secunderabad invites application for running of Regtl Tailor Shop at 4 Trg Bn on contract basis, reserved for ESM only.
2. Allotment of shop will be done to the highest bidder as per the guidelines issued by LWE Dte. Min Reserve Price is Rs. 2,500/- pm.
3. Application will be available from Military Finance Section1 EME Centre from the date of advertisement for ten days (upto **25th May 2024**) on payment of Rs.500/-(Rupees five hundred only) non refundable.
4. Last date of submission of documents is **31st May 2024** at 1200hr

Administrative Officer
HQ 1 EME Center,
PO: JJ Nagar, Bolarum,Secunderabad,Telangana-500087

NATCO Pharma Limited

Regd. Office: Natco House, Road No.2, Banjara Hills, Hyderabad-500 034, Phone: 040-23547532
Email: investors@natcopharma.co.in CIN: L24230TG1981PLC003201, www.natcopharma.co.in

ప్రకటన

కంపెనీలో తమ వద్ద ఉన్న షేర్ సర్టిఫికెట్లు పోగొట్టుకున్నట్లు/తప్పిపోయినట్లు కింది షేర్‌హోల్డర్ల నుండి కంపెనీకి సమాచారం అందిందని దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 15 రోజులలోపు కంపెనీకి ఎటువంటి అభ్యంతరం రాకపోతే, కంపెనీ కింది షేర్‌హోల్డర్లకు నకిలీ షేర్ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. దిగువ పేర్కొన్న షేర్ సర్టిఫికేట్(ల)తో ఇకపై వ్యవహరించవద్దని పబ్లిక్‌ని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు తద్వారా సంభవించే ఏదైనా నష్టం/నష్టానికి కంపెనీ బాధ్యత వహించదు

క్రసం.	ఫోలియో.	పేరు	వాటాలు	సర్టిఫికేట్ నెం.లు		వరుస సంఖ్యలు	
1	002826	లీలా గర్జా కంజి గర్జా	500	270	2770	171876281	171876780

ప్రదేశం: హైదరాబాద్
తేది: 14-05-2024

for NATCO PHARMA LIMITED
సం/- సిహెచ్.వెంకట్ రమేష్
కంపెనీ సెక్రటరీ & కంప్లియన్స్ ఆఫీసర్

సవరణ

ICICI Bank — బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూర్-560068.

SARFAESI Act కింద డిమాండ్ నోటీసు ప్రచురణకు సంబంధించి, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారంతో, లోన్ అకౌంట్ నెంబర్ LBVPM00005752351 మరియు LBVPM00005819362, రుణగ్రహీతల పేర్లు.. **గంధం శ్రీనివాసరావు** మరియు **గంధం త్రివేణి** కొరకు డిమాండ్ నోటీసు తేది 06-ఫిబ్రవరి-2023 & భౌతిక స్వాధీనత నోటీసు తేది & దాని ప్రచురణ తేది **16.12.2023(న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్(ఇంగ్లీష్) & నవతెలంగాణ)**. పైన పేర్కొన్న నోటీసులో చెప్పబడిన ఆస్తి చిరునామాలో మరియు దాని ప్రచురణలో అనుకోకుండా మరియు అజాగ్రత్త వల్ల టైపోగ్రాఫికల్ పొరపాటు జరిగిందని గుర్తు చేస్తున్నాం. **13.2 నోటీసు తేదీ వివరాలలో భౌతిక స్వాధీనతను పత్రికలో 06.02.2002గా పేర్కొన్నది తప్పు,** దయచేసి దానిని సరైన వివరాలతో **13.2 నోటీస్ తేదీ 06.02.2023** గా చదవగలరని మనవి.

తేది: మే 15,2024
ప్రదేశం: హైదరాబాద్

అధీకృత అధికారి,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్.

జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

JM FINANCIAL

కార్పొరేట్ గుర్తింపు నెంబర్: U67190MH2007PLC174287
రిజిస్టర్డ్ ఆఫీసు చిరునామా: 7వ అంతస్తు, సినెర్జీ, అప్పాసాహెబ్ మరాఠె మార్గ్, ప్రభాదేవి, ముంబయి-400025
T: +91 22 6630 3030 | F: +911 22 6630 3223 | www.Jmfinancialarc.com

డిమాండ్ నోటీసు

...సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ("SARFAESI చట్టం")లోని సెక్షన్ 5(1)(బి) ప్రకారం అన్ని హక్కులు, టైటిల్ మరియు దానిపై వడ్డీతోసహా దానికోసం క్రియేట్‌చేసిన అంతర్లీన సెక్యూరిటీ ఇంట్రెస్ట్‌తోసహా (దిగువ పేర్కొన్న రుణాలతోపాటుగా) పూల్ ఆఫ్ లోన్‌ను అప్పగించింది. దిగువ సంతకందారు (జెఎం) అసైనీ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరుచట్టం) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవగల సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్13(2) ప్రకారం బకాయిలను తిరిగిచెల్లించాలని కోరుతూ రుణగ్రహీత(లు) ("సదరు రుణగ్రహీతలు") డిమాండ్ నోటీసు జారీ చేశారు, వారి వివరాలు కూడా దిగువ ఇవ్వబడినవి. పైన పేర్కొన్న దానికి అనుగుణంగా, ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, రుణగ్రహీత(లు) జెఎం వారికి చెల్లించాల్సిన బకాయిని ఈ ప్రకటన జారీ చేయబడిన తేదీ నుంచి 60రోజుల్లోపు తిరిగిచెల్లించాల్సి ఉంటుంది. చెల్లించాల్సినబకాయిల మొత్తాలు దిగువ చూపబడినవి, సదరు మొత్తాన్ని భవిష్యవడ్డీతో పాటుగా కలుపుకొని డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా దిగువ పేర్కొన్న తేదీ/లకు అనుగుణంగా బకాయి చెల్లింపు తేదీనాటికి లెక్కించి తిరిగిచెల్లించవలెను. సదరు మొత్తాన్ని రుణ ఒప్పందంలోని డాక్యుమెంట్లు/రైటింగ్ అనుగుణంగా ఒకవేళ రుణగ్రహీత(ల) ద్వారా జారీచేయబడి ఉన్నట్లయితే దీనిలోని నిబంధనలకు అనుగుణంగా తిరిగిచెల్లించాల్సి ఉంటుంది. రుణాల బకాయికి సంబంధించి సెక్యూరిటీగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు సంబంధించిన ఆస్తులు జెఎం వద్ద తనఖాపెట్టబడినవి.

రుణగ్రహీత(లు)/ హామీదారు(ల) యొక్క పేరు	డిమాండ్ నోటీసు తేదీ మరియు ఎన్‌పిఎ తేదీతో మొత్తం	సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరాలు (స్థిరాస్తి)
(ఎల్‌సి నెం.16900000068 బాంచ్) సోలోమాన్ మదాను (రుణగ్రహీత) రాజీ మదాను (సహ-రుణగ్రహీత 1)	23-04-2024 / రూ.4,48,911/- (రూపాయలు నాలుగు లక్షల నలభైఎనిమిది వేల తొమ్మిది వందల పదకొండు మాత్రమే) ఎన్‌పిఎ (08-01-2023)	ఇ.నెం.7-5/42, ఫ్లాట్ నెం.42 భాగం(ఉత్తరం వైపు) సర్వే నెం.390పి, 386పి, 379పి, దమ్మాయిగూడ జి.పి.నాగారం (గ్రా), కీసర (మం), హైదరాబాద్ హైదరాబాద్, తెలంగాణ-500083

పైన పేర్కొన్న విధంగా జెఎం వారికి సంబంధిత రుణగ్రహీతలు బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలమైనట్లయితే, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తింపదగిన నిబంధనలకు ప్రకారం జెఎం వారు సదరు సెక్యూరిటీ ఆస్తులకు సంబంధించి అనుగుణంగా ముందుకెళ్తారని తెలియజేయనైనది. ఈక్రమంలో పూర్తి రిస్క్, అయ్యే వ్యయప్రయాసలను రుణగ్రహీతలే భరించాల్సి ఉంటుంది. సంబంధిత రుణగ్రహీతలు పైన పేర్కొన్న సంబంధిత చట్టం ప్రకారం ఆస్తులను ఇతరుల పేరిట బదలాయించడం, విక్రయించడం, లీజుకు ఇవ్వడం లేదా మరేఇతర మార్గాల ద్వారా లావాదేవీలకు పాల్పడటం నిషేధించబడింది, ఎలాంటి కార్యకలాపాలను చేపట్టాలని భావించినా జెఎం వారి నుంచి లిఖిత పూర్వకంగా అనుమతి పొందాల్సి ఉంటుంది. పైన పేర్కొన్న యాక్ట్‌లోని నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినా, అతిక్రమించినా సదరు చట్టంలోని నిబంధనల మేరకు వారంతా శిక్షింపబడతారు మరియు/లేదా జరిమానా విధించబడతారని తెలియజేయనైనది.

తేది: 15-05-2024,
ప్రదేశం: తెలంగాణ

సం/- (అధీకృత అధికారి)
జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

స్వాధీనతా ప్రకటన

ICICI Bank — రిజిస్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ దగ్గర, పాత పద్రా రోడ్, వడోదర-390007.
కార్పొరేట్ ఆఫీసు చిరునామా: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబయి-400051
బ్రాంచ్ ఆఫీసు: 3వ అంతస్తు, నెం.1, సెనోటాఫ్ రోడ్, తెన్నంపేట్, చెన్నై-600018

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002లోని రూల్-8(1))

...బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ వద్దగల 120 చ.గ.లు లేదా 100.84 చ.మీ.ల విస్తీర్ణపు సర్వే నెం.లు 563/1/2, 564, 566, 567/1, 568, 569, 570/1/2, 571/2, 613, 615, 572/2, 611, 612, 614/2, 560, 561, 578/4/2 లోని బాగ్ అంబర్‌పేట్, బతుకమ్మకుంటలోని ఎంబిజి కెటగిరి క్రింద ఫ్లాట్ నెం.140 మొత్తం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నెం.139, దక్షిణం: 30' వెడల్పు రోడ్డు, తూర్పు: ఫ్లాట్ నెం.37, పడమర: ఫ్లాట్ నెం.141. ప్రస్తుత మరియు భవిష్యత్ రెండింటితో భూమికి శాశ్వతంగా జతచేసిన అన్ని ప్లాంట్ మరియు మెషినరీ మరియు ఫిక్చర్లు, ఫిట్టింగులు దానిపై అన్ని భవనాలు మరియు నిర్మాణాలతోకలిపి.

తేది: 14 మే, 2024
ప్రదేశం: హైదరాబాద్

సం/-
(అధీకృత అధికారి)
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

B.N. RATHI SECURITIES LIMITED

Corporate Member: NSE, BSE & MCX
Corporate Office: # 6-3-652, IV Floor, "Kautilya", Amrutha Estates, Somajiguda, Hyderabad -82, Tel: 040 - 40527777, 40727777, Fax: 040 - 40526283.
e-mail: bnrsl@bnrsecurities.com www.bnrsecurities.com CIN: L65993TG1985PLC005838

31.03.2024తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

వివరాలు		కన్సాలిడేటెడ్			కన్సాలిడేటెడ్	
	ముగిసినత్రైమాసికం 31.03.2024 (రిఫర్‌నోట్ 7)	ముగిసినత్రైమాసికం 31.03.2023 (రిఫర్ నోట్ 7)	ముగిసినత్రైమాసికం 31.03.2024 (ఆడిట్‌చేసినవి)	ముగిసినత్రైమాసికం 31.03.2024 (ఆడిట్‌చేసినవి)	ముగిసినత్రైమాసికం 31.03.2023 (ఆడిట్‌చేసినవి)	ముగిసినత్రైమాసికం 31.03.2024 (ఆడిట్‌చేసినవి)
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	1617.18	1193.95	5630.77	4646.06	5746.70	4679.83
పన్ను తరువాత సాధారణ కార్యకలాపాల నుండి నికర లాభం/(నష్టం)	251.54	168.20	1014.66	746.93	1053.42	757.93
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (అసాధారణ ఐటంల తరువాత)	251.54	168.20	1014.66	746.93	1053.42	757.93
సంవత్సరానికి పూర్తి సమగ్ర ఆదాయం నికర పన్ను	236.03	175.28	999.14	754.02	1053.41	765.02
ఈక్విటీ వాటా మూలధనం	1025.00	840.00	1025.00	840.00	1025.00	840.00
రిజర్వులు (గత సంవత్సరం యొక్క బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రివ్యాల్యుయేషన్ రిజర్వులు మినహాయించి)	-	-	4828.46	3141.32	-	-
వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంలకు ముందు) (రూ.10/- చొప్పున) బేసిక్ మరియు డైల్యూటెడ్	2.75	2.00	11.08	8.89	11.50	9.02
వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంల తరువాత) (రూ.10/- చొప్పున) బేసిక్ మరియు డైల్యూటెడ్	2.75	2.00	11.08	8.89	11.50	9.02

గమనికలు :

1. కంపెనీచే స్థిరంగా అనుసరించిన అకౌంటింగ్ విధానాలను అనుసరించి పై పేర్కొన్న కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలు ఉన్నాయి. ("ఐఎన్‌డి ఏఎస్") మరియు భారతదేశంలో సాధారణంగా ఆమోదించిన ఇతర అకౌంటింగ్ విధానాలు మరియు సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా ("సెబీ")చే జారీచేయబడిన మార్గదర్శకాలతో క్రింద జారీచేయబడిన సంబంధిత రూల్స్‌తో చదవబడే కంపెనీల చట్టం, 2013 (ది చట్టం)లోని సెక్షన్ 133 క్రింద ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి ఈ ఫలితాలు కలవు.
2. పై ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సిఫారసు చేయబడినవి మరియు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్), రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 నియమాలను అనుసరించి 14.05.2024న నిర్వహించబడిన వారి సమావేశంలో...

ప్రదేశం: హైదరాబాద్
తేది: 15-05-2024

for B N Rathi Securities Limited
సం/-
హరి నారాయణ్ రాఠి
మేనేజింగ్ డైరెక్టర్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

IDFC FIRST Bank

(పూర్వం ఐడిఎఫ్‌సి ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డ్ ఆఫీస్: కెబిఎం టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
TEL: +91 44 4564 4000 | FAX: +91 44 4564 4022.

అనుబంధం 4 (రూల్ 8 (1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలంగా దిగువ సంతకందారైన **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (పూర్వం క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)** యొక్క అధీకృత అధికారి తెలియజేయునది ఏమనగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్,2002లోని సెక్షన్ 13(12)తో పాటు చదవదగిన రూల్ 3 ద్వారా సంక్రమించిన అధికారాలకు అనుగుణంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు **1. దిగుళ్ల శంకర్, 2. డి.స్వప్న.. 16.07.2022** వరకు నోటీస్‌లో పేర్కొన్న మొత్తం **రూ.55,13,378.40/- (రూపాయలు యాభై ఐదు లక్షల, పదమూడు వేల, మూడు వందల డెబ్బై ఎనిమిది మరియు నలభై పైసలు మాత్రమే)**డిమాండ్ నోటీస్ అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతూ తేది **16.07.2022**న డిమాండ్ నోటీస్ జారీ చేయడమైనది. రుణగ్రహీతలు బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, దిగువ పేర్కొన్న సంతకందారు ,సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్,2002 యాక్ట్‌లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4)లోని చదవదగిన రూల్ 8 ప్రకారం సంక్రమించిన అధికారాలకు అనుగుణంగా దిగువ పేర్కొన్న ఆస్తిని **10 మే, 2024**న లాంఛనప్రాయంగా స్వాధీనంలోకి తీసుకున్నారు.

ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా సదరు ఆస్తికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు నిర్వహించొద్దు మరియు ఒకవేళ లావాదేవీలను నిర్వహించదలచినట్లయితే **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (పూర్వం క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)** వారికి మొత్తం **రూ.55,13,378.40/- (రూపాయలు యాభై ఐదు లక్షల, పదమూడు వేల, మూడు వందల డెబ్బై ఎనిమిది మరియు నలభై పైసలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ చెల్లించడానికి లోబడి ఉంటుంది. చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నిబంధనలమేరకు తగిన సమయంలో సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరడమైనది.

స్థిరాస్తి యొక్క వివరణ

...ఫ్లోర్, మొదటి అంతస్తు, రెండో అంతస్తు మరియు మూడో అంతస్తు కలిగియున్నది, 88.88 చ.గజాలు లేదా 74.30 చ.మీటర్ల విస్తీర్ణం, సెకండ్ బజార్ వద్ద ఉన్నది, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం మరియు **సరిహద్దులు:-తూర్పు:** రోడ్డు, **పడమర:**లేన్, **ఉత్తరం:**లేన్, **దక్షిణం:** పొరుగువారి ఇల్లు.

తేది: 10 మే,2024
ప్రదేశం: తెలంగాణ
రుణ ఖాతా నెం: 28322952

సం./-
అధీకృత అధికారి,
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(పూర్వం క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)

HDFC BANK — We understand your world

రిజిస్టర్డ్ కార్యాలయం: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పారెల్(వెస్ట్), ముంబయి-400 013 మరియు దీని యొక్క ఒక కార్యాలయం
రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ ఎట్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, మొదటి అంతస్తు, ఐ-థింక్ టెక్నో క్యాంపస్, కంజుర్‌మార్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వద్ద తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన సమాచారం మరియు బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("ద బ్యాంక్") యొక్క రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా, బ్యాంక్ వద్ద తనఖాపెట్టి రుణ స్వభావం/సెక్యూరిటీలపై ఓవర్‌డ్రాఫ్ట్‌ల రూపంలో రుణ సౌకర్యం పొందిన సెక్యూరిటీల అమ్మకానికి సంబంధించి.

లోన్ అగ్రిమెంట్ ప్రకారం బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలమైన కారణంగా, దిగువ పేర్కొన్న రుణ ఖాతా నెంబర్లు డెలిన్క్వెంట్ స్టేటస్‌గా మారాయి. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు బ్యాంక్ నుంచి పలు నోటీసులు పంపడం జరిగింది, చివరిగా దిగువ చూపబడిన తేదీల్లో సేల్ నోటీసు పంపబడింది. తాకట్టును బ్యాంక్ గుర్తు చేస్తోంది మరియు దిగువ పేర్కొన్న రుణ ఖాతాలకు సంబంధించి బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లించుటకు 7 రోజుల సమయమిస్తోంది. ఒకవేళ నిర్దిష్ట గడువులోపు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించకపోయినట్లయితే, బ్యాంక్ వారు ఇకపై ఎలాంటి నోటీసు జారీ చేయకుండా తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించేందుకు స్వేచ్ఛ కలిగియున్నారు. ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, బ్యాంక్‌కు బకాయి ఉన్న మొత్తాలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు నిర్లక్ష్యం వహించారు మరియు విఫలమయ్యారు. కాబట్టి లోన్ అగ్రిమెంట్ ప్రకారం రుణగ్రహీతలు తనఖాపెట్టిన సెక్యూరిటీలను బ్యాంక్‌వారు తమకు ఉన్న హక్కులను వినియోగించుకొని **22 మే,2024**న లేదా ఆ తర్వాతగానీ రుణగ్రహీతల నుండి బకాయిలను రాబట్టుకునే క్రమంలో విక్రయించడానికి/డిస్పోజ్ చేయడానికి నిర్ణయించారు. రుణగ్రహీతలకు తెలియజేయు మరో విషయం ఏమనగా, స్టాక్ మార్కెట్ అస్థిరత వల్ల ఏ క్షణంలోనైనా తనఖాపెట్టిన సెక్యూరిటీల విలువ తగ్గినట్లయితే ఒక (1) క్యాలెండర్ రోజు లోపు సదరు సెక్యూరిటీలను ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విక్రయించే అధికారం బ్యాంక్ వారికి ఉంటుంది. తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించిన తర్వాత కూడా బ్యాంక్‌కు రావాల్సిన బకాయి మొత్తం సరిపోకపోయినట్లయితే మిగతా మొత్తాన్ని రుణగ్రహీత/లు బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

క్ర సం.	రుణ ఖాతా నెంబర్	రుణగ్రహీత పేరు	12 మే,2024 నాటికి బకాయి ఉన్న మొత్తం	సేల్ నోటీసు తేదీ
1	XXXX0276	ఎస్ సోమశేఖర్	1,35,575.75	13 మే 2024
2	XXXX4574	వడ్డెబోయిన పాండుగౌడ్	9,03,254.45	13 మే 2024
3	XXXX7802	దేవులపల్లి శ్రీనివాస్‌రావు	17,791.59	20 ఏప్రిల్ 2024
4	XXXX9434	కాసిపేట బాలకృష్ణ	1,14,182.09	13 మే 2024

తేది: 15.05.2024
ప్రదేశం: తెలంగాణ

సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్
హైదరాబాద్ వద్ద బెంచ్‌వారి సమక్షంలో
కంపెనీ స్కీమ్ పిటిషన్ నెం. C.P.(CAA)/13/HYD/2024
సంబంధించి
కంపెనీ స్కీమ్ అప్లికేషన్ నెం. CA/ (CAA) 66/230/HDB/2023
కంపెనీల చట్టం, 2013 విషయంలో
మరియు

...

సిద్ది కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ — సిఐఎన్: U27310TG2011PTC077833 — రిజిస్టర్డ్ కార్యాలయం: 6-3-643/401,4వ అంతస్తు, పద్మజ లాండ్ మార్క్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ, 500082. ...అమాల్గమేటింగ్ కంపెనీ 1

సిద్ది రైల్ అండ్ ఇంజినీరింగ్ కాంపోనెంట్స్ లిమిటెడ్ — సిఐఎన్: U29100TG2020PLC144524 — రిజిస్టర్డ్ కార్యాలయం: 6-3-648/401,4వ అంతస్తు, పద్మజ లాండ్ మార్క్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ, 500082. ...అమాల్గమేటింగ్ కంపెనీ 2

సిద్ది ఇంజినీరింగ్ లిమిటెడ్ — సిఐఎన్: U29253TG1983PLC004141 — రిజిస్టర్డ్ కార్యాలయం: 6-3-648/401, 4వ అంతస్తు, పద్మజ లాండ్ మార్క్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ, 500082. ...అమాల్గమేటెడ్ కంపెనీ

పిటిషన్ విచారణ నోటీసు

...

తేది: 14 మే, 2024
ప్రదేశం : హైదరాబాద్

పిటిషన్ ప్రకటన
ఫారం నెం.ఎన్‌సిఎల్‌టి.3ఎ
వివరణాత్మక పిటిషన్ ప్రకటన
(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ రూల్స్, 2016లోని 35 చూడండి) స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్‌ను అనుసరించి

వీటి యొక్క
అస్పైరింగ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్

...

ప్రదేశం: హైదరాబాద్
తేది: 11-05-2024

'మత' రాజకీయ ప్రకటనలు!

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌కు కోట్లలో చెల్లింపులు
- సింహభాగం బీజేపీకే
- ఆ పార్టీకి అనుకూలంగా అదృశ్య ఖాతాలు
- విద్వేషాలు రెచ్చగొట్టడమే వాటి లక్ష్యం



న్యూఢిల్లీ : ఈ నెల 7న లోక్‌సభ ఎన్నికల మూడో దశ పోలింగ్ జరగడానికి రెండు వారాల ముందు మెటా వేదికల్లో రాజకీయ ప్రకటనల కోసం పేరొందిన 20 ప్రచార సంస్థలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లకు రూ.17 కోట్లు చెల్లించాయి. వీటిలో కనీసం 30 ప్రకటనలు మతపరమైనవి. ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వీటిని ఉద్దేశించారు. ఏప్రిల్ 23-మే 6 తేదీల మధ్య జరిపిన చెల్లింపుల్లో కేవలం ఐదు మాత్రమే రాజకీయ పార్టీల నుంచి జరిగాయి. మిగిలిన పదిహేను స్వయం ఉపాధి పొందుతున్న వారు జరిపిన చెల్లింపులే. ఇవి అదృశ్య ఖాతాల నుంచి జరుగుతుంటాయి. ఇవి ఎవరివో తెలుసుకోవడం అసాధ్యం. వీరందరూ తమ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీల నుండి రాజకీయ ప్రకటనలు ఇచ్చారు.

బీజేపీ ఖర్చే అధికం

మూడో దశ పోలింగ్‌కు రెండు వారాల ముందు మెటా వేదికల్లో రాజకీయ ప్రకటనల కోసం బీజేపీ అత్యధికంగా రూ.5.63 కోట్లు ఖర్చు చేసింది. కాంగ్రెస్ పార్టీ రూ.4.81 కోట్లతో రెండో స్థానంలో ఉంది. బిజూ జనతాదళ్ (బీజేడీ) తన అనుబంధ పేజీ అయిన 'అమా చిన్హా సంకా చిన్హా' నుండి ప్రకటనల కోసం రూ.2.15 కోట్లు ఖర్చు చేసింది. బీజేపీ అనుకూల ప్రకటనలు ఇచ్చే చరిత్ర కలిగిన ఫిర్ ఏక్‌బార్ మోడీ సర్కార్, మనమోడీ పేజీలను నిర్వహించే గుర్తు తెలియని ఖాతాల నుండి రూ.57.64 లక్షలు, రూ.42.17 లక్షల చెల్లింపులు జరిగాయి. తెలుగుదేశం (రూ.32.16 లక్షలు), తృణమూల్ కాంగ్రెస్ (రూ.23.84 లక్షలు) కంటే ఈ అదృశ్య (గుర్తు తెలియని) ఖాతాల నుండే ఎక్కువ మొత్తంలో చెల్లింపులు జరగడం విశేషం. కాంగ్రెస్, బీజేడీ, తెలుగుదేశం, తృణమూల్ కాంగ్రెస్ పెట్టిన ప్రకటనల ఖర్చును మినహాయిస్తే మిగిలిన చెల్లింపుల్లో అధిక భాగం బీజేపీకి మద్దతు ఇస్తున్న సంస్థలు చేసినవే.

అదృశ్య ఖాతాల నుంచి అనుకూల ప్రకటనలు

ఏప్రిల్ 19న జరిగిన తొలి దశ పోలింగ్‌కు ముందు కూడా అనేక గుర్తు తెలియని సంస్థలు మెటా వేదికల్లో బీజేపీ అనుకూల ప్రకటనలు ఇచ్చాయి. వాటిలో చాలా వరకూ మతపరమైనవే. మెటా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో రాజకీయ ప్రకటనలు ఇచ్చే వారు ముందుగా తమ ఫోన్ నెంబర్లు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ నెంబరుతో ఉన్న ఫోన్లన్నీ స్విచ్ ఆఫ్ చేసి ఉండడం గమనార్హం. నిబంధనలను తరచూ ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తామని మెటా ప్రతినిధి తెలిపారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే గుర్తు తెలియని వ్యక్తులు లేదా సంస్థలు ఇచ్చే రాజకీయ ప్రకటనలు మెటా విధానాలను ఉల్లంఘించడం లేదు. అందువల్ల వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

బీజేపీ కర్నాటక రాష్ట్ర శాఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ పోస్ట్ పెట్టింది. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతుల రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని దాని సారాంశం. ఈ వీడియోను తొలగించాలంటూ ఎక్స్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశించింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఆ వీడియోను ఎక్స్ తొలగించింది. మెటా వేదికల్లో వచ్చిన బీజేపీ అనుకూల ప్రకటనల కోసం రూ.27.6 లక్షలు ఖర్చు చేశారు. బీజేపీ అనుకూల ప్రకటనలు నడిపే 'సిద్ధ ఛష్మా' అకౌంట్ కూడా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ ఓ యాడ్ ఇచ్చింది. ఏప్రిల్ 24-27 తేదీల మధ్య ఈ ప్రకటన వచ్చింది. దీనికి లక్షలాది హిట్లు కూడా వచ్చాయి. వీటిపై సిద్ధ ఛష్మా రూ.16 లక్షలు ఖర్చు చేసింది. ముద్దే కీ బాత్ పేరుతో ఉన్న మరో పేజీలో కూడా ఈ ప్రకటన వచ్చింది. మొత్తంగా బీజేపీ అనుకూల ప్రకటనల కోసం సిద్ధ ఛష్మా రూ.31.64 లక్షలు, ముద్దే కీ బాత్ రూ.21.4 లక్షలు ఖర్చు చేశాయి.

ఏఐ సాయంతో..

గత నెలలో ప్రముఖ హిందీ నటులు అమీర్ ఖాన్, రణ్‌వీర్ సింగ్‌ల నకిలీ వీడియోలు (డీప్‌ఫేక్స్) సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీని విమర్శిస్తూ, కాంగ్రెస్‌కు ఓటేయాలని వారు కోరినట్లు ఆ వీడియోల్లో ఉంది. కృత్రిమ మేథ (ఏఐ) పరిజ్ఞానం సాయంతో వీటిని మార్ఫింగ్ చేశారు. 'న్యాయం కోసం ఓటే యండి... కాంగ్రెస్‌కు ఓటేయండి' అనే కాంగ్రెస్ నినాదంతో ఈ వీడియో ముగుస్తుంది. దీనిపై బీజేపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

తప్పుదోవ పట్టించే వీడియోలు

ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని ఇస్తున్న ఈ ప్రకటనల్లో ప్రజలను తప్పుదోవ పట్టించే విషయాలు ఉంటున్నాయి. వీటిలో వక్రీకరించిన పాత వీడియోలు కూడా ఉంటాయి. వీటిని సామాజిక మాధ్యమాలలో కూడా షేర్ చేస్తున్నారు. ఉదాహరణకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సంబంధించిన ఓ పాత వీడియోను తీసుకుందాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ముస్లింలకు ఇస్తున్న 4శాతం రిజర్వేషన్లను తొలగించడంపై ఆయన అందులో మాట్లాడారు. దీనిని ఎడిట్ చేసి ఎస్సీలు, ఎస్టీలు సహా అన్ని వర్గాలకూ ఇస్తున్న రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఆయన చెప్పినట్లు చూపారు. ఈ వీడియోను షేర్ చేసిన ఐదుగురు తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

మోడీ మళ్లీ ప్రధానైతే

దేశంలో ఎన్నికలే జరగవు : ఖర్గే



మహారాజ్‌గంజ్ (యూపీ): ప్రధాని మోడీని 'ఝూథోన్ కా సర్దార్' (అబద్ధాల రాజు) అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. ఆయన మళ్లీ ప్రధాని అయితే దేశంలో ఇక ఎన్నికలు జరగవని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీరేంద్ర చౌదరికి మద్దతుగా ఇక్కడ జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఖర్గే మాట్లాడారు. ప్రధాని మోడీ అనేక హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్‌తో సహా పలువురు ఇండియా బ్లాక్ నాయకుల సమక్షంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ, "ప్రధాని అబద్ధాలు చెబుతున్నారు. మోడీ అబద్ధాలకోరు, దగాకోరుల ('ఝూథోన్ కా సర్దార్')." "ఈ వ్యక్తి (మోడీ) మళ్లీ (ప్రధానిగా) వస్తే, ఎన్నికలు ఉండవు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు లేదా మహిళా అభ్యర్థులు ఉండరు." అని స్పష్టం చేశారు. ఎన్నికలను సైద్ధాంతిక పోరుగా పేర్కొన్న ఖర్గే, "మేం మోడీ లేదా యోగి కావచ్చు ఏ వ్యక్తిపైనా పోరాడటం లేదు, ఇది వ్యక్తిగత పోరాటం కాదు" అని అన్నారు. 70 ఏండ్లలో మేం ఏం చేశామని అడుగుతున్నారు. మేం ఏమీ చేయకపోతే మీరు ప్రజాస్వామ్యానికి ప్రధాని కాలేరు. మేం (కాంగ్రెస్) రాజ్యాంగాన్ని రూపొందించి ప్రజాస్వామ్యాన్ని కాపాడినందున మీరు ప్రధాని అయ్యారు. "మీరు ఆ ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది జరగదు. దేశంలోని దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, రైతులు , మేధావులు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయనివ్వరు" అని ఆయన అన్నారు. మహారాజ్‌గంజ్ ఎంపీగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి పంకజ్ చౌదరిని ఉద్దేశించి ఖర్గే, "మీరు ప్రతినిధిగా ఎన్నికై ఏమైనా అభివృద్ధి చేశారా" అని ప్రశ్నించారు. ఈ జిల్లాకు నేపాల్‌తో సరిహద్దు ఉంది. రాజకీయంగా ప్రాధాన్యత ఉంది, ఇప్పటికీ జిల్లా కేంద్రాన్ని రైల్వే లైన్‌తో అనుసంధానం చేయలేదు. మోడీ హయాంలో ఇక్కడ నుంచి అనేక చక్కెర మిల్లులు అదృశ్యమయ్యాయి, ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా కూర్చున్నారు? అని యోగిని నిలదీశారు. "వారు డబుల్ ఇంజిన్ల గురించి మాట్లాడతారు, వాటిలో ఒకటి విఫలమైంది . మరొకటి పట్టాలు తప్పింది" అని అతను ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ చేసిన పనితో పోలిస్తే ఈ డబుల్ ఇంజిన్లు ఏమీ చేయలేవని ఆయన అన్నారు. ఆనకట్టలు, వంతెనలు, పెద్ద ప్రాజెక్టులను పూర్తి చేసిన కాంగ్రెస్‌ను దుర్వినియోగం చేయడమే వారి (బీజేపీ) పని అని ఆయన అన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మండిపడ్డారు. "జపాన్ నుంచి రూ.లక్ష కోట్ల రుణం తీసుకున్నారు. అవి ఎక్కడ ఖర్చు చేశారు? బుల్లెట్ రైలు ఎక్కడ ఉంది?" కాంగ్రెస్ చేసిన పనుల క్రెడిట్ బీజేపీకే దక్కుతుందని ఖర్గే అన్నారు. మీరు ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులకు వేలు ఇస్తే, వారు మొత్తం వ్యక్తిని మింగేస్తారు. కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. "కళంకిత" నాయకులను తమ పార్టీలో చేరమని బలవంతం చేయడానికి ఈడీ, సీబీఐని ఉపయోగించుకుంటోం దని ఆరోపించారు. "షా , మోడీ దగ్గర చాలా పెద్ద లాండ్రీ ఉంది, అది బట్టలు ఉతకదు, బదులుగా, వారు ఆ వాషింగ్ మెషీన్‌లో ఒక కళంకమైన నేతల్ని వేసి.. స్వచ్ఛంగా బయటకు పంపటమే పని అని ఖర్గే వివరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బీజేపీ పాలన సాగిస్తున్నదని ఆయన అన్నారు.

ఢిల్లీ మద్యం కేసులో

ఆప్‌ను నిందితులుగా చేరుస్తాం

హైకోర్టుకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో తదుపరి దాఖలు చేయబోయే ప్రాసిక్యూషన్ ఫిర్యాదు (చార్జిషీట్)లో ఆప్ ఆద్మీ పార్టీ (ఆప్)ను సహ నిందితులుగా చేరుస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం ఢిల్లీహైకోర్టుకు తెలిపింది. మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంలో ఈడీ ఈ విషయాన్ని వెల్లడించింది. సిసోడియాకు బెయిల్ మంజూరు చేయవద్దని తెలిపింది. ఈ కేసులో అభియోగాలు నమోదు చేయకుండా ఆలస్యం చేసేందుకు నిందితులు శతవిధాల ప్రయత్నిస్తున్నారని ఈడీ తెలిపింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ ముందు ఈడీ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. సిసోడియా తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ సిసోడియాకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో ఈడీ, సీబీఐలు వరసగా వ్యక్తులను అరెస్టు మాత్రమే చేస్తున్నాయని, విచారణను త్వరగా ముగించే ప్రశ్నే లేదని తన వాదన వినిపించారు. ఈ వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు సిసోడియా బెయిల్ పిటీషన్‌పై తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఈ కేసులో గత ఏడాది ఫిబ్రవరిలో సోసిడియాను ఈడీ అరెస్టు చేయగా, తరువాత నెలలో సీబీఐ అరెస్టు చేసింది. తన బెయిల్ పిటిషన్‌ను ఏప్రిల్ 30న రోస్ అవెన్యూ కోర్టు తిరస్కరించడంతో హైకోర్టును సిసోడియా ఆశ్రయించారు.

మోడీని ఎన్నికల నుంచి బహిష్కరించాలి

- పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ : ప్రధాని మోడీని ఎన్నికల నుంచి నిషేధించాలని దాఖలైన ఒక పిల్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోడీ చేస్తున్న విద్వేష ప్రసంగాల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే కారణంతో మోడీపై ఆరేండ్ల నిషేధం విధించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటీషన్ దాఖలు అయింది. న్యాయవాది అనంద్ ఎస్.జోనధలే ద్వారా ఫాతిమా ఈ పిటిషన్ వేశారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎస్‌సి శర్మతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ ఫిర్యాదుపై ముందుగా సంబంధిత అధికారులను సంప్రదించాలని పిటిషనర్‌కు ధర్మాసనం తెలిపింది. 'మీరు అధికారులను సంప్రదించారా? మాండమస్ రిట్ కోసం మీరు ముందుగా అధికారులను సంప్రదించాలి' అని ధర్మాసనం పేర్కొంది. దీంతో పిటిషనర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో, కేసును ధర్మాసనం కొట్టివేసింది.

కిడ్నాప్ కేసులో...

జైలు నుంచి హెచ్‌డి రేవణ్ణ విడుదల



బెంగళూరు : కిడ్నాప్ కేసులో బెయిల్ లభించడంతో కర్నాటక మాజీమంత్రి హెచ్‌డి రేవణ్ణ మంగళవారం మధ్యాహ్నం పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. బయటకు వచ్చిన రేవణ్ణకు పెద్ద సంఖ్యలో జేడీ(ఎస్) కార్యకర్తలు స్వాగతం పలికారు. జైలు నుంచి నేరుగా ఈ నెల 4న తనను అరెస్టు చేసిన, పద్మనాభనగర్‌లోని తన తండ్రి, మాజీ ప్రధాని దేవగౌడ ఇంటికి రేవణ్ణ చేరుకున్నారు. నివాసం బయట పెద్ద సంఖ్యలో జేడీ(ఎస్) కార్యకర్తలు గుమిగూడి ఉండగా, రేవణ్ణ లోపల తన సోదరుడు, జేడీ(ఎస్) రాష్ట్ర అధ్యక్షులు హెచ్‌డి కుమారస్వామితో కలిసి ఉన్నారు. బుధవారం తన స్వగ్రామం, తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న హోలెనరసిపూర్ నియోజకవర్గానికి రేవణ్ణ వెళ్లనున్నారు. తనకుమారుడు, జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసులో బాధితురాల్ని కిడ్నాప్ చేశారనే ఆరోపణలతో హెచ్‌డి రేవణ్ణను అరెస్టు చేశారు. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు రేవణ్ణకు సోమవారం సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది.

నేతల ప్రసంగాలు ఆదర్శంగా ఉండాలి

90 శాతం ఫిర్యాదులు పరిష్కరించాం : కేంద్ర ఎన్నికల సంఘం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అగ్రనేతలు తమ ప్రచారంలో చేసే ప్రసంగాలు ఆదర్శంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలోని సామాజిక నిర్మాణం చెదిరిపోకుండా ఉండేందుకు మిగిలిన దశల్లో నేతల పోల్ ప్రసంగాలను సరిదిద్దుకోవడం ప్రధానంగా నాయకుల బాధ్యతని నొక్కి చెప్పింది.

మార్చి 16న లోక్‌సభ ఎన్నికల ప్రకటన తరువాత మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలుపై తన రెండో నివేదికను విడుదల చేసిన ఎన్నిక సంఘం, 90 శాతానికి పైగా ఫిర్యాదులను పరిష్కరించామని, పార్టీల నుండి వచ్చిన పెద్ద ఫిర్యాదులు పెండింగ్‌లో లేవని తెలిపింది. కాంగ్రెస్, బీజేపీల నుండి వచ్చిన కొన్ని ఫిర్యాదులు తప్ప అన్ని పరిష్కరించామని పేర్కొంది. "మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుండి దాదాపు రెండు నెలలు పూర్తయినందున, నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచారం హింసకు తావులేకుండా జరిగింది" అని ఎన్నికల కమిషన్ పేర్కొంది.



ఎన్నికల కోడ్‌ను బీజేపీ ఉల్లంఘించడాన్ని ఆపండి: టీఎంసీ

బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా ఎన్నికల కోడ్‌ను "నిస్సందేహంగా ఉల్లంఘించడాన్ని" ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని టీఎంసి కోరింది. అదే సమయంలో మోడల్ ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ) "మోడీ కోడ్‌గా మార్చారని" ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం ఎన్నికల సంఘానికి టీఎంసీ రాజ్యసభ ఎంపీలు సాకేత్ గోఖలే, సాగరిక ఘోష్ ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మోడల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రధాని మోడీకి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో ఈసీ మెతక వైఖరి పట్ల నిరాశను వ్యక్తం చేశారు. "(బీజేపీ చీఫ్) జేపీ నడ్డాకు నోటీసు ఇచ్చారు. కానీ ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు" అని అన్నారు. ఎంసీసీ పట్ల ఎన్నికల సంఘం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ప్రధాని మోడీని బాధ్యుడిని చేయడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల మిగిలిన దశల్లో మోడల్ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని, ప్రధాని మోడీ ఉల్లంఘించిన ప్రతిసారీ క్లీన్ చిట్ ఇవ్వవద్దని డిమాండ్ చేశారు.

రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా గంగ మురికిగానే ఎందుకుంది?

మోడీని ప్రశ్నించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ దత్తత తీసుకున్న వారణాసి గ్రామాలను ఎందుకు వదిలేశారని, 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా గంగా ఇంకా మురికిగానే ఎందుకుంది? అని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రశ్నించింది. వారణాసి లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేసిన మోడీ ఇక్కడ తన 'వైఫల్యాలు'కు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఏడేండ్లకు పైగా సమయం గడిచినా.. గంగా నదిని శుభ్రం చేసే కార్యక్రమం ఇంకా పురోగతిలోనే ఉందని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. 'రూ. 20 వేల కోట్లు ఖర్చు చేసినా గంగా మురికిగా ఎందుకుంది? ప్రధాని మోడీ తాను దత్తత తీసుకున్న వారణాసి గ్రామాలను ఎందుకు వదిలివేశారు? వారణాసిలో మహాత్మ గాంధీ వారసత్వాన్ని నాశనం చేయాలని ప్రధాని మోడీ ఎందుకు సంకల్పించారు?' అని పోస్టులో ఆయన ప్రశ్నించారు. 2014లో వారణాసికి వచ్చిన సందర్భంలో గంగా జలాలను శుద్ధి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నమామి గంగే ప్రాజెక్టుతో 20 వేల కోట్లుకు పైగా ఖర్చు చేసినా నదిలో కాలుష్యం ఇంకా ఎక్కువయిందని విమర్శించారు. 20 వేల కోట్లలో అవినీతితో ఎంత సొమ్మును స్వాహా చేశారని ప్రశ్నించారు. అలాగే, వారణాసి నగరం వెలుపల ఎనిమిది గ్రామాలను మోడీ దత్తత తీసుకున్నారని, ఈ గ్రామాల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదని అన్నారు. ఆచార్య వినోభా భావే ప్రారంభించిన సర్వ సేవా సంఘ్‌ను నాశనం చేసే స్థాయికి ప్రధాని దిగజారారని విమర్శించారు. 'స్వదేశంలో గాంధేయ సంస్థలను నాశనం చేస్తూ.. విదేశాల్లో గాంధీజిని ప్రశంసించాలనే కపట ధోరణిలో ప్రధాని ఉన్నారు' అని ఆరోపించారు. మోడీ అనుసరించేది గాడ్సే సిద్ధాంతమని, గాంధీ సిద్ధాంతం కాదని అందరికీ తెలుసునని విమర్శించారు.

జట్టుగా ఇండియా బ్లాక్

- ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఐక్యతారాగం
- అమేథీ.. రాయ్‌బరేలీలో విజయం కోసం కృషి





లక్నో : రాజకీయాల్లో అనూహ్య మార్పు కనిపిస్తోంది. యూపీలో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఐక్యతారాగాన్ని ఆలపిస్తోంది. సీట్ల సర్దుబాట్ల తర్వాత యూపీలో అఖిలేశ్, రాహుల్ హవా నడుస్తోంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి విఫలమైన విషయాన్ని రెండు పార్టీలు గుర్తించాయి. ఇపుడు కలిసి పోటీకి దిగటంతో..ఆ రెండు పార్టీల్లోనూ విజయం సాధించగలమన్న ధీమా కనిపిస్తోంది. అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా ఇరు పార్టీల కార్యకర్తలు మైదానంలో ఒక జట్టుగా పని చేస్తున్నట్టు సంకేతాలిస్తున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అమేథీ , రాయ్‌బరేలీలలో బ్యాక్-టు-బ్యాక్ కార్నర్ సమావేశాలు, ర్యాలీలతో దూసుకెళ్తున్నారు. ఆమె బహిరంగ కార్యక్ర మాలలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రెడ్ క్యాప్ క్యాడర్‌లో జోష్ కనిపిస్తోంది. 2017 పొత్తుల హడావుడి అట్టడుగు స్థాయికి చేరుకోలేక పోయిందని, పొత్తు కాగితాలపైనే మిగిలిపోయిందని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. కానీ ఈసారి మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఇక్కడి ఎస్పీ, కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు.

మా అధినేత అఖిలేశ్ యాదవ్ పొత్తును ప్రకటించిన వెంటనే కాంగ్రెస్‌కు ఇచ్చిన 17 స్థానాల్లోని ఆఫీస్ బేరర్లు, ముఖ్య నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి.. 'మీ పార్టీలా ఎన్నికల్లో పోరాడండి' అని చెప్పారని బరేలీ జిల్లా చీఫ్ వీరేంద్ర యాదవ్ తెలిపారు. ఎస్పీ కార్యకర్తలందరూ ఆయన ఆదేశాలను పాటిస్తున్నారు అని వివరించారు. గతంలో అమేథీ, రాయ్‌బరేలీలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అనుకూలంగా మౌఖిక అవగాహన కుదిరిందని, అయితే ఈసారి 'ప్రకటిత కూటమి'తో భారత్ బ్లాక్ అభ్యర్థులను నిలబెట్టేందుకు కార్యకర్తలు మరింత ఉత్సాహంగా, కట్టుబడి ఉన్నారని వీరేంద్ర యాదవ్ పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ, అమేథీలో కిషోరీ లాల్ శర్మను విజయం వైపు నడిపించటానికి సర్వశక్తులు ఒడ్డినట్టు చెప్పారు. బీజేపీ పట్ల ప్రజలు విసిగిపోయారని, రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ రికార్డు మెజార్టీతో గెలుస్తారని, అమేథీలో శర్మ మంచి మెజార్టీతో గెలుస్తారని ఎస్పీ, కాంగ్రెస్ కార్యకర్తలు నమ్మకంగా ఉన్నారని ఎస్పీ జిల్లా అధ్యక్షుడు అన్నారు. ఇక్కడి ఎస్పీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు, హామీ కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో మీడియా ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు అన్షు అవస్థీ మాట్లాడుతూ రాయ్‌బరేలీ, అమేథీలలో ఎస్పీ కార్యకర్తలు గాంధీ కుటుంబంతో సన్నిహితంగా, కుటుంబ పరంగా, చాలా భావోద్వేగ అనుబంధాన్ని కలిగి ఉన్నందున వారికి ఉత్సాహంగా మద్దతు ఇవ్వడం వెనుక కారణం స్పష్టంగా ఉందని అన్నారు.

రాయ్‌బరేలీలో ఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామ్ నరేష్ యాదవ్ మాట్లాడుతూ ఎస్పీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తల మాదిరిగానే ఉత్సాహంగా ఉన్నారని, రాయ్‌బరేలీ, అమేథీలలో భారత కూటమి అభ్యర్థులు భారీ విజయం సాధించేలా కృషి చేస్తున్నారని అన్నారు. రాయ్‌బరేలీ నియోజకవర్గం ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ లను కలిగి ఉంది. బఛ్రావాన్ హర్‌చంద్‌పూర్, రాయ్ బరేలీ, ఉంచాహర్ , సరేని. అమేథీ పార్లమెంటరీ నియోజకవర్గం తిలోయి, సలోన్, జగదీష్‌పూర్, గౌరీగంజ్ , అమేథీ అసెంబ్లీ సెగ్మెంట్‌లను కలిగి ఉంది. 10 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరుగురికి ఎస్పీ ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఇద్దరు బీజేపీకి మద్దతు పలికారు. సాంప్రదాయకంగా ఎస్పీ ఎప్పుడూ పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు నిశ్శబ్దంగా మద్దతునిస్తుంది, గాంధీ కుటుంబానికి అండగా నిలుస్తోందని ఎస్పీ శ్రేణులు అంటున్నాయి. అయితే ఈసారి రెండు పార్టీల మధ్య ప్రకటిత పొత్తు ఉండడంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య సమన్వయం కనిపిస్తోంది.

ఏదైనా ర్యాలీ లేదా కార్నర్ మీటింగ్‌లో రెండు పార్టీల కార్యకర్తలు మమేకమవుతున్నారు. గౌరీగంజ్ లోని కాంగ్రెస్ కార్యాలయం ప్రధాన గేటుపై రెండు పార్టీల జెండాలు ఉన్నాయి. ఆ కార్యాలయంలో ఎక్కడ చూసినా రెండు పార్టీల జెండాలే దర్శనమిస్తున్నాయి. ప్రియాంక గాంధీ లేదా కిషోరి లాల్ శర్మ లేదా ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రసంగించే ఏదైనా కాంగ్రెస్ బహిరంగ సభకు గణనీయమైన సంఖ్యలో ఎస్పీ కార్య కర్తలు హాజరవుతారు. ఇది కేవలం పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలకే పరిమితం కాలేదని తెలుస్తోంది. మద్దతు దారులు కూడా పొత్తుపై ఉత్సాహంగా ఉన్నారు. అమేథీలోని షాఫర్ గ్రామానికి చెందిన కమలేష్ యాదవ్ మాట్లాడుతూ తాను అఖిలేశ్ యాదవ్‌కు గట్టి మద్దతుదారునని, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నందున తన ఓటు, మద్దతు కాంగ్రెస్‌కేనని అన్నారు. యాద వులందరూ ఈసారి ఏకమయ్యారు. పోయినసారి కొందరు బీజేపీకి ఓటేసి ఉండవచ్చు కానీ ఈసారి అఖిలేశ్ జీ మమ్మల్ని ఓటు వేయమని కోరిన చోటే ఓటు వేస్తామని ఆయన చెప్పారు. మద్దతు దారులు కూడా పొత్తుపై ఉత్సాహంగా ఉన్నారు. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో బ్రాహ్మణ, యాదవుల జనాభా గణనీయంగా ఉంది. రాయ్‌బరేలీలో బీజేపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్‌పై రాహుల్ గాంధీ పోటీ చేస్తుండగా, గాంధీ కుటుంబ సన్నిహితుడు లాల్ శర్మ అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీపై పోటీ చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు మే 20న ఐదో దశ పోలింగ్ జరగనుంది.

నవతెలంగాణ

కుల వ్యవస్థ శ్రమ విభజన కాదు..
అది శ్రామికుల విభజన కూడా - డా॥ బి.ఆర్ అంబేద్కర్

బుధవారం 15 మే 2024
www.navatelangana.com

కలవరం

సంపాదకీయం

సోమవారంతో ముగిసిన నాలుగో విడత పోలింగ్‌తో దక్షిణాది ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. దేశంలోని పదిరాష్ట్రాల్లో 96 లోక్‌సభ స్థానాలకు ఈ నాలుగోదశలో జరిగిన పోలింగ్‌లో దాదాపు సగం సీట్లు తెలుగురాష్ట్రాల్లోనే ఉన్నాయి. సీట్ల సంఖ్యరీత్యా మొత్తం ఏడు విడతలుగా జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ దశ రెండవ అతిపెద్దది. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వ బలాబలాలను నిర్ణయించగలిగే యూపీ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాల్లోని కొన్ని స్థానాలకు కూడా ఈ దశలోనే ఎన్నికలు జరిగాయి.

> నల్లధనం లేకుండా చేస్తానని చెప్పిన ప్రధానే ఇప్పుడు అదానీ, అంబానీ కాంగ్రెస్‌కు నల్లడబ్బు ఇస్తున్నారని చెబుతున్నారంటే దేశంలో ఇంకా నల్లడబ్బు ఉందని ఆయనే ఒప్పుకున్నట్టు కదా! మరి అంత డబ్బు చేతులు మారుతుంటే ఈడీని వారిపైకి ఎందుకు పంపలేదో ప్రధాన మంత్రే చెప్పాలి. యూపీ, బీహార్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఇండియా వేదిక పార్టీల మధ్య సర్దుబాట్లు కుదిరినందున బీజేపీ వ్యతిరేక ఓటు గరిష్టంగా పోల్ అవుతున్న నేపథ్యంలో 'ఇండియా' పార్టీల సీట్ల పెరుగుదల, బీజేపీ దిగజారుడును స్పష్టం చేస్తోంది.

ఈ దశతో 'సౌత్‌మే సాఫ్', 'నార్త్, వెస్ట్ ఔర్ ఈస్ట్ మే హాఫ్' అంటూ మోడీ పతనం మరింత ఖాయమైందని కాంగ్రెస్ అంటోంది. నిజానికి ఇటీవల మోడీ ప్రసంగాల్లోనూ, విమర్శల్లోనూ వచ్చిన మార్పులో అదే కనబడుతోంది. పాకిస్థాన్ విషయంలో ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యను అన్యాపదేశంగా గుర్తుచేస్తూ, 'ఇండియా' కూటమి నాయకులను మోడీ నిన్నటికి నిన్న బీహార్ ఎన్నికల సభలో పిరికిపందలుగా అభివర్ణించారు. అంతటితో సరిపెట్టకుండా, పాకిస్థాన్-గాజులు ప్రస్తావనలతో మరో మెట్టు ఎక్కించారు.

ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా ఉండవన్న భయాలు అటు కమలనాథులనూ, ఇటు కార్పొరేట్లనూ గజగజ వణికిస్తున్నాయి. ఫలితంగా మొదటి రెండు విడతల పోలింగ్ అనంతరం ప్రధానమంత్రి సైతం తన స్థాయిని మరచి ప్రతిపక్షాలకు అధికారమిస్తే మంగళ సూత్రాలు గుంజుకుంటారనీ, సంపదను మైనార్టీలకు కట్టబెడతారంటూ ఊరూరా విద్వేష వ్యాఖ్యలు చేశారు. మూడో విడత ముగిశాక తన అనుంగు మిత్రులైన అదానీ, అంబానీలు కాంగ్రెస్‌కు ట్రక్కులనిండా డబ్బు తీసుకెళ్లి ఇచ్చారని బహిరంగంగా విమర్శలు చేసే స్థాయికి వెళ్లారు. మూడో విడత పోలింగ్ జరిగిన రోజునే హర్యానాలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతునిచ్చిన ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు తమ సపోర్ట్



ఉపసంహరించడంతో అది మైనారిటీలో పడింది. మొత్తమ్మీద మోడీ నాయకత్వాన సాగుతున్న కార్పొరేట్ మతతత్వ కూటమి పాలన తుది ఘడియలకు చేరుకుంటోందన్న సంకేతాలు అన్ని వైపుల నుండీ కనబడుతున్నాయి.

నల్లధనం లేకుండా చేస్తానని చెప్పిన ప్రధానే ఇప్పుడు అదానీ, అంబానీ కాంగ్రెస్‌కు నల్లడబ్బు ఇస్తున్నారని చెబుతున్నారంటే దేశంలో ఇంకా నల్లడబ్బు ఉందని ఆయనే ఒప్పుకున్నట్టు కదా! మరి అంత డబ్బు చేతులు మారుతుంటే ఈడీని వారిపైకి ఎందుకు పంపలేదో ప్రధాన మంత్రే చెప్పాలి. యూపీ, బీహార్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఇండియా వేదిక పార్టీల మధ్య సర్దుబాట్లు కుదిరినందున బీజేపీ వ్యతిరేక ఓటు గరిష్టంగా పోల్ అవుతున్న నేపథ్యంలో 'ఇండియా' పార్టీల సీట్ల పెరుగుదల, బీజేపీ దిగజారుడును స్పష్టం చేస్తోంది. కేరళ, తమిళనాడుల్లో కమలం ఖాతా తెరవబోదనీ, కర్నాటక, మహారాష్ట్ర, హర్యానా లాంటి రాష్ట్రాల్లో ఆ పార్టీకి సీట్లు తగ్గుతాయని ఇప్పటికే తేలిపోయింది. ప్రస్తుతం దేశ ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఏ భావోద్వేగాలకూ అంతలా గురికాకుండా గత పదేండ్ల మోడీ పాలనలో పెరిగిన ధరలు, దిగజారిన ఉపాధి, తరిగిన కొనుగోలుశక్తి వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారని సిఎస్‌డిఎస్- లోక్‌నీతి వంటి సర్వేలు సూచించాయి కూడా!

సార్వత్రిక ఎన్నికల నాలుగోదశలో ఓటింగ్ మొత్తంగా 65శాతం నమోదైంది. బెంగాల్‌లో అత్యధిక పోలింగ్ జరిగితే, 370 అధికరణ రద్దు తరువాత తొలిసారిగా జమ్మూకాశ్మీర్‌లో, శ్రీనగర్ పార్లమెంటరీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో శ్రీనగర్ పట్టణంలో కేవలం 14.43 శాతం ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. కాశ్మీర్‌లో మిగతా చోట్ల పోటీకి నిలబెట్టడానికి అభ్యర్థులు కూడా అధికారపార్టీకి కరువయ్యారు. దాదాపు 18కోట్లమంది ఓటుచేసిన ఈ నాలుగో దశతో 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది.

ఇటీవల తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. బీఆర్ఎస్ కుదేలైంది. గత పక్షం రోజులుగా కేసీఆర్ ఎంత శ్రమపడ్డా పెద్దగా ఫలితం ఉండదన్నది పరిశీలకుల అంచనా. తృణమూల్ కాంగ్రెస్ 'ఇండియా" సంఘటనలో భాగస్వామి అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తూ పెట్టుకోలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకముందు ఒడిశాలో అధికారంలో ఉన్న నవీన్‌పట్నాయక్ నాయ కత్వంలోని బిజూ జనతాదళ్‌కు, బీజేపీకి మధ్య పొత్తు కుదురుతుందన్న అంచనాలు తారుమారయ్యాయి. పొత్తు కుదరనందుకు మోడీ ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌పై ఒంటికాలి మీద లేస్తున్నా, ఆయనను కించ పరిచే రీతిలో మాట్లాడుతున్నా ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతుందన్న భయంతోనే బిజూ జనతాదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోలేదని పిస్తోంది. దేశమంతా బలహీన బడుతున్న మన్న భయం ఎంతలేకపోతే ఏపీలో చంద్ర బాబుతో జతకట్టి, మరోవైపు జగన్‌తో సంబంధాలను కొనసాగిస్తారు. ఇది వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఏదిఏమైనా కేంద్రంలో లౌకిక ప్రభుత్వం ఏర్పడనుందన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నగదు సీజ్‌సరే..చర్యలేవి?



జి.తిరుపతయ్య
9951300016

ఏప్రిల్ 15వ తారీఖు నాటికే అక్రమంగా సరఫరా కాబడుతున్న 4650 కోట్ల రూపాయల నగదును సీజ్ చేసినట్లు భారత ప్రధాన ఎన్నికల సంఘం ప్రకటిం చింది. మార్చి ఒకటో తారీకు నుంచి ఇప్పటివరకు ప్రతిరోజు సగటున 100 కోట్ల రూపాయల సదరు ధనాన్ని పోలీసులు పట్టుకుంటున్నట్లు అధికారికం గా వెలువడింది. ఇలా నగదును సీజ్ చేస్తున్నారు కానీ ఏ ఒక్క అభ్యర్థిపై చర్య తీసుకుంటున్న దాఖలాలు లేవు. పట్టుబడుతున్న డబ్బే ఇంతలా ఉంటే, పట్టుబడ కుండా సరఫరా అవుతున్న డబ్బు ఎంత మొత్తంలో ఉందో ఊహకందడం కష్టమే. దేశంలో ప్రస్తుత లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు పెడుతున్న మొత్తం గతంలో ఎన్నడూ కాలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక పార్టీల పేరు మీద నిర్వహించబడుతున్న సభలు సమావేశాలకయ్యే ఖర్చుకు లెక్కనే లేదు. ప్రతిరోజు దాదాపు అన్ని వార్తాపత్రికలలో, టీవీ ఛానెల్స్‌లో, యూట్యూబ్, ఫేస్బుక్, వాట్సప్ లాంటి అనేక ఆన్‌లైన్ మాధ్యమాలలో ఇస్తున్న అడ్వర్టయిజ్‌మెంట్లకు అంతేలేదు. ఒక స్వతంత్ర సంస్థ ఇచ్చిన రిపోర్టు ప్రకారం గత లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో దాదాపు 66 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయబడిందని వెలువడింది. ఈ ఏడాది అది లక్ష కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షల మాత్రమే ఖర్చు పెట్టాలనే నిబంధన ఉంది. కానీ అది ఎంతవరకు పాటించబడుతున్నది? పాటించని వారిపై చర్యలేమైనా తీసుకున్నారా? ఇలా జరుగుతున్న తతంగాన్ని అచేతనంగా నిశ్చేష్టులై చూస్తున్న వారు ఒకనాటి ఎన్నికల ప్రధాన అధికారి టిఎన్ శేషన్ గారిని గుర్తుకు తెచ్చుకొని, అయ్యో అలాంటివాళ్లు లేరే... అంటూ వాపోతుంటారు. 543 పార్లమెంటు స్థానాలకు గాను ప్రతి పార్లమెంటు నియోజక వర్గంలో పది మంది పోటీ చేసినా మొత్తం ఖర్చు 6వేల కోట్ల రూపాయల లోపే ఉండాలి. కానీ అక్రమంగా పట్టుబడుతున్న డబ్బే 6వేల కోట్లు ఉన్నప్పుడు ఇక అసలు ఖర్చు ఎంత ఉంటుందో చూడండి. ప్రధాన పార్టీల నుండి కోట్లకు పడగలెత్తిన వారే అభ్యర్థులుగా ఉన్నారు. స్టార్ క్యాంపెయినర్లుగా గుర్తింపు పొందిన మంత్రులు, సీఎంలు, ప్రధానమంత్రి పాల్గొనే ఒక్కో ఎన్నికల సభకు కోటానుకోట్ల రూపాయలు వెచ్చించకపోతే అసాధ్యం. కేవలం సభా ప్రాంగణం, మైకుల ఏర్పాట్లకే పాతిక లక్షల నుండి కోటి రూపాయల పైనే ఖర్చు అవుతుందని వార్త మాధ్యమాల్లో వెల్లడవుతోంది. ఇక జన సమీకరణ కు, అన్న పానీయాల వంటి ఇతర సౌకర్యాల ఏర్పాట్లకు లక్షల రూపాయలు కుమ్మరించాల్సిందే.లెక్కకు మించి చేయబడుతున్న ఈ ఖర్చు గురించి మంత్రులకు, ముఖ్యమంత్రులకు ప్రధానమంత్రికి ఎన్నికల సంఘానికి పోలీసు వ్యవస్థకు తెలియదంటే నమ్మగలమా? తెలిసి కూడా వాళ్లు నిమ్మకున్నారంటే చట్టాన్ని, ఎన్నికల నియమా వళిని, రాజ్యాంగ సూత్రాలను లెక్కచేయకుండా అతిక్రమిస్తు న్నట్లు కాదా? ఇలాంటి హేపో క్రసితో ఎన్నికల వ్యవస్థలో పాల్గొంటూ.. ప్రజాస్వామ్యాన్ని నిర్మిస్తున్నాం, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ప్రజాస్వామ్యం మాదే, అంటూ చెప్పేవన్నీ ప్రగల్భాలే కావా? మనం నిర్దేశించుకున్న నియమ నిబంధనలను మనమే పాటించకుండా మంచి ప్రజాస్వా మ్యాన్ని ఎలా నిర్మించగలం?

ఎన్నికల ఖర్చుకు సంబంధించిన ఈ కఠోర వాస్తవాలను తెలిసికూడా రూ.95 లక్షల నిబంధన ఎందుకు ఉంచారంటే "అది సామాన్యులకు కూడా అందుబాటులో ఉంది" అని పైపైకి కనిపించేలా చేయడం కోసమే! దేశ పౌరులందరూ ఎన్నికలలో పాల్గొని నీతిగా, నిజాయితీగా, నిస్పక్షపాతంగా ఓటు వేయాలని సూచించే సంస్థలన్నిటికీ జరుగుతున్న తతంగాన్ని తప్పుబట్టే బాధ్యత లేదా? ప్రతి అభ్యర్థి పెట్టే ఖర్చుపై నిఘా పెట్టి ఆరా తీయాల్సిన ప్రత్యేక బాధ్యతల్లో నియమింపబడిన అధికారుల పాత్ర ఏమైనట్లు? అధికారులు, ఆశ్రిత పెట్టుబడిదారులు, అందలమెక్కబోతున్న నాయకులు కలిసి ప్రదర్శిస్తున్న నాటకంలో ఈ ఓట్ల ప్రక్రియ ఒక ప్రహసనంగాక మరేమౌతది? 95 లక్షల లోపే ఖర్చు పెట్టాలంటే మంది మార్బలంతో మహాసభలు, రోడ్డుషోలు నిర్వహించకూడదు. నిజానికి అవి అవసరం కూడా లేదు. విధానాలను మాత్రమే వివరించాలనుకుంటే ప్రచార మాధ్యమాలు చౌకగా అందుబాటులో ఉన్నవి. కానీ ఇప్పుడు ముందుకొచ్చిన ఎన్నికలు విధానాల మధ్య కాకుండా వివాదాస్పద భావోద్వేగాల మధ్య జరుగుతున్న వాతావరణం ఉన్నది. అధికారమే పరమో ధర్మమైనప్పుడు ధర్మము జననాథుల రథచక్రాల కింద నుజ్జునుజ్జయి పోవాల్సిందే. చట్టాన్ని గౌరవించలేని వాళ్లు సంస్కారాల గురించి వల్లిస్తుంటే వాటిని పరమావధిగా భావించే ప్రజానీకం ఉన్నంతకాలం ఈ ప్రహసనం తప్పదు.

అమెరికా విద్యార్థి ఉద్యమం

నాటి వియత్నాం, నేటి పాలస్తీనాకు తేడా ఏమిటి!!



ఎం కోటేశ్వరరావు
8331013288

పాలస్తీనా ప్రాంతమైన గాజాలో ఇజ్రాయిల్ మిలిటరీ రాఫా, తదితర ప్రాంతాల్లో మారణకాండను తీవ్రం చేస్తోంది. చివరకు ఐరాస తరఫున పనిచేస్తున్న సహాయసిబ్బందిని కూడా వదలటం లేదు.సోమవారం జరిపిన దాడుల్లో ఐరాస తరఫున పనిచేస్తున్న వారిలో మనదేశానికి చెందిన వ్యక్తి మరణించాడు. రాఫాలోని ఐరోపా ఆసుపత్రికి ఒక వాహనంలో ఇతరులతో కలసి వెళుతుండగా ఇజ్రాయిల్ మిలిటరీ జరిపిన దాడిలో అతడు మరణించగా మిగిలిన వారికి గాయాలయ్యాయి.గతేడాది అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 35వేల మందికి పైగా మరణించారు. వారిలో 70శాతంపైగా పిల్లలు, మహిళలు ఉన్నారు.పాలస్తీనియన్ల ఊచకోత గురించి ఏమాత్రం పట్టని అమెరికా, ఇతర పశ్చిమదేశాలు యూదు వ్యతిరేకత పెరుగుతోందని మాత్రం గుండెలు బాదుకుంటున్నాయి. ఆ సాకుతో ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయి. కొద్ది వారాల క్రితం అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లోనే ప్రారంభమైన ఉద్యమం ఇప్పుడు కెనడా, ఐరోపా ముఖ్యంగా బ్రిటన్‌కు విస్తరించింది.రఫా మీద దాడులను అంగీకరించేది లేదన్నది అమెరికా ఉత్తుత్తి బెదిరింపు మాత్రమే అని తేలిపోయింది. మంగళవారం నాటికి అందిన సమాచారం మేరకు ఆ నగరం పరిసరాలలో ఉన్న 14 లక్షల మంది జనాభాలో సగం మంది దాడులను తప్పించుకొనేందుకు ఇతర ప్రాంతాలకు పారిపోయారు.

ప్రతి మతంలోనూ దురహంకారులు ఉంటారు. దానికి యూదు అతీతం కాదు. ఐరోపాలో ముందుకు తెచ్చిన యూదు వ్యతిరేకత వారిని అష్టకష్టాలపాలు చేసింది. లక్షలాది మంది ప్రాణాలు తీసింది. ఆ దుర్మార్గాన్ని యావత్ ప్రపంచం ఖండించింది. కానీ ఇప్పుడు అదే మత ప్రాతిపదికన ఏర్పడిన ఇజ్రాయిల్ పాలకుల అరబ్ లేదా ముస్లిం వ్యతిరేకతను అనేక పశ్చిమదేశాలు నిస్సిగ్గుగా సమర్థిస్తున్నాయి.పాలస్తీనా సాగిస్తున్న మారణకాండకు మద్దతిస్తున్నాయి. దానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి మానవహక్కులను కాపాడాలని కోరుతున్నారే తప్ప యూదు వ్యతిరేకతను ముందుకు తీసుకురాలేదు. ఇజ్రాయిల్ పాలకులు యూదు దురహంకారులు తప్ప అక్కడ ఉన్న సామాన్య పౌరులందరూ అలాంటివారే అనటం లేదు. ఐరాస తీర్మానం ప్రకారం పాలస్తీనా ఏర్పడకుండా అడ్డుకుంటున్నది అక్కడి పాలకులు, యూదు ఉన్మాదం తలకెక్కించిన మిలిటరీ, వారిని తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న పశ్చిమదేశాలు తప్ప పౌరులు కాదు. పాలస్తీనాలోని గాజా, పశ్చిమగట్టు, తూర్పుజెరూసలెం ప్రాంతాలలోని పౌరులపై దశాబ్దాల తరబడి సాగిస్తున్న దమనకాండ గురించి తన పౌరులకు బోధ చేసేందుకు ఎన్నడూ ఒక చట్టం చేయని అమెరికా పార్లమెంటు దిగువసభ ఇటీవల "యూదు వ్యతిరేక జాగృతి బిల్లు" తెచ్చింది. దానికి 91 మంది వ్యతిరేకంగా ఓటు వేయగా 320 మంది మద్దతు తెలిపారు.యూదు వ్యతిరేకత అమెరికాలో ఉన్న యూదు విద్యార్థుల మీద ప్రభావం చూపుతుందని చట్టం ప్రకటించింది. దాన్ని సెనెట్ కూడా ఆమోదిస్తే అధ్యక్షుడి ఆమోదంతో చట్టంగా మారుతుంది. ఒకసారి అది ఉనికిలోకి వస్తే వివాదాస్పద యూదు వ్యతిరేక నిర్వచనాలతో విద్యార్థులు, ఇజ్రాయిల్ దమనకాండపై గళమెత్తే ఇతరులను అణచివేసే అవకాశం ఉంది. ఈ బిల్లును సెనెట్ ఆమోదించకూడదని అనేక మంది కోరుతున్నారు. విద్యార్థులు చేస్తున్నది మరొక యుద్ధ వ్యతిరేక ఉద్యమం కాగా దాన్ని యూదు వ్యతిరేకమైనదిగా పశ్చిమదేశాల మీడియా చిత్రించటం పాలకవర్గాల కనుసన్నలలో నడవటం తప్ప మరొకటి కాదు.

గతంలో వియత్నాంపై జరిపిన దురాక్రమణ, హత్యాకాండ, అత్యాచారాలకు నిరసనగా అమెరికా యువత పెద్ద ఎత్తున నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. చివరకు బతుకుజీవుడా అంటూ అమెరికన్లు అక్కడి నుంచి పారిపోయి వచ్చారు. అక్కడ కనీసం 30లక్షల మంది అమాయక పౌరులను అమెరికన్లు హతమార్చారు. గతంలో వియత్నాంలో మాదిరి ఇప్పుడు గాజాలో జరుగుతున్న మారణకాండలో అమెరికా ప్రత్యక్ష భాగస్వామి కాదు. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వటాన్ని వ్యతిరేకించటం అమెరికా యువతలో పెరిగిన చైతన్యానికి ఒక నిదర్శనం. గతంలో మాదిరి జరుగుతున్నవాటిని మూసిపెట్టటం ఇప్పుడు సాధ్యం కాదు. అమెరికాలో జరుగుతున్నదాని గురించి ఒక విశ్లేషకుడు ఒక సినిమా కథతో పోల్చాడు. మోర్ఫస్ అనే చిత్రంలో ఒక వ్యక్తి తన వద్దకు వచ్చిన ఆశ్రితుడికి ఎరుపు, నీల వర్ణపు రంగుల మాత్రలు ఇచ్చి ఏదో ఒకటి తీసుకోమంటాడు.ఎరుపు రంగుదాన్ని సేవించిన వారికి తమ చుట్టూ జరుగుతున్న భయంకర అంశాలన్నీ కనిపిస్తాయి. అదే నీలి రంగు మాత్ర వేసుకుంటే నిజంగా జరుగుతున్నదాన్ని మరిపింపచేస్తుంది. ఆ సినిమాలో ఆశ్రితుడు ఎర్రరంగు మాత్ర తీసుకున్నట్లుగా ఇప్పుడు అమెరికా సమాజంలోని నవతరం కూడా అదే మాదిరి పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ జరుపుతున్న అకృత్యా లను చూస్తున్నారని, వ్యతిరేకంగా స్పందిస్తున్నారని పేర్కొ న్నాడు. ఈ సందర్భంగా జరుగుతున్న చర్చలో ఒక్క ఇజ్రాయి ల్‌కు మద్దతు ఇవ్వటమే కాదు తమ ప్రభుత్వం అనేక చోట్ల ఉగ్రవాద వ్యతిరేక చర్యల పేరుతో జరుపుతున్న దారుణాలను కూడా ఇప్పుడు విద్యార్థులు స్పష్టంగా చూస్తున్నారు.

అమెరికా జరుపుతున్న దారుణాలను ప్రపంచం చూస్తున్నప్పటికీ ఇటీవలి కాలంలో అమెరికన్లు వాటిని ఏ మేరకు గమనించారన్న చర్చ ఒకటి ఉంది. ఏదైనా శృతిమించితే వారు కూడా స్పందిస్తారని తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. పాలస్తీనా విముక్తి కోసం పోరాడుతున్న వారిని ఉగ్రవాదులని అమెరికా ఎప్పటినుంచో చిత్రిస్తున్నది. ప్రతి దేశంలో సామ్రాజ్యవాదం, నిరంకుశ పాలకులు చేసింది అదే. ఉగ్రవాదంపై పోరు పేరుతో అమెరికా సాగిస్తున్న చర్యలతో నిజానికి ఉగ్రవాదం పెరిగింది తప్ప తగ్గలేదు. అనేక మందిని ఉగ్రవాదులుగా మార్చిందంటే అతిశయోక్తి కాదు. బ్రౌన్ విశ్వవిద్యాలయం జరిపిన ఒక విశ్లేషణ ప్రకారం వివిధ దేశాలలో అమెరికా కారణంగా 45లక్షల మంది మరణించారు. వారిలో అమెరికా మిలిటరీ ప్రత్యక్షంగా తొమ్మిది లక్షల మందిని చంపివేసింది.కనీసం 3.8కోట్ల మంది తమ నెలవులు తప్పారు. ఎమెన్ అంతర్యుద్ధంలో అమెరికా మద్దతు, పథకం ప్రకారం జోక్యం చేసుకున్న సౌదీ అరేబియా కారణంగా దశాబ్ది కాలంలో 2.33లక్షల మంది మరణించారు. ఐరాస కార్యాలయం 2020లో చెప్పినదాని ప్రకారం వారిలో ఆహారం, ఆరోగ్యసేవలు, మౌలిక సదుపాయాల లేమి వంటి పరోక్ష కారణాలతో మరణించిన వారు 1.31లక్షల మంది ఉన్నారు. ఇటీవలి ప్రపంచ పరిణామాల్లో సౌదీ అరేబియా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఎమెన్‌లో జోక్యానికి స్వస్తి పలికింది. సద్దాం హుస్సేన్‌ను తమ పలుకుబడికిందకు తెచ్చుకొనేందుకు ఇరాక్‌పై అమెరికా అమలు జరిపిన ఆంక్షల కారణంగా ఐదు లక్షల మంది పిల్లలు మరణించారని అంచనా. ఇంకా ఇలాంటి అనేక దారుణాల్లో తమ నేతల, దేశ పాత్ర గురించి విశ్వ విద్యాలయ ప్రాంగణాల్లో గుడారాల్లో తిష్టవేసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు అరచేతిలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని అధ్యయనం చేస్తున్నారు.

అమెరికా ప్రత్యక్షంగా పాల్గొనటమే కాదు, అనేక దేశాల పాలకులను ప్రోత్సహించి లక్షలాది మంది మరణాలకు బాధ్యురాలైంది.ప్రస్తుత బంగ్లాదేశ్ 1971కి ముందు పాకిస్తాన్‌లో భాగంగా ఉన్న సంగతి తెలిసిందే. అక్కడ తలెత్తిన ప్రభుత్వ వ్యతిరేకతను అణచివేసేందుకు పాక్ మిలిటరీ ఆపరేషన్ సెర్చ్‌లైట్ పేరుతో జరిపిన మారణ కాండలో మూడు లక్షల మంది మరణించగా కోటి మంది తమ ప్రాంతాల నుంచి పారిపోవాల్సివచ్చింది. దానికి అమెరికా పూర్తి మద్దతు ఇచ్చింది.మనదేశం జోక్యం చేసుకొని పాక్ మిలిటరీని ఓడించి బంగ్లాదేశ్ విముక్తికి తోడ్పడింది. అంతకు కొద్ది సంవత్సరాల ముందు ఇండోనేషియాలో కమ్యూనిస్టులను అణచివేసేందుకు మిలిటరీ నియంత సుహార్తోను గద్దెమీద కూర్చోబెట్టి కనీసం పదిలక్షల మందిని ఊచకోత కోయించటంలో సిఐఏ ప్రధాన పాత్ర పోషించింది. రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా మిత్రపక్ష దేశాల మీద యుద్ధం ప్రకటించిన హిట్లర్ వంటి వారిని తప్ప ప్రపంచంలో నియంతగా పేరు మోసిన ప్రతివాడినీ అమెరికా బలపరిచింది. హిట్లర్‌కు సైతం ఆయుధాలు అమ్మి తొలి రోజుల్లో మద్దతు ఇచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధంతో బ్రిటన్ ప్రపంచాధిపత్యం అంతరించి అమెరికా రంగంలోకి వచ్చింది.అప్పటి నుంచి సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాలతో సాగించిన ప్రచ్ఛన్న యుద్ధంలో తాము విజేతలం అని ప్రకటించుకొనే వరకు అంటే 1949 నుంచి 1989వరకు వివిధ దేశాలలో పాలకులను మార్చేందుకు అమెరికా 72 ప్రయత్నాలు చేయగా 29 సందర్భాలలో అమెరికా కుట్రలో భాగస్వాములైన వారు జయప్రదమయ్యారు. కూల్చిన వాటిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు ఆరు ఉన్నాయని బోస్టన్ కాలేజీ రాజకీయ శాస్త్ర అధ్యాపకురాలు లిండ్సే ఓ రూర్కే పేర్కొన్నారు. ఒక వలసవాదిగా అమెరికా దుర్మార్గం చిన్నదేమీ కాదు. ఆసియాలోని ఫిలిప్పైన్స్‌ను ఆక్రమించుకొని అక్కడ మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే రెండు నుంచి ఆరులక్షల మందిని జాత్యహంకారం, ఇతర కారణాలతో అమెరికన్ పాలకులు హత్య చేశారని అంచనా.

1968లో వియత్నాంలో దురాక్రమణ, మారణకాండలకు వ్యతిరేకంగా విద్యార్థులు జరిపిన ఆందోళనకు, ఇప్పుడు గాజాలో జరుపుతున్న ఇజ్రాయిల్ మారణకాండకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి విద్యార్థిలోకం గళమెత్తటానికి గల పోలికలు చర్చల్లోకి వచ్చాయి. అప్పుడూ ఇప్పుడూ ఆందోళన కాలేజీ ప్రాంగణాల్లోనే ప్రారంభమైంది.నాడూ నేడు పోలీసుల ను పిలిపించి అణచివేతకు పాల్పడ్డారు. నవతరం- పాతవారి మధ్య కొన్ని సైద్ధాంతిక విబేధాలు గతంలోనూ వర్తమానంలోనూ ఉన్నాయి. నిజానికి ఇవి పెద్ద అంశాలు కావు. ఫ్రెంచి వలస ప్రాంతంగా ఉన్న ఇండోచైనాను రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఆక్రమించింది. అది ఓడిన తరువాత తిరిగి ఫ్రాన్సు ఆక్రమించిన వియత్నాంలో విముక్తి పోరాటం కారణంగా 1954లో స్వాతంత్ర్యం వచ్చింది. ఉత్తర, దక్షిణ వియత్నాంలుగా దాన్ని విభజించారు. ఫ్రెంచి పాలకులు తప్పుకున్న తరువాత దక్షిణ వియత్నాం కేంద్రంగా అమెరికా రంగంలోకి వచ్చి ఉత్తర వియత్నాంను ఆక్రమించేందుకు, దక్షిణ వియత్నాంలో విముక్తి పోరాటాన్ని అణచేందుకు చూసింది.

స్వతంత్ర పాలస్తీనాను రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రెండుగా చీల్చి ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ వెంటనే పాలస్తీనా ప్రాంతాలను పశ్చిమదేశాల మద్దతుతో అది ఆక్రమించి ఇప్పటి వరకు పాలస్తీనా స్వతంత్రదేశం ఏర్పడకుండా అడ్డుకుంటున్నది. నాడు వియత్నాంలో 5.36 లక్షల మంది అమెరికన్ సైనికులు ఉన్నారు.నేడు ఇజ్రాయిల్ లో కొద్ది మంది ఉన్నప్పటికీ వారు దాడులలో భాగస్వాములు కావటం లేదు. వియత్నాంలో దాదాపు అరవై వేల మంది అమెరికా సైనికులు మరణించారు, మూడు లక్షలకు పైగా గాయపడ్డారు. తమ సైనికుల ప్రాణనష్టం సాధారణ అమెరికన్లను కలచివేసింది. పాలస్తీనాలో ఒక్క అమెరికనూ చావలేదు, గాయపడలేదు. అయినప్పటికీ మానవత్వానికి ముప్పు తెచ్చిన కారణంగా విద్యార్థులు వీధుల్లోకి రావటం చైతన్యానికి నిదర్శనం.రాఫాలో దాడులను అడ్డుకోవటంలో విఫలమైన తమ ప్రభుత్వం మీద విద్యార్థులు మరింతగా వీధుల్లోకి వస్తారా, ఏం జరగనుంది అన్నది ఆసక్తికరంగా మారింది.



> ఐరాస తీర్మానం ప్రకారం పాలస్తీనా ఏర్పడకుండా అడ్డుకుంటున్నది అక్కడి పాలకులు, యూదు ఉన్మాదం తలకెక్కించిన మిలిటరీ, వారిని తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న పశ్చిమదేశాలు తప్ప పౌరులు కాదు. పాలస్తీనాలోని గాజా, పశ్చిమగట్టు, తూర్పుజెరూసలెం ప్రాంతాలలోని పౌరులపై దశాబ్దాల తరబడి సాగిస్తున్న దమనకాండ గురించి తన పౌరులకు బోధ చేసేందుకు ఎన్నడూ ఒక చట్టం చేయని అమెరికా పార్లమెంటు దిగువసభ ఇటీవల "యూదు వ్యతిరేక జాగృతి బిల్లు" తెచ్చింది. దానికి 91 మంది వ్యతిరేకంగా ఓటు వేయగా 320 మంది మద్దతు తెలిపారు.యూదు వ్యతిరేకత అమెరికాలో ఉన్న యూదు విద్యార్థుల మీద ప్రభావం చూపుతుందని చట్టం ప్రకటించింది. దాన్ని సెనెట్ కూడా ఆమోదిస్తే అధ్యక్షుడి ఆమోదంతో చట్టంగా మారుతుంది. ఒకసారి అది ఉనికిలోకి వస్తే వివాదాస్పద యూదు వ్యతిరేక నిర్వచనాలతో విద్యార్థులు, ఇజ్రాయిల్ దమనకాండపై గళమెత్తే ఇతరులను అణచివేసే అవకాశం ఉంది.

భారత్ వెలిగిపోతోందా?లేదే!

ప్రధాని మోడీ, బీజేపీ నాయకులు చెబుతున్నట్లుగా భారతదేశం ఈరోజు మునుపెన్నడూ లేనంతగా వెలిగిపోతున్న మాట నిజమేనా? ప్రపంచదేశాలకు భారత్ ఒక రోల్‌మోడల్‌గా ఉన్నదా? భారత దేశాన్ని అలాంటి ఉన్నత స్థితిలో నిలపడం ద్వారానే మోడీ విశ్వగురు అయ్యారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే, వివిధ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు, వివిధ అంశాలలో తయారు చేసే వివిధ రకాల సూచీలను, ర్యాంకులను పరిశీలించాలి. దేశమంటే మట్టి కాదు మనుషులు అన్న గురజాడ సూక్తి ప్రకారం, ఒక దేశపు సమగ్ర అభివృద్ధి అంటే ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలలో, వారి స్థితిగతుల్లో, వారు అనుభవించే స్వేచ్ఛలో, సామాజిక గణాంకాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో, వారు పొందే సూపరిపాలనలో అభివృద్ధిగా ఉంటుంది.మరి అటువంటి అంశాల్లో మన దేశం పరిస్థితి, మన దేశ ప్రజల పరిస్థితి ఎలా ఉందో ఒక పరిశీలన చేయాల్సిన అవసరం ఉన్నది. ఇటీవల మన ప్రధాని, మంత్రిగణం నోట్లోంచి తరచుగా వినిపిస్తున్న మాట "భారతదేశం ప్రపంచపు మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తి కాబోతోంది".

అవును జీడీపీ పరంగా 189 దేశాల్లో మనది 3వ స్థానం. కానీ జీడీపీ పరంగా తలసరి ఆదాయంలో మన దేశం ఈ 189 దేశాల్లో 140వ స్థానంలో ఉంది. ఇది అత్యంత తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తోంది. ఈదేశపు బడా కార్పొరేట్లను ప్రపంచ కుబేరులుగానూ, ఈ దేశ పేద, మధ్య తరగతి ప్రజనీకాన్ని కటిక దారిద్ర్యంలోకి నెట్టే విధంగానూ పాలకుల విధానాలున్నాయన్నమాట. ఆర్థిక స్వాతంత్ర్యంలో 178 దేశాల్లో 123వ స్థానం, మానవ వనరుల వినియోగ సూచీలో 152 దేశాలకు గాను 115వ స్థానంలో ఉండడం, ఉద్యోగ కల్పనలో 47 దేశాల్లో 42వ స్థానంలోను, ప్రజలపై ఉన్న అప్పుల భారంలో 189 దేశాలకుగాను 82వ స్థానంలోను, కనీస వేతనాల అమలులో 156 దేశాలలో 64వ స్థానంలోను, మరీ ముఖ్యంగా ఆధునిక బానిసత్వ సూచీలో 167 దేశాల్లో నాలుగో స్థానంలో ఉండటం పై విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయి.

పాలకుల స్వభావం ఆ ప్రభుత్వ ప్రాధమ్యాలలో స్పష్టంగా కనిపిస్తున్నది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 107 దేశాలకుగాను 94వ స్థానంలోనూ, తలసరి ఆరోగ్య వ్యయంలో 190 దేశాలకు గాను 141వ స్థానంలోనూ, ఎడ్యుకేషన్ ఇండెక్స్‌లో 191 దేశాలకు గాను 145వ స్థానంలో ఉండగా మిలిటరీ వ్యయంలో 186 దేశాలకు గాను మూడవ స్థానంలో ఉండడం ఈ పాలకుల విధానాల్లో డొల్లతనాన్ని, సామ్రాజ్యవాద దేశాల ఆయుధ తయారీ కంపెనీలకు లొంగుబాటును, పొరుగు సరిహద్దు దేశాలతో చెడిపోతున్న సత్సంబంధాలను సూచిస్తున్నది. పాలకుల విధానాలే ప్రజల జీవన ప్రమాణాలను నిర్ధారిస్తాయి. ప్రపంచ ఆయుష్షు సూచీలో195 దేశాలకు గాను 125వ స్థానంలో ఉండగా, ప్రపంచ మానవాభివృద్ధి సూచిలో 189 దేశాలకు గాను 131వ స్థానంలో ఉండడం, సాంఘికాభివృద్ధి సూచీలో 128 దేశాలకు గాను 117వ స్థానంలో ఉండడం, గ్లోబల్ యూత్ డెవలప్మెంట్ ఇండెక్స్‌లో 183 దేశాలకు గాను 134వ స్థానంలో ఉండడం, నవజాత శిశుమరణాల్లో 223 దేశాలకుగాను 113వ స్థానంలో ఉండడం ఆలోచించాల్సిన అంశాలే.

ఇంకా లింగ తారతమ్యంలో 144 దేశాలకు గాను 108వ స్థానంలో ఉండగా, లింగ వివక్షలో 188 దేశాలకు గాను 76వ స్థానంలో ఉండడం, ఇండ్లు లేని వారి విషయంలో 52 దేశాలకు గాను 8వ స్థానంలో ఉండగా, పట్టణీకరణలో 199 దేశాలకు గాను 161వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇండెక్స్‌లో 56 దేశాలకుగాను 43వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ ఎయిర్ ఇండెక్స్‌లో 92 దేశాలకు గాను 84వ స్థానంలో ఉండడం పాలకుల వినాశకర విధానాలను సూచిస్తున్నది. 5జి యుగంలోకి తీసుకెళ్తున్నాము, అందరికీ ఇంటర్నెట్ విస్తరించాము అని బాజాలు కొట్టుకుంటున్న మన దేశంలో, జనాభాలో ఇంటర్నెట్ వాడే వారి శాతం ప్రకారం ప్రపంచంలో గల 228 దేశాల్లో 141వ స్థానం లోనూ, అలాగే ఇంటర్నెట్ స్పీడ్‌లో 149 దేశాలకుగాను 89వ స్థానంలో ఉండడం దయనీయమైన వాస్తవాన్ని తెలియజేస్తున్నది.

ప్రపంచ సంతోష సూచీలో 156 దేశాలకు గాను 137వ స్థానంలో ఉన్న మన దేశం, ప్రపంచ శాంతి సూచీలో 163 దేశాలకు గాను 139వ స్థానంలో ఉండగా, ఉద్దేశపూర్వక జనహనన కేసుల్లో 219 దేశాలకుగాను రెండవ స్థానంలో ఉండడం, ట్రాఫిక్ ప్రమాదాల వలన జరిగే మరణాల్లో 180 దేశాలకు గాను రెండవ స్థానంలో ఉండడం, ఆత్మహత్యల రేటులో 176 దేశాలకు గాను 19వ స్థానంలో ఉండడం ఆందోళనకరం. "ఎక్కడ పుడితే బావుంటుంది" అనే అంశం మీద 80 దేశాల పౌరులపై చేసిన విశ్లేషణలో మన దేశానికి 72వ ప్రాధాన్యత లభించింది.

ప్రజా శ్రేయస్సు సూచికలో 149 దేశాలకు గాను 101వ స్థానంలో ఉండడం, ప్రజాస్వామ్య సూచికలో 112 దేశాలకు గాను 65వ స్థానంలో ఉండటం, చట్టబద్ధ పాలన సూచీలో 113 దేశాలకు గాను 68వ స్థానంలో ఉండడం, పత్రికా స్వేచ్ఛలో 180 దేశాలకు గాను 148వ స్థానంలో ఉండడం, పాలకుల ఫాసిస్టు పోకడలను, నిరంకుశ విధానాలను ప్రతిబింబిస్తున్నది.పై గణాంకాలన్నీ ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థలు, వరల్డ్ బ్యాంక్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ఎంతో శాస్త్రీయంగా తయారు చేసినవే.

వ్యవస్థీకృత సోషల్ మీడియా నెట్‌వర్క్, వాట్సాప్ యూనివర్సిటీ సహాయంతో ఫేక్ పోస్టుల ద్వారా, తమ లోపభూయిష్ట పాలనను అద్భుతమైన పాలనగా చిత్రీకరించుకుంటున్నారు కేంద్ర బీజేపీ పాలకులు. తమకి తామే విశ్వగురు, 56 అంగుళాల ఛాతీ వంటి ప్రశంసలు ఇచ్చేసుకుం టున్నారు. దేశం వెలిగిపోతోందని నమ్మబలుకుతూ, ప్రజలకు వాస్తవాలు అర్థం కానివ్వకుండా వారిలో కులమతాల విద్వేషాలు నింపుతున్నారు. మరోసారి మందిరం ముసుగుతో అధికార పీఠం ఎక్కేస్తే, ఇక రానున్న ఐదేండ్లలో రాజ్యాంగ మౌలిక అంశాలను కూడా మార్చేసి, ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే మతం, ఒకడే రాజు-అన్న చందంలో అఖండ హిందూ సామ్రాజ్య స్థాపన వైపు దేశాన్ని తీసుకెళ్లే కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిద్దామనుకుంటున్న వీరు ఒక్క విషయం మర్చిపోతున్నారు.

నిప్పుని పొట్లం కట్టి జేబులో దాచే ప్రయత్నం చేస్తే, అది జేబుని దహించుకుంటూ బయటికొచ్చి తన ఉనికిని చాటుతుంది. అలాగే మెజారిటీ ప్రజల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంటే, ఈ విషయాన్ని మరుగుపరిచి అంతా ఘనంగా ఉందంటూ నమ్మబలికే ప్రయత్నం ఎంత తీవ్రంగా చేసినా పై గణాంకాలు వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్క రిస్తున్నాయి. వివిధ కీలక అంశాల్లో మన పాలకుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని, తప్పుడు ప్రాధాన్యతలను ఎత్తిచూపు తున్నాయి. ఎన్నికల వేళ ఈ గణాంకాలు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వంటి సాధానాల ద్వారా దేశంలోని విస్తృత జన బాహుళ్యానికి తక్షణం చేరాల్సిన అవసరం ఉంది.ప్రజలు నిన్ను నీ మాటలను బట్టి కాక, నీ చేతలను బట్టి అంచనా వేస్తారనే స్పృహ లేని ఈ పాలకులకు పైగణాంకాలను బట్టి జరుగుతున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పకుండా జరుగుతుంది.

- భగత్



> నిప్పుని పొట్లం కట్టి జేబులో దాచే ప్రయత్నం చేస్తే, అది జేబుని దహించుకుంటూ బయటికొచ్చి తన ఉనికిని చాటుతుంది. అలాగే మెజారిటీ ప్రజల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంటే, ఈ విషయాన్ని మరుగుపరిచి అంతా ఘనంగా ఉందంటూ నమ్మబలికే ప్రయత్నం ఎంత తీవ్రంగా చేసినా పైగణాంకాలు వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరిస్తున్నాయి. వివిధ కీలక అంశాల్లో మన పాలకుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని, తప్పుడు ప్రాధాన్యతలను ఎత్తిచూపుతున్నాయి. ఎన్నికల వేళ ఈ గణాంకాలు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వంటి సాధానాల ద్వారా దేశంలోని విస్తృత జన బాహుళ్యానికి తక్షణం చేరాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో 65.67 శాతం పోలింగ్

- భువనగిరిలో అత్యధికంగా 76.78 శాతం
- హైదరాబాద్‌లో అత్యల్పంగా 48.48 శాతం
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ 2024 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 65.67 శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా భువనగిరిలో 76.78 శాతం నమోదు కాగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48 శాతం ఓటింగ్ జరిగిందని పేర్కొన్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ, మహబూబ్‌బాద్, ఖమ్మం తదితర పది జిల్లాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదైందని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజక వర్గాల్లో ఎప్పటిలాగే 50 శాతం లోపు పోలింగ్ జరిగిందని తెలిపారు. మొత్తం 3,32,16,348 మంది ఓటర్లకు గాను 2,20,24,806 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వికాస్‌రాజ్ తెలిపారు. ఇందులో ఓటర్ ఫెసిలిటీ సెంటర్లు, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ద్వారా 2,10,771 మంది ఓటేశారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే గతేడాది కన్నా 2.90 శాతం పోలింగ్ పెరిగిందని వివరించారు. అసెంబ్లీ సెంగ్మెట్ల వారీగా చూస్తే అత్యధికంగా నర్సాపూర్‌లో 84.25 శాతం, అత్యల్పంగా మలక్‌పేటలో 42.76 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. ఓట్ల పరంగా చూస్తే మేడ్చల్ శాసన సభ నియోజకవర్గంలో అత్యధికంగా 3,85,149 ఓట్లు నమోదు కాగా, అత్యల్పంగా భద్రాచలంలో 1,05,383 ఓట్లు పోలయ్యాయని పేర్కొన్నారు. ఈవీఎంలను మూడంచెల భద్రత, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ కోసం ఒక్కో నియోజకవర్గానికి రెండు చొప్పున రాష్ట్రంలో 34 కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు.

నియోజక వర్గాల వారీగా పోలింగ్ శాతం

క్ర.సం	నియోజకవర్గం	2019	2024
1)	ఆదిలాబాద్(ఎస్టీ)	69.81	77.03
2)	మహబూబాబాద్(ఎస్టీ)	68.60	71.85
3)	వరంగల్ (ఎస్సీ)	64.08	68.86
4)	నాగర్ కర్నూల్ (ఎస్సీ)	66.53	69.46
5)	పెద్దపల్లి (ఎస్సీ)	63.86	67.87
6)	కరీంనగర్	67.67	72.54
7)	మెదక్	71.33	75.09
8)	మల్కాజిగిరి	46.27	50.78
9)	సికింద్రాబాద్	42.48	49.04
10)	నిజామాబాద్	67.96	71.92
11)	జహీరాబాద్	71.91	74.63
12)	హైదరాబాద్	39.17	48.48
13)	నల్లగొండ	70.36	74.02
14)	భువనగిరి	72.34	76.78
15)	ఖమ్మం	70.76	76.09
16)	మహబూబ్ నగర్	68.40	72.43
17)	చేవెళ్ల	53.15	56.50

జలందర్ లోక్‌సభ సీపీఐ(ఎం)అభ్యర్థిగా బిల్గానామినేషన్



జలందర్ : పంజాబ్‌లోని జలందర్ లోక్‌సభ స్థానం సీపీఐ(ఎం) అభ్యర్థి ప్రశోతమ్ లాల్ బిల్గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దేశ్ భగత్ మెమోరియల్ హాల్‌లో నిర్వహించిన సభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, రాష్ట్ర కార్యదర్శి సుఖ్విందర్‌సింగ్ సెఖాన్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి భంతొసింగ్ బ్రార్ తదితరులు ప్రసంగించారు.

సెల్ ఫోన్ చార్జీల సెగలు

(మొదటిపేజీ తరువాయి)

ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు పూర్తి కానున్నాయి. జూన్ 4న ఓట్లను లెక్కించనున్నారు. ఆ తర్వాత చార్జీల పెంపును ప్రకటించాలని టెలికం కంపెనీలు యోచిస్తున్నాయి. చివరి సారిగా 2021 డిసెంబర్‌లో దాదాపు 20 శాతం టారీఫ్‌లను పెంచాయి. 2023 ముగింపు నాటికి వొడాఫోన్ ఐడియా 19.3 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 33 శాతం, రిలయన్స్ జియో 39.7 శాతం చొప్పున మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. జియో మార్కెట్లోకి వచ్చిన సమయంలో రూ.149కే అన్‌లిమిటెడ్ ఉచిత కాల్స్, డేటాను అందించింది. ప్రస్తుతం ఈ ప్లాన్‌ను ధరను రూ. 209కి చేర్చింది. ఇదే బాటలో మిగితా ప్రయివేటు టెల్కోలు ప్రయాణించాయి. చాపకింద నీరులా దాదాపుగా మూడు, నాలుగు సార్లు పెంచాయి.మొబైల్ చార్జీలను 25 శాతం మేర పెంచడం ద్వారా వినియోగదారుడి నుంచి నెలకు సగటు రెవెన్యూ (ఏఆర్‌పీయూ) 16 శాతం పెరగనుందని అంచనా. మార్చితో ముగిసిన త్రైమాసికంలో జియో ఏఆర్‌పియు రూ.181.7గా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ ఏఆర్‌పీయూ రూ.209గా ఉంది. 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో వొడాఫోన్ ఐడియా ఏఆర్‌పీయూ రూ.145గా ఉంది.

'ఏఆర్‌పీయూ సగటున 10-15 శాతం పెరిగిన ఏడాదిలో వినియోగదారుడిపై అదనంగా రూ.100 భారం పడనుంది. ధరల పెంపు 4జీ, 5జీ ప్యాక్‌లపై ఉండొచ్చు. దీంతో ముందు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ లాభపడొచ్చు. వొడాఫోన్ ఐడియా రెవెన్యూ పెరగనుంది.' అని డెలాయిట్ సౌత్ ఏసియా టీఎంటీ ఇండస్ట్రీ లీడర్ పియూష్ వైష్ పేర్కొన్నారు. 2023-24లో జియో స్థూల రెవెన్యూ 10.4శాతం పెరిగి రూ.1 లక్ష కోట్లను చేరగా.. నికర లాభాలు 11.48 శాతం ఎగిసి రూ.20,607 కోట్లుగా నమోదయ్యాయి. 2023-24లో భారతీ ఎయిర్‌టెల్ నికర లాభాలు 10.5 శాతం తగ్గి రూ.7,467 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. సంస్థ రెవెన్యూ 7.8 శాతం పెరిగి రూ.1.50 లక్షల కోట్లకు చేరింది. భారత టెల్కోలు లాభాలు, రెవెన్యూలను దండిగానే ఆర్జిస్తున్నప్పటికీ.. వినియోగదారులపై మళ్లీ భారం మోపాలనే యోచన ఆందోళకరం.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఈ నెల 20 వరకు పొడిగించింది. ఈడీ కేసులో కవితకు విధించిన కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో ఆమెను తీహార్ జైలు సిబ్బంది మధ్యాహ్నం 2 గంటలకు వర్చువల్ మోడ్‌లో ట్రయల్ కోర్టు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఈడీ తరపున మట్ట వాదనలు వినిపిస్తూ... ఆమె బయట ఉంటే సాక్ష్యులను, ఆధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టుకు నివేదించారు. ఆమెకు మరో 14 రోజుల కస్టడీ పొడిగించాలని రెండు పేజీల అప్లికేషన్‌ను కోర్టుకు, కవిత తరపు న్యాయవాదికి సమర్పించారు. అయితే, ఎలాంటి ఆధారాలు లేని కేసులో కవితను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం సరికాదని ఆమె తరపు సీనియర్ అడ్వకేట్ నితేశ్ రాణా, మోహిత్ రావులు వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం కవితకు మరో ఆరో రోజుల జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తున్నట్లు స్పష్టం చేసింది. తిరిగి మే 20న తమ ముందు హాజరుపరచాలని పేర్కొంది. కాగా సీబీఐ కేసులోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 20 వరకు పొడిగించింది. అదే విధంగా కవితపై ఎనిమిది వేల పేజీలతో సప్లమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపింది. ఈ చార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకోవాలని ఈడీ తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌కె మట్ట కోరారు. దీనిని కూడా ఈనెల 20న పరిశీలిస్తామని ట్రయల్ కోర్టు తెలిపింది.

మోడీ ఆస్తులు రూ.3 కోట్లు

న్యూఢిల్లీ : వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రధానమంత్రి మోడీ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం మోడీ ఆస్తుల విలువ రూ.3,02,06,889. ఇందులో ఫిక్స్‌డ్ డిపాజిట్లే ఎక్కువగా ఉన్నాయి. ఎస్‌బీఐలో మొత్తం రూ.2.85 కోట్లు మోడీ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. 45 గ్రాముల బరువైన నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. వీటి విలువ రూ. 2.67 లక్షలుగా తెలిపారు. రూ.52,920 చేతిలో ఉన్న నగదుగా తెలిపారు.

ప్రజల కష్టాలు ప్రధాని పట్టించుకోరు



సంబంధం లేని విషయాలపై మోడీ ధ్యాస : అమేథీలో ప్రియాంక

అమేథీ (యూపీ) : ప్రధాని మోడీ ప్రజల కష్టాలు పట్టించుకోరు.. "సంబంధం లేని" విషయాలనే మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. అమేథీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కిషోరీ లాల్ శర్మకు మద్దతుగా మోహియా కేసరియాలో ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో ప్రియాంక గాంధీ ప్రసంగించారు. 45 నిమిషాల పాటు సాగిన తన ప్రసంగంలో ప్రధాని ప్రజలను ప్రేమించడం లేదని, ఏ రైతు ఇంటికి వెళ్లలేదని ఆమె ఆరోపించారు. "నిన్న అతను వారణాసిలో రోడ్ షో నిర్వహించారు. ఎత్తైన వాహనంపై, చుట్టూతా భద్రతా సిబ్బంది మధ్య నిలబడి చేతులు ఊపారు. మీ బాధ ఏమిటో అతనికి ఎలా తెలుస్తుంది? (అతను) కేవలం 'సేతులు' (వ్యాపారవేత్తలతో) మాత్రమే కనిపిస్తారు" ఆమె అన్నారు. అమేథీలో ప్రజలు ఓడించిన తన సోదరుడు రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4,000 కిలోమీటర్లు నడిచి దేశప్రజల సమస్యలు విన్నారని ఆమె అన్నారు. ఎన్నికల సమయంలో గేదెలు, మంగళసూత్రాలు, గుళ్లు, మసీదుల గురించి వినకూడదని మోడీకి చెప్పాలని ప్రియాంక గాంధీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలో అద్భుత రాజకీయాలు జరుగుతున్నాయని ఆమె అన్నారు. ప్రధాన మంత్రి, అమేథీ ఎంపీ (స్మృతి ఇరానీ) సహా బీజేపీ నేతలు ప్రజల పట్ల జవాబుదారీతనం లేదని భావిస్తున్నారు. మతం ప్రాతిపదికన తమ ఓటు వేస్తారని భావిస్తున్నారని ఆమె ఆరోపించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ నుంచి రాహుల్ గాంధీపై ఇరానీ విజయం సాధించారు. మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయిని ప్రశంసిస్తూ.. 'రాజీవ్‌గాంధీ మాత్రమే కాదు, బీజేపీకి చెందిన అటల్ బీహారీ వాజ్‌పేయి కూడా మంచి మనిషి అని.. ఆయనకు ప్రజల పట్ల గౌరవం ఉందని.. ప్రజలకు కొంత జవాబుదారీతనం ఉందని, కొంత పని ఉంటుందని అర్థం చేసుకున్నానని ప్రియాంక గాంధీ అన్నారు. రైతుల కోసం మోడీ ఏం చేశారో చెప్పలేరని అన్నారు. అక్కడక్కడా మాట్లాడి ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ఆమె అన్నారు. మోడీపై అవినీతి ఆరోపణలు చేస్తూ, "ఎలక్టోరల్ బాండ్లతో అతిపెద్ద అవినీతి పథకాన్ని తీసుకువచ్చారు. ఇందులో విరాళం ఇచ్చే వ్యక్తి పేరు రహస్యంగా ఉంటుంది" అని ప్రియాంక గాంధీ అన్నారు.

వచ్చే మూడ్రోజులు వర్షసూచన

- అక్కడక్కడా ఈదురు గాలులు వీచే అవకాశం
- రాష్ట్రంలో 60 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు పలు జిల్లాలకు వర్షసూచన ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలను చేర్చింది. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 60 ప్రాంతాల్లో వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మండాలపల్లిలో అత్యధికంగా 4.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 11 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. వాతావరణం చల్లబడటంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కొంత మేర తగ్గాయి. జగిత్యాల జిల్లా జైనలో అత్యధికంగా 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. కేవలం ఐదు జిల్లాల్లోనే 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే సూచనలున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశముంది.



జూన్ 4న నిశ్శబ్ద విప్లవం

- 12 సీట్లు మావే.. ప్రజలందరికీ ధన్యవాదాలు: ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజైన జూన్ 4న నిశ్శబ్ద విప్లవం రాబోతున్నదనీ, తమ పార్టీకి 12 సీట్లు రాబోతున్నాయని బీజేపీ నేత, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శాసనసభాపక్ష నేత ఆలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలతో సంబంధం లేకుండా బీజేపీ అభ్యర్థులకు ఓట్లేసిన ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మోడీ మరోమారు ప్రధాని కావాలనే ఆకాంక్షతోనే ప్రజలు పెద్ద ఎత్తున తమ పార్టీకి ఓట్లు వేశారన్నారు. ఎన్నికల్లో సహకరించిన పోలీసులకు, పోలింగ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. 42 ఏండ్ల తన రాజకీయ జీవితంలో పదేండ్ల పాలన తర్వాత కూడా ఒక పార్టీకి ప్రజల నుంచి ఇంత సానుకూల స్పందన కనిపించడం మామూలు విషయం కాదన్నారు. తమకు తక్కువ సీట్లు వస్తాయనే ఫ్రస్టేషన్‌లో రేవంత్‌రెడ్డి ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు తామిచ్చిన హామీలను, మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. పదేండ్ల కింద కాంగ్రెస్ నేతలు ఏమి చెప్పారో ఈ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి గదే చెప్పారని విమర్శించారు. మోడీ సారథ్యంలో బాంబు పేలుళ్లు, దాడులు లేవన్నారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో తమ అభ్యర్థి గెలువబోతు న్నాడని నొక్కి చెప్పారు. 14 సీట్లు వస్తాయని మొన్నటి వరకూ చెప్పుకున్న రేవంత్‌రెడ్డి నిన్న తమ పార్టీకి తొమ్మిది సీట్లు వస్తాయని చెప్పడమంటే ఓటమిని అంగీకరించడమేనన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలు వెళ్లే ఫ్లైట్‌లో సాంకేతిక లోపం

- శబరిమలై వెళ్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు పాయం, తెల్లం, జారే
- రన్ వే పైకి వెళ్తుండగానే లోపాన్ని గుర్తించిన పైలెట్
- వెంటనే మరమ్మతులు.. కదలాగానే మరోసారి ..
- రెండు గంటలు శంషాబాద్ విమానాశ్రయంలోనే..!



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో (నాలుగో దశ) లోక్‌సభ ఎన్నికలు సోమవారం ముగియడంతో శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి బయలుదేరిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రయాణించే ఇండిగో ఫ్లైట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. అయ్యప్ప స్వామి దర్శనం కోసం మంగళవారం ఉదయం 9.55 గంటలకు బయలుదేరే ఇండిగో ఫ్లైట్‌ను మంత్రితోపాటు పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు బుక్ చేసుకున్నారు. గంట ముందుగానే ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. చెక్ ఇన్ అనంతరం తోటి ప్రయాణికులతో పాటు ఫ్లైట్ ఎక్కారు. కాగా, సాంకేతిక లోపంతో ఆ ఫ్లైట్ ఎయిర్‌పోర్టులోనే మొరాయిం చింది. రన్ వే మీదకు వెళుతుండగానే లోపాన్ని గుర్తించిన పైలెట్.. మరమ్మతులు చేయించారు. కదలాగానే మరోసారి లోపం తలెత్తడంతో మంత్రి, ఎమ్మెల్యేలతో పాటు డీసీసీబీ మాజీ చైర్మెన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య రెండు గంటలుగా ఎయిర్‌పోర్టులోనే వేచి ఉన్నారు. అనంతరం బయలుదేరిన విమానం మధ్యాహ్నం రెండు గంటలకు కొచ్చి విమానాశ్రయం చేరుకుంది.

కుక్కదాడిలో పసిబాలుడు మృతి

- ఆవేశంలో కుక్కను చంపిన కుటుంబీకులు
- తాండూర్ మండలంలో ఘటన



నవతెలంగాణ-తాండూరు రూరల్

కుక్క దాడిలో నాలుగు నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం కరణ్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ విట్టల్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం దుప్పల్లి గ్రామానికి చెందిన నీలం దత్తు, లావణ్య దంపతులు 15 రోజుల క్రితం తాండూర్‌కు వలస వచ్చారు. తాండూరు మండలం సంగంకాలన్ గ్రామానికి చెందిన బసవేశ్వర్‌నగర్ మారుతి పాలిష్ యూనిట్ మిషన్‌లో పని చేస్తున్నారు. వీరికి కుమారుడు సాయినాథ్(4నెలలు) ఉన్నాడు. రోజూలాగే మంగళవారం ఉదయం దత్తు పాలిష్ యూనిట్ మిషన్‌లో నాపరాతి రాళ్లు కటింగ్ చేసేందుకు వెళ్లారు. బాలుడిని పడుకోబెట్టి లావణ్య తన భర్త వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో వీధి కుక్క యూనిట్ మిషన్ ప్రాంతంలోని రూమ్‌లోకి వెళ్లి నిద్రిస్తున్న బాలుడిపై అతిక్రూరంగా దాడి చేసింది. బాలుడి కన్ను, మెడకాయ, ముఖంపై కొరకడంతో బాలుడు కేకలు వేశాడు. వెంటనే తల్లిదండ్రులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా బాలుడు సాయినాథ్ అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఆవేశంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు.. కుక్కను కొట్టి చంపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విట్టల్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి

- సోమవారం రాత్రి వరకు పోలింగ్ విధుల్లోనే..



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో నివాసముంటున్న వ్యాయామ ఉపాధ్యాయుడు గడికొప్పుల సదానందం(48) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వహించిన ఆయన రాత్రి ఇంటికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం వాకింగ్ చేసి ఇంటికి వచ్చిన కాసేపటికి గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు మంచిర్యాలలో గల ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించే క్రమంలో మరొకసారి గుండెపోటు రావడంతో శ్రీనివాస్ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అవి మినహా... అన్ని ప్రభుత్వ సంస్థల ప్రయివేటే

- పాకిస్తాన్ ప్రధాని ప్రకటన

ఇస్లామాబాద్ : నగదు సంక్షోభంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాకిస్తాన్, నష్టాల్లో నడుస్తున్న పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌తో సహా అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరిస్తుందని ప్రధాని షహబాజ్ షరీఫ్ మంగళవారం ప్రకటించారు. తొలుత నష్టాలు వస్తున్న ప్రభుత్వ సంస్థలనే ప్రయివేటీకరించాలని ప్రభుత్వం భావించింది. కానీ తర్వాత ప్రభుత్వ ఆలోచనా తీరు మారింది. వ్యూహాత్మక సంస్థలు మాత్రం ప్రభుత్వ అధీనంలోనే వుంటాయి. కొత్త దీర్ఘకాలిక రుణ సదుపాయంపై అంతర్జాతీయ ద్రవ్యనిధితో చర్చలు ప్రారంభించిన మరుసటి రోజు ఈ ప్రకటన వెలువడింది. నష్టాలు సంభవిస్తున్న ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ ప్రక్రియపై సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన షరీఫ్ ఈ ప్రకటన చేశారు. వ్యాపారం చేయడం ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని, వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి సానుకూల వాతావరణానికి హామీ కల్పించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ప్రయివేటీకరణ కమిషన్‌తో సహకరించాల్సిందిగా అన్ని మంత్రిత్వ శాఖలను ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా వుండాల్సిన అవసరం వుందని నొక్కిచెప్పారు. బిడ్డింగ్, ఇతర ముఖ్యమైన చర్యలతోసహా పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) ప్రయివేటీకరణ క్రమాన్ని టెలివిజన్‌లో ప్రసారం చేయాల్సిందిగా ప్రధాని ఆదేశించారు. పీఐఏ ప్రయివేటీకరణ తుది దశలో వుందన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల అద్భుత విజయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పదో తరగతి ఫలితాల్లో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు అద్భుత విజయాన్ని సాధించారు. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరుసగా పదో సంవత్సరం కూడా వంద శాతం ఫలితాలను సాధించామని తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ ప్రార్థనా మణికొండ అందించిన నిరంతర సహకారం, ప్రణాళికాబద్ధమైన షెడ్యూల్‌తో ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఏడుగురు విద్యార్థులు ఏ-1 గ్రేడ్ సాధించారని వివరించారు. అనన్య 97 శాతం, సయ్యద్ ఫహీద్ జంగ్ 96.5 శాతం, చన్నా విశ్వేష్ రాజ్ 95.7 శాతం, నిధి జైన్ 95.2 శాతం, అద్వైత్ బాదామి 94.7 శాతం, అన్విశ్రీ సంజన 91.8 శాతం, యశ్వంత్, గరిష్ఠ ఏ-2 గ్రేడ్‌లు సాధించారని తెలిపారు.

ఎన్నికల విధుల్లో మరణించిన

ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి

- రెమ్యూనరేషన్‌లో తేడాలను సరిచేయాలి
- ఉపాధ్యాయులపై లాఠీచార్జీకి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీఈవో వికాస్‌రాజ్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల శిక్షణ, పోలింగ్ సందర్భంగా వడదెబ్బ, రోడ్డు ప్రమాదాలు, గుండె, మెదడు సంబంధిత సమస్యలతో హఠాన్మరణానికి గురైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. తీవ్ర అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు మెరుగైన వైద్య చికిత్సనందించాలని కోరింది. ఈ మేరకు ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో మైనారిటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, సిద్దిపేట జిల్లాలో లకావత్ రామన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ శ్రీకృష్ణ మరణించారని తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన రామకృష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గడిగొప్పుల సదానందం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మలకపల్లిలో ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లగా ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుతో మరణించారని వివరించారు. ములుగు జిల్లా బూరుగుపేట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు పోరిక మధుకర్ బ్రెయిన్ స్ట్రోక్ తో తీవ్ర అనారోగ్యానికి గురై సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధుల్లో ఉండగా చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా జిల్లా ఎన్నికల అధికారులు మంజూరు చేయాల్సి ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తాన్ని ముందుగా రాష్ట్ర ప్రభుత్వ నిధులనుంచి చెల్లించి, తదనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి రీయింబర్స్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు సత్వరమే ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల విధినిర్వహణలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేరిన మధుకుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందనీ, అతనికి ఎన్నికల సంఘం ఖర్చుతో మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకరూప పారితోషికం చెల్లించాలని ఎన్నికల ప్రధానాధికారి ఇచ్చిన ఆదేశాలను కొందరు జిల్లా ఎన్నికల అధికారులు పాటించలేదని జంగయ్య, చావ రవి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధంగా రెమ్యూనరేషన్ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం రావాల్సిన ఐదు రోజుల భత్యం ఇవ్వాలని కోరితే పోలీసులతో లాఠీచార్జీ చేయించడాన్ని మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. న్యాయంగా రావాల్సిన వేతన భత్యాలను ఇవ్వాలని అడిగితే పోలీసులతో బలప్రయోగం చేయడం అత్యంత దారుణమని విమర్శించారు. నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ ఇవ్వకుండా లాఠీచార్జీకి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఈవో వికాస్‌రాజ్‌కు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేరకమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జీ అన్యాయం : టీఎస్‌సీపీఎస్‌ఈయూ

ఉపాధ్యాయులపై సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో లాఠీచార్జీ చేయించడం అన్యాయమని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్ విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగితే లాఠీచార్జీ చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 1951 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికలనూ విజయవంతం చేయడంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. వారిని అభినందించాల్సిందిపోయి లాఠీచార్జీ చేయించడం దారుణమని పేర్కొన్నారు. ఈ ఘటనపై సీఈవో విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించిన వారికి ఒకే విధమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. జరిగిన పొరపాట్లను సరిచేయాలని సూచించారు.

నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి : సీఈవోకు టీఆర్టీఎఫ్ లేఖ

సమాన రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై నారాయణఖేడ్‌లో పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి కావలి అశోక్‌కుమార్ ఖండించారు. ఆ ఘటనకు కారకులైన స్థానిక ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని సీఈవో వికాస్‌రాజ్‌కు వారు మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి రెమ్యూనరేషన్ చెల్లించలేదని తెలిపారు. సమాన రెమ్యూనరేషన్‌ను చెల్లించాలని కోరారు. భద్రాచలంలో ఎన్నికల విధుల్లో ఉన్న పి మధుకుమార్ బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్‌లో అత్యవసర చికిత్స విభాగంలో ఉన్నారనీ, ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలి

టెట్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రారంభించాలని విద్యాసంవత్సరం నష్టపోకుండా వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి కావలి అశోక్‌కుమార్ లేఖ రాశారు. హైకోర్టు ఉత్తర్వులను ఉపాధ్యాయులందరికీ వర్తింపజేయాలని కోరారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో నారాయణ జైత్రయాత్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పది, 12వ తరగతి ఫలితాల్లో నేషనల్ టాపర్‌గా నారాయణ స్కూల్స్ నిలిచాయి. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 500 మార్కులకుగాను 498 మార్కులతో అగస్త్య రేమాని ఆలిండియాలో అత్యుత్తమ మార్కులను సాధించారని తెలిపారు.

12వ తరగతిలో 500 మార్కులకుగాను ఖ్యాతి శర్మ 493 మార్కులు, శామ్ శ్రేయస్ జోసెఫ్, సానా తబస్సుం 492 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోని 138 బ్రాంచీల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. పదో తరగతిలో 495 మార్కులు ఆపైన తొమ్మిది మంది, 490 మార్కులు ఆపైన 49 మంది, 485 మార్కులు ఆపైన 156 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. 12వ తరగతిలో 90 శాతంపైగా మార్కులు 667 మంది, 80 శాతానికిపైగా 1,909 మంది, పదో తరగతిలో 90 శాతానికిపైగా 2,012 మంది, 80 శాతానికిపైగా 4,219 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. ఈ స్థాయి ఫలితాలు మరే ఇతర విద్యాసంస్థ సాధించలేదని తెలిపారు.

రఫా దాడులపై ఐసీజే విచారణ

- జబాలియా శరణార్థ శిబిరంపై వందకు పైగా వైమానిక దాడులు
- కాల్పుల విరమణ చర్చల్లో ప్రతిష్టంభన.



గాజా : రఫా నగరంపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులపై గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) విచారణ జరపనుంది. దక్షిణాఫ్రికా కోరినట్టుగా తీసుకోవాల్సిన అత్యవసర చర్యల గురించి చర్చిస్తామని తెలిపింది. ఇజ్రాయిల్ దారుణమైన రీతిలో రఫాపై దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని దక్షిణాఫ్రికా న్యాయస్థానాన్ని కోరింది. జనవరిలో ఇజ్రాయిల్‌పై పెట్టిన కేసులో భాగంగానే దక్షిణాఫ్రికా తాజాగా ఈ అభ్యర్థన చేసింది. ఇజ్రాయిల్‌పై నమోదైన ఈ కేసులో ఆదివారం ఈజిప్ట్, టర్కీలు కూడా చేతులు కలిపాయి. రఫాపై ముమ్మరంగా దాడులు జరుగుతుండడంతో కాల్పుల విరమణ చర్చలు వెనుకపట్టు పట్టాయని మధ్యవర్తి ఖతార్ ప్రకటించింది. గత కొంతకాలంగా ఈ చర్చల్లో ఊపు లేకుండా పోయిందని పేర్కొంది. గత కొద్ది వారాలుగా పరిస్థితులు అస్సలు బాలేదని, అయినా ఈ చర్చల గురించి ఏదో కాస్త ఉత్సాహాన్ని నింపినా, దురదృష్టవశాత్తూ తాజాగా జరిగిన పరిణామాలతో నీరు కారిపోయాయని ఖతార్ ప్రధాని మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం ఇజ్రాయిల్ బలగాలు తూర్పు రఫాలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్ళి దాడులకు దిగాయి.

జాబాలియా శరణార్ధ శిబిరంలో తమ కార్యకలాపాలను విస్తరించినట్లు ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. సోమవారం నాడు వందకు పైగా వైమానిక దాడులు చేపట్టామని తెలిపింది. తూర్పు రఫా, జీటూన్ ఏరియాల్లో పాలస్తీనా ఫైటర్లను గుంపులు, గుంపులుగా తుదముట్టించినట్టు పేర్కొంది. మరోవైపు నుస్రత్ శరణార్థ శిబిరంలో జరిగిన దాడిలో 20మంది మరణించారు. వీరిలో పిల్లలు కూడా వున్నారు. ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ ట్యాంకులు పాలస్తీనియన్ల ఇళ్ళను నేలమట్టం చేస్తూ, పెద్ద ఎత్తున విధ్వంసానికి పాల్పడ్డాయి.

గాజాలో మరణించిన వారి సంఖ్య అంటూ ప్రతి రోజూ పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేస్తున్న గణాంకాలను పూర్తిగా విశ్వసిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తెలిపింది. ఇప్పటివరకు ఈ దాడుల్లో 35వేలమంది వరకు మరణించారని, వీరిలో దాదాపు 25వేల మందిని గుర్తించామని ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు.

ఇన్ని వేల మందిని గుర్తించారంటేనే ఈ డేటాలో ఎలాంటి తప్పు లేదని స్పష్టమవుతోందని డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి క్రిస్టినా లిండ్‌మేర్ తెలిపారు. ఇజ్రాయిల్ ఈ గణాంకాలను విమర్శించిన నేపథ్యంలో డబ్ల్యుహెచ్‌ఓ వివరణ వెలువడింది. ఇప్పటివరకు 35,173మంది మరణించగా, 79,061మంది గాయపడ్డారు.

సహాయక సిబ్బంది కష్టాలు

రఫాపై ఉధృతంగా జరుగుతున్న దాడులతో నిర్వాసితులైన వేలాదిమంది పాలస్తీనియన్లకు ఆహారం, ఇతర సరఫరాలు పంపిణీ చేయడంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని సహాయక కార్యకర్తలు తెలిపారు. గత వారం రోజుల్లో రఫా నుండి 3,60,000మంది పాలస్తీనియన్లు వెళ్ళిపోయారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ తెలిపింది. ఎయిడ్ క్రాసింగ్‌లను తెరిచామని ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. కానీ గత వారం రోజులుగా దక్షిణ గాజాలోని రెండు ప్రధాన క్రాసింగ్‌ల్లోకి ఆహారం ప్రవేశించలేదు. పరిస్థితులు రాన్రానూ భయంకరంగా తయారవుతున్నాయని ఐక్యరాజ్య సమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ ప్రతినిధి అబీర్ ఇటెఫా వ్యాఖ్యానించారు.

యోగా బాబాపై తీర్పు రిజర్వ్

- కొంత సమయం కావాలన్న పతంజలి
- రాందేవ్ ప్రభృతులకు కోర్టు ధిక్కార నోటీసులపై సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ : ప్రజలను తప్పుదారి పట్టించేలా వాణిజ్య ప్రకటనలు జారీ చేస్తున్న కేసులో యోగా గురు రాందేవ్, ఆయన సహాయకుడు బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద లిమిటెడ్‌కు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేయడంపై సుప్రీం కోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వ్ చేసుకుంది. లైసెన్సులు రద్దు చేయబడిన పతంజలి ఉత్పత్తులకు సంబంధించిన యాడ్స్‌ను రీకాల్ చేయడానికి తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని పతంజలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. మూడు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం బెంచ్ ఆదేశించింది. వారికి కోర్టు ధిక్కార నోటీసులను జారీ చేయడంపై ఆదేశాలను రిజర్వ్ చేసుకున్నామని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన బెంచ్ తెలిపింది. కాగా విచారణ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షుడు ఆర్.వి.అశోకన్ బెంచ్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇటీవల పిటిఐకి ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా అశోకన్, సుప్రీంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. ఈ తరుణంలో అశోకన్ క్షమాపణ చెబుతూ ఇచ్చే అఫిడవిట్‌ను ఆమోదించలేమని బెంచ్, ఐఎంఎల్ తరపు న్యాయవాదికి తెలిపింది. అశోకన్ తీవ్రమైన, ఆమోదయోగ్యం కాని ప్రకటనలు చేశారని బెంచ్ వ్యాఖ్యానించింది.

లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశావర్కర్లకు

తక్షణమే డబ్బులు చెల్లించాలి : ఆశా యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశావర్కర్లకు తక్షణమే డబ్బులు చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌తో పాటు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూకు వినతిపత్రం సమర్పించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్లు ఉదయం నుంచి రాత్రి వరకు పోలింగ్ బూత్‌ల వద్ద విధులు నిర్వహించారని తెలిపారు. అయినప్పటికీ చాలా జిల్లాల్లో అధికారులు డబ్బులు చెల్లించలేదని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే పరిస్థితి ఎదురైందనీ, దీంతో ఆశావర్కర్లు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న వివిధ క్యాడర్ల ఉద్యోగులకు, అనేక రంగాల కార్మికులకు డబ్బులు చెల్లిస్తూ, ఆశాలకు మాత్రం చెల్లించకుండా వివక్ష చూపడం ఎందుకని ప్రశ్నించారు. డబ్బులు చెల్లించిన జిల్లాల్లో కూడా ఆ చెల్లింపులు సమానంగా లేవని ఫిర్యాదు చేశారు. ఉదాహరణకు హనుమకొండలో రూ.600, నిర్మల్ డివిజన్‌లో రూ.400, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో, కామారెడ్డి జిల్లాలో రూ.300 చొప్పున చెల్లించారని వెల్లడించారు. ఎన్నికల విధులు

వెయికిపైగా స్కైపీ ఐడీలపై నిషేధం

న్యూఢిల్లీ : వెయికి పైగా స్కైపీ ఐడీలపై ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) మంగళవారం నిషేధం విధించింది. ఈ స్కైపీ ఐడీలతో సైబర్ నేరగాళ్లు బ్లాక్ మెయిల్, దోపిడీలు, 'డిజిటల్ అరెస్టులు'కు పాల్పడుతుండటంతో కోఆర్డినేషన్ సెంటర్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ స్కైపీ ఐడీలతో సైబర్ నేరగాళ్లు సీబీఐ, నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ, ఈడీ వంటి సంస్థల అధికారులుగా నటిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారు. ఈ ఐ4సీ అనేది సైబర్ నేరగాళ్లు ఉపయోగించే సిమ్‌కార్డులు, మొబైల్ పరికరాలు, నకిలీ ఖాతాలను కూడా నిషేధిస్తుంది. సైబర్ నేరాల గురించి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నట్టు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 496 టాప్ మార్కులతో ఆలిండియా నెంబర్‌వన్‌గా మరోసారి రికార్డు సృష్టించారు. ఈ మేరకు శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 495 మార్కులను ఇద్దరు విద్యార్థులు, 494 మార్కులు ఎనిమిది మంది, 493 మార్కులు 19 మంది, 490 మార్కులు ఆపైన 61 మంది, 480 మార్కులు ఆపైన 532 మంది, 470 మార్కులు ఆపైన 1,259 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. 92 శాతం బ్రాంచీల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ 99.5 శాతం ఉత్తీర్ణత సాధించిందని పేర్కొన్నారు. 500 మార్కులకుగాను సగటు 403 మార్కులొచ్చాయని వివరించారు. వివిధ వ్యక్తిగత సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు 791 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. 99 శాతం ఆపైన మార్కులు ముగ్గురు, 98 శాతం ఆపైన మార్కులు 61 మంది, 95 శాతం ఆపైన మార్కులు 872 మంది, 90 శాతం ఆపైన మార్కులను 2,662 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. టాప్ మార్కులు, సబ్జెక్టుల వారీగా నూటికి నూరు మార్కులు అత్యధిక సంఖ్యలో ఫలితాలను సాధించి సంచలనాత్మక రికార్డు సృష్టించామని తెలిపారు. ఐఐటీ-జేఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షా ఫలితాల్లో టాప్ ర్యాంకులతో నెంబర్‌వన్‌గా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

ఓటర్స్‌కు ఫోన్‌కాల్స్ బెడద

- పోలింగ్‌పై నేతల ఫీడ్‌బ్యాక్ స్వీకరణ
- పోలింగ్ ఏజెంట్ల నుంచి డేటా సేకరణ
- డివిజన్లు, మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కలు
- స్ట్రాంగ్ రూమ్స్‌లో అభ్యర్థుల భవితవ్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక.. ప్రధాన పార్టీల నేతలు మరో పనిలో పడ్డారు. ఓటర్లకు ఫోన్‌కాల్స్ చేస్తూ ఫీడ్ బ్యాక్ సేకరించుకుంటున్నారు. 'ఓటు ఎవరికి వేశారు..? కాంగ్రెస్‌కు వేస్తే ఒకటి నొక్కండి..? బీజేపీకి వేస్తే రెండు నొక్కండి..? బీఆర్ఎస్‌కు వేస్తే మూడు నొక్కండి..? నోటాకు వేస్తే నాలుగు నొక్కండి..? ఇతరులకు వేస్తే ఐదు నొక్కండి..?' అంటూ ప్రధాన పార్టీలు ఓటర్లకు ఫోన్‌కాల్స్ చేసి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నాయి. ఇలా రోజుకు రెండు, మూడు సార్లు ఫోన్లు చేసి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు నేతలు. పోలింగ్ ఏజెంట్లు, బూత్‌లు, డివిజన్లు, మండలాలు, నియోజకవర్గాల వారీగా డేటాను సేకరిస్తున్నారు. ఈ విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపోటములపై ఎవరికి వారే లెక్కలేసుకుంటున్నారు.

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రంగా ఉంచిన ఈవీఎంలలో దాగి ఉంది. ఫలితాలకు మరో 20 రోజుల సమయం ఉంది. దీంతో ఆయా పార్టీలు, అభ్యర్థులు, కింది స్థాయి నాయకులు పోలింగ్ ముగిసిన రాత్రి నుంచే లెక్కలేయడం మొదలు పెట్టారు. గతేడాదితో పోల్చుతూ పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు. వర్గాలు, కులం, మతం, ప్రాంతం, ఆయా రంగాల వారీగా ఓటర్ల నాడీని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ ముఖ్య నాయకులు, అనుచరులతో అభ్యర్థులు, అధిష్టానం పెద్దలు మంతనాలు జరుపుతున్నారు.

ఓటర్లకు ఫోన్ కాల్స్ బెడద

ఎన్నికల ముందు.. ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, గత అనుభవాలు, మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలు, ఎన్నికల ప్రచార శైలి, అగ్ర నాయకుల ఆగమనం, పోటీ చేసే అభ్యర్థి గుణగణాలు, మంచి చెడు లాంటి విషయాలను వివరించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ తర్వాత కాస్త భిన్నంగా ఫోన్ కాల్స్ చేసి 'ఓటు ఎవరికి వేశారు..? పలానా పార్టీకి వేస్తే ఒకటి నొక్కండి.. రెండు నొక్కండి..' అని ఆప్షన్లు ఇస్తూ, ఎవరికి ఓటు వేశారో తెలుసుకునే పనిలో పడ్డారు. ఈ ఫోన్ కాల్స్ ద్వారా సేకరించిన డేటా ఆధారంగా తమ పార్టీతో పాటు ఇతర ప్రధాన పార్టీల గెలుపోటములను సైతం అంచనా వేసే అవకాశం లేకపోలేదు. ఈ సమాచారం ఆధారంగా ఫలితాలు రాకముందే గెలుపు ఎవరిదో సులువుగా తెలుసుకునే అవకాశం ఉన్నట్టు ఆయా పార్టీలు, అభ్యర్థులు ఆలోచిస్తున్నట్టు సమాచారం.

ఏజెంట్లు, బూత్‌ల సమాచారమే ముఖ్యం..

ఫోన్‌కాల్స్‌కు తోడు పోలింగ్ ఏజెంట్లు, బూత్‌ల నుంచి స్పష్టమైన సమాచారం కోరుతున్నారు. పోలింగ్ సరళికి అతి దగ్గర ఉండే ఏజెంట్లు, ఓటర్ల మనోగతం గురించి అవగాహన ఉన్న బూత్ ఇన్‌చార్జీల నుంచి నేతలు పక్కా సమాచారం తెప్పించుకునే పనిలో పడ్డారు. దీనికితోడు వీరికి ఓటర్లపై ఓ అంచనా ఉండటంతో వారు ఎవరికి ఓటేసి ఉంటారో..? అని ఊహించే పనిలో పడ్డారు.

ఎవరి ధీమా వారిది..

గెలుపోటములపై ఎవరి ధీమా వారికే ఉంది. బూత్‌లు, డివిజన్లు, మండలాలు, నియోజకవర్గాల్లో ఎంత శాతం పోలింగ్ జరిగింది అనే వివరాల ఆధారంగా గెలుపోటములపై నాయకులు అంచనాలు వేస్తున్నారు. ఎంత శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఏ మండలంలో ఎంత మేరకు ఓట్లు రానున్నాయి.. ఏ మేరకు మెజార్టీ వస్తుందో అని లెక్కలేసుకుంటున్నారు. డివిజన్లు, మండలాల వారీగా పార్టీ శ్రేణుల నుంచి వివరాలు రాబట్టి అంచనాకు వస్తున్నారు. కార్యకర్తలు, ముఖ్య నాయకులు ఇస్తున్న సమాచారంతో అభ్యర్థులు లెక్కల్లో మునిగి పోయారు. గత ఎన్నికల గణాంకాలతో పోల్చి చూసుకుంటున్నారు. కాస్త తక్కువ పోలింగ్ నమోదు కావడంతో ప్రధాన పార్టీల్లో గుబులు రేపుతున్నది. లోలోపల ఎవరికి వారే ఓటింగ్ తమకే అనుకూలమని ప్రధాన పార్టీల నేతలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బిజినెస్

ప్రభుత్వ బ్యాంకులు అదుర్స్

- రూ.1.4 లక్షల కోట్ల రికార్డ్ లాభాలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో ఏకంగా 35 శాతం వృద్ధితో రూ.1.41,203 కోట్ల నికర లాభాలను సాధించాయి. దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంక్(పీఎస్‌బీ)లు 2022-23లో రూ.1,04,649 కోట్ల లాభాలను ప్రకటించాయి. క్రితం ఆర్థిక సంవత్సరం మొత్తం లాభాల్లో ఒక్క ఎస్‌బీఐనే 40 శాతం వాటాను కలిగి ఉంది. మోడీ ప్రభుత్వ హయంలో చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, లక్షల కోట్ల రుణాల మాఫీలోనూ పిఎస్‌బిలు రాణించడం విశేషం. 2023-24నకు సంబంధించిన ఆర్థిక ఫలితాలను ఇటీవల పీఎస్‌బీలు ప్రకటించాయి. దిగ్గజ ఎస్‌బీఐ ఏకంగా 22 శాతం పెరుగుదలతో రూ.61,077 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 2022-23లో రూ.50,232 కోట్ల లాభాలను ఆర్జించింది.2023-24లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 228 శాతం వృద్ధితో రూ. రూ.8,245 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 62 శాతం పెరుగుదలతో రూ.13,649 కోట్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 61 శాతం వృద్ధితో రూ.2,549 కోట్ల చొప్పున లాభాలను నమోదు చేశాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా 50 శాతం పెరుగుదలతో రూ.6,318 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభాలు 56 శాతం పెరిగి రూ.4,055 కోట్లుగా, ఇండియన్ బ్యాంక్ 53 శాతం వృద్ధితో రూ.8,063 కోట్ల చొప్పున లాభాలు సాధించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.17,788 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.14,554 కోట్లు చొప్పున లాభాలను ప్రకటించాయి. పీఎస్‌బీల్లో ఒక్క పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ లాభాలు మాత్రమే 55 శాతం తగ్గి రూ.595 కోట్లుగా నమోదు చేసింది.

ఏఐతో ఉద్యోగాలకు పెను ముప్పు

- ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా హెచ్చరిక



జ్యూరిచ్ : కృత్రిమ మేధా(ఎఐ)తో ఉద్యోగాలకు పెను ముప్పు పొంచి ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. జ్యూరిచ్‌లో జరిగిన ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఏఐ ఉద్యోగ మార్కెట్‌పై సునామీలా విరుచుకుపడొచ్చని హెచ్చరించారు. వచ్చే రెండేండ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల్లో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయని పేర్కొన్నారు. ఎఐ దెబ్బతో అభివృద్ధి చెందిన దేశాల్లో 60 శాతం ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా చూసినప్పుడు ఈ సంఖ్య 40 శాతం వరకు ఉండొచ్చన్నారు. ఏఐని సరిగ్గా నిర్వహించకుంటే ఆదాయ అసమానతలకూ దారి తీస్తుందని హెచ్చరించారు. ఏఐ అభివృద్ధి, ఆచరణలోకి తీసుకురావడానికి అన్ని దిగ్గజ కంపెనీలు పోటీ పడుతున్న విషయం తెలిసిందే. చాట్ జీపీటీ మాతృ సంస్థ ఓపెన్ ఏఐ జీపీటీ-4 మోడల్‌ను ఆవిష్కరించగా.. గూగుల్ ఆండ్రాయిడ్ టెక్నాలజీకి మరిన్ని ఏఐ ఫీచర్లను జోడిస్తోంది.

ధీరజ్ వాధ్వాన్ అరెస్ట్

- బ్యాంక్‌లకు రూ.34వేల కన్నం కేసు
- సీబీఐ కస్టడీకి డిహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్లు



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ మోసం కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధ్వాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. రూ.34వేల కోట్ల మోసం కేసులో వాధ్వాన్‌ను సోమవారం సాయంత్రం ముంబయిలో అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచామని.. ఆ తర్వాత జ్యుడీషియల్ కస్టడీకి పంపామని వెల్లడించారు. దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలిచిన ఈ కేసుకు సంబంధించి 2022లో సీబీఐ అతడిని చార్జిషీట్‌లో చేర్చింది. యెస్ బ్యాంక్ అవినీతి కేసులో గతంలోనే వాధ్వాన్‌ను సీబీఐ అరెస్టు చేయగా.. బెయిల్‌పై బయట ఉన్నారు.

17 బ్యాంకుల కన్సార్టియంను మోసం చేశారన్న ఆరోపణలపై డిహెచ్ఎఫ్ఎల్‌పై సీబీఐ కేసు నమోదు చేశామని.. ఇది దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ రుణ మోసంగా నిలిచిందని అధికారులు తెలిపారు. యూబీఐ ఆధ్వర్యంలోని 17 బ్యాంకుల కన్సార్టియాన్ని 2010-18 మధ్య కాలంలో డిహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్లు రూ.34,615 కోట్లకు మోసం చేసిన విషయం 2020లో బయటపడింది. 2019లోనే ఈ రుణాలు నిరర్థక ఆస్తులుగా మారాయి. యూనియన్ బ్యాంక్ 2021లో నమోదు చేసిన ఫిర్యాదు ఆధారంగా డిహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్లు కపిల్, ధీరజ్ వాధ్వాన్‌లపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు దేశంలో నీరవ్ మోడీ రూ.13వేల కోట్లు, ఏబీజీ షిప్‌యార్డ్ రూ.23వేల కోట్లకు బ్యాంక్‌లను ముంచిన కేసులు.. అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణాలుగా ఉన్నాయి.

క్రిమినల్, కుట్ర ఆరోపణలలో భాగంగా కపిల్ వాధ్వాన్, సిఎండి ధీరజ్ వాధ్వాన్, డైరెక్టర్, ఆరు రియాల్టీ కంపెనీలపై సీబీఐ కేసు బుక్ చేసి విచారణ జరుపుతుంది. అంతేకాక బ్యాంకులు ఇచ్చిన నిధులను కంపెనీ ప్రమోటర్లు దారి మళ్లించారనే ఆరోపణలు వచ్చాయి. కపిల్, ధీరజ్ వాధ్వాన్‌లు నిధులను దారి మళ్లించి, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని, సొంత ఆస్తులను పెంచుకున్నారని ప్రధాన అరోపణ.

17న నేషనల్ ఫెసిలిటీస్ మేనేజర్స్ సమ్మిట్

హైదరాబాద్ : నగరంలో 10వ నేషనల్ ఫెసిలిటీస్ మేనేజర్స్ సమ్మిట్ 2024 జరగనుంది. మే 17న హైదరాబాద్‌లోని నార్సింగిలోని అడ్రస్ కన్వెన్షన్ సెంటర్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ హాజరు కానున్నారని తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టిఎఫ్ఎంసి) అధ్యక్షుడు మఠాల సత్యనారాయణ తెలిపారు. దాదాపు 400 మంది ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ నిపుణులు(సౌకర్యాల నిర్వహణ నిపుణులు) సమ్మిట్‌లో పాల్గొంటారన్నారు.

అధ్యాపకులతో ఇంటర్ బోర్డు చెలగాటం

- ఇంకా చెల్లించని స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్
- మూల్యాంకనం ముగిసి 50 రోజులైనా అధికారుల అలసత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులతో ఇంటర్ బోర్డు అధికారులు చెలగాటమాడుతున్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది కలిపి మొత్తం 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గతనెల నాలుగో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో జరిగింది. గతనెల 24న ఇంటర్ ఫలితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. ఇంటర్ పరీక్షలు ముగిసి దాదాపు రెండునెలలు, మూల్యాంకనం ప్రక్రియ ముగిసి 50 రోజులు దాటింది. అయినప్పటికీ ఇంత వరకు స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్‌ను అధ్యాపకులకు చెల్లించలేదు. ఇంటర్ బోర్డు అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షల విధులు, స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉద్యోగులకు రెమ్యూనరేషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

రుణమాఫీ చేయకుంటే ఆగస్టులో సంక్షోభం

- గ్యారంటీల కోసం అప్పులకుప్పగా తెలంగాణ
- గ్యారేజీ నుంచి కారు బయటకెళ్లడం కష్టమే : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీ మేరకు పంద్రాగస్టు లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేయకుంటే ఆగస్టులో రాజకీయ సంక్షోభం తప్పదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ ఎంపీ కె.లక్ష్మణ్ బాంబు పేల్చారు. ఆరు గ్యారంటీల అమలు కోసం రూ.2 లక్షల కోట్లు అవసరమనీ, వాటి పేరిట తెలంగాణను మరింత అప్పులకుప్పగా మార్చే యత్నం జరుగుతున్నదని విమర్శించారు. దీంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం దిశగా వెళు న్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 370, ఎన్డీయే కూటమికి 400 సీట్లు వస్తాయని మరోమారు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అవినీతిపరులపై చర్యలు తీసుకోలేదనీ, ధరణి సమస్యల పరిష్కారానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చచ్చిన పాములా మారిందనీ, కారు గ్యారేజీ నుంచి బయటకు రావడం కష్టమేనని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు దక్కడం కూడా గగనమని తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీలో, బీఆర్ఎస్ విలీనం ఖాయమన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేల విడిచి సాము చేసి అలవిగాని హామీలు ఇచ్చారన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చుతుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని చెప్పారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలు కాదు, కాంగ్రెస్ నేతలే తిరగబడుతారని లక్ష్మణ్ హెచ్చరించారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ఆ పార్టీని విశ్వసించలేదన్నారు. ఫేక్ వీడియో తయారు చేసిన రేవంత్ రెడ్డి ఫేక్ సీఎం అని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సహకరించిన కార్యకర్తలకు, ప్రజలకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

బాండు డబ్బులు ఇవ్వని వారికి వెంటనే చెల్లించాలి

- ఆర్టీసీకి సర్కారు తక్షణమే వెయ్యి కోట్ల గ్రాంట్స్ ఇవ్వాలి
- రెండేండ్లపాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలి
- ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీ సయ్యద్ మహమూద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్ఆర్టీసీ కార్మికులకు సంబంధించి ఇంకా ఇవ్వని వారికి రెండు రోజుల్లో బాండు డబ్బులు చెల్లించాలని ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీ సయ్యద్ మహమూద్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బతకాలంటే ప్రభుత్వం తక్షణమే వెయ్యి కోట్ల రూపాయల గ్రాంట్స్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక, రవాణా మంత్రులను కోరుతూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ సంక్షోభంలో ఉందని.. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. మహాలక్ష్మి పథకాన్ని కార్మికులు చాలా జయప్రదంగా నిర్వహిస్తున్నారని, అందుకు సంబంధించి ఆర్టీసీకి నెలకు చెల్లించాల్సిన రూ.300 కోట్లు సకాలంలో విడుదల చేయడం లేదన్నారు. దాంతోపాటు కార్మికుల వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ చర్యలతో ఆర్టీసీకి రూ.6వేల కోట్ల నష్టం వాటిల్లిందని, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి ఆర్టీసీ కార్మికులందరూ సంపూర్ణ మద్దతునిచ్చారని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆర్టీసీకి ట్యాక్స్ హాలిడే ఇచ్చారని, ఇప్పుడు కూడా రెండేండ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని కోరారు. తద్వారా ఆర్టీసీకి కొత్తగా 1500 బస్సులు కొని.. బలోపేతం చేద్దామని పేర్కొన్నారు. 30ఏండ్లపైగా సర్వీసు ఉన్నా కండక్టర్, డ్రైవర్లకు ప్రమోషన్లు ఇచ్చే పరిస్థితుల్లో సంస్థ లేదని, ఇప్పటికైనా అన్ని క్యాటగిరిల్లో ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ వీలినంపై తక్షణ చర్యలు చేపట్టాలని, మహాలక్ష్మి పథకం అమల్లో పొరపాట్లకు కండక్టర్లను సస్పెండ్ చేయొద్దని పేర్కొన్నారు. ఓవర్‌లోడ్ బస్సుల వల్ల కొన్ని తప్పులు జరుగుతున్నాయని.. ఈ మినహాయింపు ఇవ్వాలని కోరారు 2014 నుంచి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, సీసీఎస్, పీఎఫ్ అమౌంట్ రిఫండ్ చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, టీఎస్ఆర్టీసీ ఎండీలను కలుస్తామన్నారు. లేనిపక్షంలో ఆర్టీసీని రక్షించుకోవడం కోసం ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పోరాటం తప్పదని పేర్కొన్నారు.

బీమా కొరెగావ్ కేసులో బెయిల్‌పై స్టే ఎత్తివేసిన సుప్రీం



న్యూఢిల్లీ : బీమా కొరెగావ్ హింస కేసులో ఉపా కింద అభియోగాలు మోపిన గౌతమ్ నవ్లాఖాకు బాంబే హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆదేశాలపై సుప్రీం మంగళవారం స్టే ఎత్తివేసింది. నవ్లాఖా ఇప్పటికే జైల్లో నాలుగేండ్లకు పైగా గడిపారని, ఆయన 70వ పడిలో వున్నారని, ఆయన విచారణకు ఏళ్ళు పట్టే అవకాశం వుందని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. ఉపా కింద ఆయన తీవ్రవాద చర్యలకు పాల్పడ్డారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చెబుతున్న వాదనలకు రుజువులు లేవని బెంచ్ పేర్కొంది. అయితే, ఆయన బెయిల్‌పై సుప్రీంలో సవాలు చేయడానికి ఎన్ఐఎ కొంత గడువు కోరడంతో మూడు వారాల పాటు బెయిల్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.దీర్ఘకాలంగా జైల్లో వుండడం వల్ల ఆయన అస్వస్థతో బాధపడుతున్నారని మంగళవారం సీనియర్ న్యాయవాది నిత్యా రామకృష్ణన్ చెప్పారు. ఇప్పటికే గృహ నిర్బంధం ఖర్చుల కింద రూ.2.4లక్షలు చెల్లించారని తెలిపారు.

ప్రభుత్వ ప్లీడర్ల గౌరవవేతనం పెంపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ ప్లీడర్ల గౌరవవేతనం (రెన్యుమరేషన్)ను రూ. 2 వేలకు పెంచుతున్నట్టు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మెమో జారీ చేశారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల కోర్టు ధిక్కరణ కేసులకు హాజరయ్యే ప్లీడర్లకు ఇప్పటి వరకు రూ.500 మాత్రమే చెల్లించేవారు. దీనితో వారు ఇతర ఖర్చుల కోసం సదరు కక్షిదారుల నుంచి అదనంగా డబ్బు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ప్లీడర్ల గౌరవవేతనాన్ని రూ.2 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఎంతమంది కక్షిదారులు ఉన్నా, ఒక కేసుకు రూ.2వేలు మాత్రమే చెల్లిస్తారని తెలిపారు. కేసుకు హాజరైన ఆధారాలు సమర్పించి ప్రభుత్వ ప్లీడర్లు ఈ గౌరవ వేతనాన్ని పొందవచ్చని వివరించారు.

నేటినుంచి టెట్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

- 20 నుంచి ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో టెట్ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశ ముంటుంది. జూన్ రెండో తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఈనెల 20, 21, 22, 24, 28, 29 తేదీల్లో పేపర్-2, ఈనెల 30, 31, వచ్చేనెల ఒకటి, రెండో తేదీన పేపర్-1 రాతప రీక్షలు జరుగుతాయి. వచ్చేనెల ఒకటో తేదీన పేపర్-2 మ్యాథ్స్, సైన్స్ అభ్యర్థులకు మైనర్ మీడి యంలో రాతపరీక్ష ఉంటుంది. రాష్ట్రవ్యా ప్తంగా టెట్‌కు 2,86,386 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో పేపర్- 1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,428 మంది ఉన్నారు. ఈనెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, వచ్చేనెల నాలుగో తేదీన సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉన్న విషయం తెలిసిందే. ఆయా తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించకుండా అధికారులు కసరత్తు చేశారు.

తెలంగాణ స్టేట్ అడ్వకేట్ జేఏసీ ఉపాధ్యక్షునిగా గుంజి సంతోష్ కుమార్ వడ్డేరాజ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ స్టేట్ అడ్వకేట్ జేఏసీ ఉపాధ్యక్షునిగా సికింద్రాబాద్ బోయిన్‌పల్లికి చెందిన గుంజి సంతోష్ కుమార్ వడ్డేరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ సంతోష్ కుమార్ కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ 41 సీఆర్పీసీ, స్టేషన్ బెయిల్ రద్దు, జూనియర్ న్యాయవాదులకు తొలి ఐదేండ్లు రూ.10 వేల ఉపకారవేతనం, పేద న్యాయవాదులకు సొంత ఇంటి స్థలాలు మంజూరు వంటి సమస్యలున్నాయని తెలిపారు. ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, న్యాయ శాస్త్ర విద్యార్థులు, యువ న్యాయవాదుల హక్కుల కోసం పోరాడుతున్న సంతోష్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా అవసరమని భావించి ఈ పదవిలో నియమించినట్టు తెలిపారు.

ఒడిశాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రాహుల్‌గాంధీతో కలిసి బొలంగిర్ పార్లమెంట్ స్థానంలో ప్రచారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. నేడు (15న) రాహుల్ గాంధీతో కలిసి ఒడిశా రాష్ట్రంలోని బోలంగిర్ లోక్‌సభ పరిధిలో ప్రచారం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీతో కలిసి ప్రత్యేక విమానంలో ఆయన బొలంగిర్ లోక్‌సభ స్థానానికి చేరుకోనున్నారు. ఇప్పటికే ఒడిశా రాష్ట్రంలో మూడు దఫాలుగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రచారం నిర్వహించారు. కటక్‌లో ఒకరోజు, భువనేశ్వర్‌లో రెండు రోజులు, రాయగడ పార్లమెంటు పరిధిలో రెండు రోజులపాటు ప్రచారం నిర్వహించారు. తాజాగా నాలుగోసారి ఒడిశా రాష్ట్రంలోని బోలంగిర్ పార్లమెంటు పరిధిలో ప్రచారం నిర్వహించనున్నారు

బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చిప్ ఖరాబైంది

రిపేర్ చేయించుకుంటే మంచిది...

- మాతో టచ్‌లో బీఆర్ఎస్ నుంచి 20 మంది, బీజేపీ ఐదుగురు ఎమ్మెల్యేలు : టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్, బీఆర్ఎస్ విలీనం ఖాయమంటూ బీజేపీ ఎంపీ కె లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి తప్పుపట్టారు. ఆయనకు చిప్ ఖరాబైందనీ, వెంటనే రిపేర్ చేయించుకుంటే మంచిందని సూచించారు. కొత్త చిప్ వేసుకొని రావాలనీ, కావాలంటే దానికి అయ్యే ఖర్చునూ కూడా కాంగ్రెస్ పార్టీనే ఇస్తుందన్నారు. అందుకే ఆయన అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు, బీజేపీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు టచ్‌లో ఉన్నారనీ, వారంతా తమ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయనీ, ఎక్కడా అధికార దుర్వినియోగం జరగలేదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఎవరికి ఇబ్బంది కలిగేంచేలా ప్రవర్తించలేదని చెప్పారు. పోలీసులు వ్యవస్థను దుర్వినియోగం చేయలేదని ప్రశంసించారు. స్వేచ్ఛగా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారనీ, ఆయన పండితునిలా జాతకాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆగస్టులో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో పడుతుందని ఎలా అన్నారనీ, బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తారనడంలో అర్థమేంటని ప్రశ్నించారు. ఈ కుట్రలో బీజేపీ పాత్ర ఉందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. 65 సీట్లు ఉన్న కాంగ్రెస్ ఎందుకు పడిపోతుందో లక్ష్మణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలిచ్చి ఎగనామం పెట్టడంలో బీజేపీ నాయకులను మించిన వారు ఉండరని ఎద్దేవా చేశారు. ప్రతీ విషయంలో ఆ పార్టీ నేతలు దేవుడిని అడ్డం పెట్టుకుని ప్రగల్భాలు పలుకుతారని విమర్శించారు. మోసం అంటే ఎలా ఉంటుందో కూడా కాంగ్రెస్‌కి తెలియదన్నారు.

కెటలోనియా ప్రాంతీయఎన్నికల్లో సోషలిస్టుల ఘన విజయం

బార్సిలోనా : ఆదివారం జరిగిన కెటలోనియా ప్రాంతీయ ఎన్నికల్లో స్పానిష్ సోషలిస్టు పార్టీ చారిత్రక ఫలితాలు సాధించింది. దశాబ్దాల కాలంలోనే ఎన్నడూ లేని విధంగా స్పెయిన్ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయిన ఆరేండ్ల తర్వాత కెటలోనియా ప్రాంతంలోని వేర్పాటువాద పార్టీలపై సోషలిస్టు పార్టీ విజయాన్ని నమోదు చేసింది. మాజీ ప్రాంతీయ అధ్యక్షుడు కార్లెస్ పుడ్జెమాంట్‌కి చెందిన టుగెదర్ పార్టీ నేతృత్వంలో స్వాతంత్ర్య అనుకూల నాలుగు పార్టీలు మొత్తంగా 61సీట్లను గెలవాల్సి వుంది. చాంబర్‌లో మెజారిటీకి 68సీట్లు అవసరం. కాగా మాజీ ఆరోగ్య మంత్రి సాల్వడార్ ఇల్లా నేతృత్వంలోని సోషలిస్టులు కెటనల్ ఎన్నికల్లోనే ఉత్తమ ఫలితాలు సాధించారు.

నేడు సీపీగెట్ నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్) నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. ఈ నోటిఫికేషన్‌ను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేస్తారని సీపీగెట్ కన్వీనర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీలు టి రమేష్; సిహెచ్ గోపాల్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రాథోడ్, మల్లేశం, విజ్జులత పాల్గొంటారని పేర్కొన్నారు.

20 నుంచి దోస్త్ వెబ్‌ఆప్షన్లు

- షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా వెబ్‌ఆప్షన్లను నమోదు చేసే ప్రక్రియ ఈనెల 20 నుంచి ప్రారంభం కానుంది. దోస్త్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చేశామని దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉందని పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల ఈనెల 20 నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వెబ్‌ఆప్షన్ల నమోదుకు తుది గడువు ఈనెల 30 వరకు ఉందని పేర్కొన్నారు. ఈ మార్పును విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు గమనించాలని కోరారు. ఈనెల 25వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశమున్న విషయం తెలిసిందే.

పలు సంస్థలపై పది కేసులు నమోదు ప్రకటించిన కార్మికశాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక సందర్భంగా కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలనే ఆదేశాలను బేఖాతరు చేసిన పలు సంస్థలు, పరిశ్రమలు, దుకాణాలపై 30 కేసులు నమోదు చేసినట్టు కార్మిక శాఖ ప్రకటించింది. ఈ మేరకు డీసీఎల్ డాక్టర్ ఈ.గంగాధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ సందర్భంగా కార్మిక శాఖ నిర్వహించిన తనిఖీలు, ఫిర్యాదుల ప్రకారం 30 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈసీ నిబంధనలను ఉల్లంఘించిన యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇజ్రాయిల్‌కు పూర్తి విజయం : అమెరికా



గాజాలో హమాస్‌పై ఇజ్రాయిల్ నిర్ణయాత్మకంగా విజయం సాధించగలదని అమెరికా విశ్వసించడం లేదని విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రెటరీ కర్ట్ కాంప్‌బెల్ అన్నాడు. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్, పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ మధ్య పోరు గత వారం ఎనిమిదో నెలలోకి ప్రవేశించింది. పశ్చిమ జెరూసలేం హమాస్‌ను నాశనం చేస్తానని చేసిన ప్రతిజ్ఞ నుండి వైదొలగడానికి నిరాకరించింది. " కొన్నిసార్లు మేము ఇజ్రాయిల్ నాయకులను నిశితంగా పరిశీలించినప్పుడు, వారు యుద్ధభూమిలో ఏదో ఒక విధమైన సంపూర్ణ విజయాన్ని సాధించాలనే ఆలోచన గురించి ఎక్కువగా మాట్లాడతారు" అని సోమవారం ఫ్లోరిడాలోని మయామిలో జరిగిన నాటో యూత్ సమ్మిట్‌లో కాంప్‌బెల్ అన్నారు. "అది సాధ్యమని మేము నమ్మటం లేదు" అని అతను చెప్పాడు.

ఇజ్రాయిల్ సైన్యం యొక్క తరలింపు సూచనల ప్రకారం పాలస్తీనియన్ ఎన్‌క్లేవ్ యొక్క ఉత్తర భాగం నుండి పారిపోయిన శరణార్థులతో రద్దీగా ఉండే గాజాలోని దక్షిణ నగరమైన రఫాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడిపై వాషింగ్టన్, పశ్చిమ జెరూసలేం మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నాయని అతను అంగీకరించాడు. ఈ ఆపరేషన్‌లో పౌర మరణాలు, ఎక్కువ మంది శరణార్థుల పెరుగుదలకు దారి తీస్తుందని అధ్యక్షుడు జో బైడెన్ విశ్వసిస్తున్నారని కాంప్‌బెల్ నొక్కిచెప్పాడు. కాంప్‌బెల్ మాటలు అతని బాస్, సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ గతంలో చేసిన ప్రకటనలను ప్రతిధ్వనించాయి. ఇజ్రాయిల్ గాజాలో హమాస్‌ను పూర్తిగా నిర్మూలించ జాలదని, పాలస్తీనా ఎన్‌క్లేవ్‌ను పూర్తిగా ఆక్రమించడంలో ఇజ్రాయిల్ విజయం సాధించినప్పటికీ, ఐడీఎఫ్ విడిచిపెట్టిన తర్వాత మిలిటెంట్లు దానిని తిరిగి స్వాధీనం చేసుకుంటారని ఆయన అన్నాడు.

ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు, అతని యుద్ధ క్యాబినెట్ ఇప్పటివరకు తక్షణ కాల్పుల విరమణ కోసం చేసిన అభ్యర్థనలను పట్టించుకోలేదు. యూదు రాజ్యం మంచి కోసం హమాస్ నుండి ముప్పును తటస్థం చేయాలని పట్టుబట్టారు. "మేము మా లక్ష్యాలను సాధిస్తాము - మేము హమాస్‌ను ఢీకొంటాము, మేము హిజ్బుల్లాను ఢీకొంటాము, మేము భద్రతను సాధిస్తాము" అని రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ గురువారం నాడు చెప్పాడు. ఇజ్రాయిలీ సైన్యం రాఫాపై దాడులను కొనసాగిస్తే అది వేలాది పౌరుల మరణాలకు దారితీస్తుంది. ఇప్పటికే గాజాపై ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడులలో 35 వేలమందికి పైగా పాలస్తీనా వాసులు మరణించారు.

చైనాను సందర్శించనున్న పుతిన్



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ వారం చివర్లో చైనాకు వెళ్లి చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌ను కలవనున్నట్టు క్రెమ్లిన్ ప్రకటించింది. రష్యా అధినేతకు తన కొత్త అధ్యక్ష పదవీ కాలంలో ఇదే మొదటి విదేశీ పర్యటన. చైనా అధినేత ఆహ్వానం మేరకు పుతిన్ చైనా పర్యటన మే 16, 17 తేదీలలో షెడ్యూల్ చేయబడిందని మంగళవారంనాడు ఒక ప్రకటనలో క్రెమ్లిన్ పేర్కొంది. శిఖరాగ్ర సమావేశంలో, ఇరువురు నాయకులు "సమగ్ర భాగస్వామ్యం, వ్యూహాత్మక అంశాలను సవివరంగా చర్చిస్తారు. ఈ చర్చలు రష్యన్-చైనీస్ సంబంధాల మరింత అభివద్ధికి కీలక దిశలను నిర్ణయిస్తాయి. పుతిన్, జిన్‌పింగ్ అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యల గురించి కూడా చర్చిస్తారని క్రెమ్లిన్ తెలిపింది. నాయకులు ఉమ్మడి ప్రకటన చేస్తారని, అనేక ద్వైపాక్షిక పత్రాలపై సంతకం చేస్తారని భావిస్తున్నారు. రష్యా నాయకుడు పుతిన్ చైనా ప్రీమియర్ లీ కియాంగ్‌తో కూడా చర్చలు జరుపుతాడు.

ఈ సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక, మానవతా సహకారంపై ప్రధానంగా చర్చించనున్నారు. అంతే కాకుండా పుతిన్, జిన్ పింగ్ మాస్కో, బీజింగ్ మధ్య దౌత్య సంబంధాల స్థాపన యొక్క 75వ వార్షికోత్సవం, అలాగే రష్యన్-చైనీస్ ఇయర్స్ ఆఫ్ కల్చర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన సభలకు హాజరవుతారు.

రష్యా అధ్యక్షుడు ఈశాన్య చైనాలోని హర్బిన్ నగరాన్ని కూడా సందర్శిస్తాడు. దీనిని 19వ శతాబ్దం చివరలో రష్యా నుంచి వచ్చి స్థిరపడినవారు స్థాపించారు. అక్కడ పుతిన్ మే 17 నుండి 21 వరకు జరిగే రష్యన్-చైనీస్ ఎక్స్ పో ప్రారంభ వేడుకలో పాల్గొంటాడు. పుతిన్ ఇంటర్ రీజినల్ కో ఆపరేషన్‌పై రష్యన్-చైనీస్ ఫోరమ్ ప్రారంభోత్సవాన్ని కూడా పర్యవేక్షిస్తాడు. ఆయన విద్యార్థులు, హర్బిన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్‌లతో కూడా సమావేశమవుతాడు.రష్యా, చైనా దేశాలు అనేక దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలను కొనసాగిం చాయి. "రెండు దేశాల మధ్య స్నేహానికి పరిమితులు లేవు, సహకారానికి 'నిషిద్ధ' ప్రాంతాలు లేవు అని ఫిబ్రవరి 2022 ప్రారంభంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో, బీజింగ్ కీవ్‌కు వ్యతిరేకంగా మాస్కో సైనిక చర్యను ఖండించలేదు. అందువల్ల రష్యాపై పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలలో చైనా చేరలేదు.అదే సమయంలో అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని విడిచిపెట్టి కాల్పుల విరమణకు పిలుపునిస్తూ ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించడానికి చైనా ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఈ చొరవను ప్రశంసించాడు. ఇది ఈ రకమైన అత్యంత స్పష్టమైన, వివరణాత్మక ప్రణాళిక అని లవ్రోవ్ పేర్కొన్నాడు.

డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌కు పీహెచ్‌డీ

నవతెలంగాణ - ధూల్ పేట్



పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ మీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నందు వైస్ చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ చేసిన డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ అరబీ భాషలో ఎంఏ పట్టా పొందారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి అరబీ భాషా విభాగపు అధిపతి ప్రొఫెసర్ మహజబీన్ అక్తర్ గారి పర్యవేక్షణ లో " అనలిటికల్ స్టడీ ఆఫ్ అనిమల్స్ మెన్షన్డ్ ఇన్ ది హెూలీ ఖురాన్ ఇన్ ద లైట్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్" అను అంశం పై పీహెచ్‌డీ పొందారు. పవిత్ర ఖురాన్ లో పేర్కొన్న వెటర్నరీ సైన్స్ ప్రాముఖ్యత, ప్రయోజనాలు ఉద్దేశాన్ని వివరిస్తూ ఒక పరిశోధనా పత్రాన్ని ఆయన ప్రచురించారు. ఇటువంటి అంశం పై భారతదేశం లోనే ఇది మొదటి ప్రచురణ గా వివరించినట్టు ఆయన పేర్కొన్నారు.



కాంగ్రెస్ మాజీ మంత్రి సీనియర్ నాయకుడు అంజన్ కుమార్ యాదవ్ సమక్షంలో మంగళవారం ఎర్రగడ్డకు చెందిన టీడీపీ సీనియర్ లీడర్ శివశంకర్ తన అనుచరులు దినకర్ సునీల్ కుమార్ చందు ఆరయ కాటిక ఇంకా కొంతమంది నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. అంజన్ కుమార్ యాదవ్ నాయకత్వంలో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు శివశంకర్ తెలిపారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్

స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు భద్రం





- నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్: హైదరాబాద్ పార్లమెంట్ ఆర్వో, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం మెషిన్లను డీఆర్ కేంద్రాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో సీల్ వేసి భద్రపరిచామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈవీఎం యంత్రాలను డీఆర్సీ కేంద్రాలలోని స్ట్రాంగ్ రూంలో నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ పీఐ శ్రీవిద్య సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేసి భద్రపరచామన్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు సీఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది రౌండ్ ది క్లాక్ నిరంతర పర్యవేక్షణ చేస్తారన్నారు. హైదరాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని చార్మినార్, యాకుత్ పూర, కోఠి మహిళా పీజీ, డిగ్రీ కళాశాలలోని గోషామహల్, అంబర్‌పేట జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో గల మలక్‌పేట, బండ్లగూడలోని ఆరోరా యూని వర్సిటీలో యూనివర్సిటీలో గల బహద్దూర్ పూర అసెంబ్లీ సెగ్మెంట్, నిజాం కళాశాలలోని చాంద్రాయణగుట్ట అసెంబ్లీ సెగ్మెంట్, మాసాబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో సీల్ వేసి పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ పీఐ శ్రీవిద్య, ఏఆర్వోలు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కులాల సమగ్ర లెక్కలను ప్రభుత్వానికి నివేదిస్తాం



- బీసీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ వకలాభరణం కృష్ణమోహన్

నవ తెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్ర బీసీ కులాల సమగ్ర లెక్కలను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదిక అందజేస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ వకలాభరణం కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం ఆధ్వర్యంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మెన్ మాట్లాడుతూ సగరులు తమ పిల్లలను బాగా చదివించాలని తద్వారా చైతన్యం పెరగడంతో పాటు ప్రశ్నించే తత్వం వస్తుందన్నారు. సగరులు రాజ్యాంగ ఫలాలను కూడా అనుభవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందు కోసం వివిధ పథకాలను అమలు తీరుపై ప్రభుత్వానికి బీసీ కమిషన్ తరపున సిఫారసు చేస్తామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాటాడుతూ బీసీల్లో 136 కులాలు ఉన్నాయని అందులో సగర కులం బాగా శ్రమించే కులమని అన్నారు. సగర కులాలను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలను, పార్లమెంట్ను, ప్రాజెక్టులను కట్టిన సగరులు అదే అసెంబ్లీలో, పార్లమెంట్లో లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తైనందున రానున్న స్థానిక ఎన్నికల్లోనైనా వారు ప్రాతినిధ్యం వహించాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన గోపాల్ సగర, చందు, లావణ్య, నరేందర్, బాలకష్టలను సేవా రత్న అవార్డులతో ఘనంగా సత్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు రవిసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర , నగర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్, రాష్ట్ర నాయకులు మారుతీ సాగర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సలహాదారులుగా కరుణా గోపాల్

నవతెలంగాణ-బంజారాహిల్స్



బీజేపీ నాయకురాలు, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షులు కరుణ గోపాల్ వర్తకవిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సలహాదారులుగా ఆహ్వానిం చినట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ), ఐఐటి ఢిల్లీ, ఐఐటి హైదరాబాద్, ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ (యూఎస్ఏ) వంటి విద్యా సంస్థల కన్సార్టియం ఆధ్వర్యంలో ఐఐటీ కాన్పూర్‌లోని సుస్థిర నగరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సలహాదారులుగా ఈ ఆహ్వానం అందిందని తెలిపారు.కరుణ గోపాల్ ను 14 దేశాలు తమ స్మార్ట్ డెవలప్‌మెంట్ ప్రయత్నాలను మెరుగుపరుచుకునేందుకు ఆమెను ఆహ్వానిం చాయి. ఆమె భారత్‌లో '100 స్మార్ట్ సిటీస్ మిషన్' రూపకల్పన అయిన ఇండియా టెక్నాలజీ రోడ్‌మ్యాప్ 2047కి సహకరించారు. సెయిల్,అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ వంటి పరిశ్రమల నాయకులు, ఈజీవోపీ ఫౌండేషన్, డబ్ల్యుఆర్ఐ ఇండియా వంటి థింక్ ట్యాంక్‌లు ఉన్నాయి.గతంలో ఆమె వరల్డ్ బ్యాంక్, డీఎఫ్ఐడీ (డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్, యూకే), యూఎస్ఏఐడీ (యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్), ఏడీబీ (ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్)లకు అర్బన్ ఎక్స్‌పర్ట్‌గా పనిచేశారు.



ఓటు హక్కును వినియోగించుకున్న వారికి ధన్యవాదాలు

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

ఓటు హక్కును వినియోగించుకున్న వారికి గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. గాంధీనగర్ డివిజన్ లోని కార్పొరేటర్ కార్యాలయంలో మంగళ వారం కార్పొరేటర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం మొదలైన రోజు నుంచి సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ గెలుపునకు కృషి చేస్తూ, రెయి పగలు ప్రచారంలో నిమగ్నమై, తమ వెంట ఉండి శ్రమించిన కార్యకర్తలకు,బూత్ కో ఆర్డినేటర్లకు,అధ్యక్షులు డివిజన్ నాయకులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ సారి మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతకు అలాగే ఓటు వేసిన వారికి కృతజ్ఞతలు తెలియచేశారు.



ఘనంగా బియ్యాని జ్ఞానేశ్వర్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర యూనివర్సిటీలకు , ఉద్యోగుల కోసం ఓయూ ఎన్జీవోస్ అధ్యక్షుడు రాష్ట్ర విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బియ్యాన్ని జ్ఞానేశ్వర్ సేవలు ఎనలేనివని పలువురు ఓయూ ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. బియ్యాన్ని జ్ఞానేశ్వర్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం రాత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఫంక్షన్ హాల్‌లో బోధనేతర ఉద్యోగులు, కాంట్రాక్ట్, టైం స్కేల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కేక్ కట్ చేసి జ్ఞానేశ్వర్‌కు పలువురు ఉద్యోగులు ఓయూ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ వారి హక్కుల కోసం వారి పక్షాన నిలబడి ఉద్యోగుల హక్కులను సాధించిన గొప్ప పోరాట స్ఫూర్తి గల నేత జ్ఞానేశ్వర్ అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఉద్యోగులు అటు ప్రభుత్వం నుంచి ఇటు విశ్వవిద్యాలయాల నుంచి రావాల్సిన ఉద్యోగ పరమైన ప్రయోజనాలు పొందారని ఆ విషయంలో ఆయన కృషిని సేవలను ఉద్యోగులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాలకు ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు సేవ చేయటం తన అదష్టంగా భావిస్తున్నట్టు జ్ఞానేశ్వర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల వికాసం కోసం ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమ కోసం, కాంటాక్ట్ , టైం స్కేల్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాటాల్లో ఉంటాయనిఅన్నారు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలియజేసిన వారికి జ్ఞానేశ్వర్ కృతజ్ఞతలు చెప్పారు.

సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలి



- రూ. 500 కోట్లు బడ్జెట్ కేటాయించి ప్రతీ సగర కుటుంబానికి రూ. 20 లక్షలు కేటాయించాలి
- సగర (ఉప్పర) హక్కుల పోరాట సమితి

నవతెలంగాణ - ముషీరాబాద్

సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలని, రూ. 500 కోట్లు బడ్జెట్ కేటాయించి ప్రతీ సగర కుటుంబానికి రూ. 20 లక్షలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళ వారం విద్యానగర్ బీసీ భవన్ లో భగీరథ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కష్ణయ్యసగర ఉప్పర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నీరడి భూపేష్ సాగర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 8 లక్షలకు పైగా సగరులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయంగా వెనకబడి ఉన్నారని తెలిపారు. కనీసం ఒక ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కూడా లేరని అందుకు సగరులను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపునకు మార్చాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్య రిజర్వేషన్ల పరంగా లభించి వారి అభ్యున్నతికి దోహదం పడుతుం దన్నారు. సగరులు సంచార జాతులుగా జీవనం సాగిస్తున్నారని, తమిళనాడు, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాలలో సగరులను ఎస్సీలుగా గుర్తిస్తున్నారని చెప్పారు. జమ్మూ పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, బీహార్, అస్సాం, కర్ణాటకలో సగరులను బి.సి-ఏ గ్రూపుగా పరిగణిస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో మాత్రమే బి.సి-డి గ్రూపుగా గుర్తిస్తున్నారన్నారు. కావున తగిన విచారణ చేసి గ్రూపు మార్పునకు దోహదం చేయాలని కోరారు. భగీరథ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పైన పెట్టాలని, జనాభా దామాషా ప్రకారం సగరులకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కష్ణ, నందగోపాల్, కోలా జనార్ధన్, జయంతి, తదితర నాయకులు పాల్గొన్నారు.

'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన



నవతెలంగాణ-అంబర్‌పేట

హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ యాజమాన్యం వరుసగా 10వ సంవత్సరం పరిపూర్ణమైన 100 శాతం ఫలితాలను సాధించినందుకు ప్రతీ ఒక్క విద్యార్థిని అపారమైన గర్వం, ఆనందంతో అభినందించింది. వైస్ చైర్‌పర్సన్ ప్రార్థనా మణికొండ అందించిన నిరంతర, ప్రణాళికాబద్ధమైన పునర్విమర్శ షెడ్యూల్‌లు, నిరంతర మార్గదర్శకత్వం, మద్దతు కారణంగా ఈ విజయం సాధ్యమైందని స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా అకడమిక్ ఎక్సలెన్స్ పట్ల అచంచలమైన నిబద్ధత, ఉపాధ్యాయుల అంకితభావం, పట్టుదలతో కలిసి ఈ అద్భుతమైన విజయాన్ని అందించినందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థుల విజయం వారి తోటివారికి ఒక ప్రజ్వల ప్రేరణకు ఉదాహరణగా ఉపయోగపడుతుంది. గొప్పతనం కోసం ప్రయత్నించడానికి మనందరికీ స్ఫూర్తినిస్తుంది. మరోసారి, విద్యార్థి అసాధారణ విజయానికి అభినందనలు తెలుపుతూ వారి భవిష్యత్ ప్రయత్నాలలో మరింత గొప్ప విజయాలు సాధించాలి. ఏడు గురు విద్యార్థులు ఏ-1 గ్రేడ్... వడ్లాని అనన్య (97శాతం), సయ్యద్ ఫహీద్ జంగ్ (96.5శాతం), చన్నా విశ్వేష్ రాజ్ (95.7శాతం), నిధి జైన్ (95.2శాతం), అద్వైత్ బాదామి (94.7శాతం), అన్ను శ్రీ సంజన (91.8శాతం), యశ్వంత్ కవిడిదేవి (91.7శాతం) స్కోర్ సాధించారని తెలియజేయడానికి సంతోషిస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. గరిష్ఠ విద్యార్థులు ఏ-2 గ్రేడ్‌లు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ప్రార్థన మణికొండ, డైరెక్టర్ ప్రభాకర్ తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ఓయూలో పిడమర్తి రవి పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మెన్, తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డా. పిడమర్తి రవి జన్మదిన వేడుకలు మంగళవారం మాదిగ విద్యార్థి జేఏసీ ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జ్ జోగు. గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో రవి త్యాగం చాలా గొప్పదన్నారు. ఆయన బహుజన ఉద్యమాలు చేసిన గొప్ప నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో తెక్నోడిట్ సంస్థల అధినేత వంగూరి. దామన్న ఓయూ జేఏసి కన్వీనర్ డా. వేల్పుకొండ వెంకటేష్, బీసీ శక్తి రాష్ట్ర ప్రెసిడెంట్ వెంకట్ గౌడ్. చాగంటి, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్, నక్క మహేష్, అంజయ్య, రేవంత్, లవంగి రాజు, సాయి, సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పట్టించుకోండి..

- వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..
- జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ బాలసుబ్రమణ్యం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17వేల మంది ఎన్‌హెచ్ఎంలో ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు సమయానికి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కోఠి లో ఆయన మాట్లా డుతూ ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు పి.ఆర్.సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వేతనాలు రాక ఈ.ఎం.ఐ , కరెంట్ బిల్లులు,ఇంటి కిరాయిలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తమ సమస్య ను తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఉద్యోగుల కుటుంబాల పట్ల మానవతా హృదయంతో ప్రభుత్వం స్పం దించి తక్షణమే జీతభత్యాలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను ప్రతి నెలా 1వ తేదీ లోపు విడుదల చేస్తు ఎన్. హెచ్. ఎం. ఉద్యోగుల వేతనాలు పక్కన పెట్టడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

స్టార్టప్‌ల కోసం గ్లోబల్ బిజినెస్ యాక్సిలరేటర్'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వినియోగదారుల ఉత్పత్తుల రంగంలో స్టార్టప్‌ల కోసం గ్లోబల్ బిజినెస్ యాక్సిలరేటర్ అయిన ప్రొపెల్ 4వ సీజన్‌ను ప్రారంభించినట్టు అమెజాన్ ఇండియా మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించింది.అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్‌లు, స్టార్టప్‌లు ఈ-కామర్స్ ఎగుమతులను ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా కస్టమర్లను చేరుకోవడానికి పూర్తి స్థాయి మద్దతును అందించడానికి తీర్చిదిద్దబడిన వినూత్నమైన ప్రోగ్రామ్ ఇది. ప్రొపెల్ ఎస్4 అంతర్జాతీయ మార్కెట్‌లలో 50 స్టార్టప్‌ల ప్రారంభానికి మద్దతు ఇస్తుంది. భారతదేశం నుండి గ్లోబల్ బ్రాండ్‌లను సష్టించనుంది. దీనిలో పాల్గొనే స్టార్టప్‌లు ఏడబ్ల్యూఎస్ యాక్టివేట్ క్రెడిట్‌లు, ఆరు నెలల ఉచిత లాజిస్టిక్స్, అకౌంట్ మేనేజ్మెంట్ సపోర్ట్, అలాగే టాప్ 3 విజేతల కోసం అమెజాన్ నుండి 100 కే గ్రాంట్‌తో సహా 1.5 మిలియన్లకు పైగా విలువైన మొత్తం రివార్డ్‌లను గెలుచుకుం టాయి. పాల్గొనే స్టార్టప్‌లు భారతీయ ఆదాయ ఆధారిత ఫైనాన్సింగ్ సంస్థలైన క్లబ్, వెలాసిటీ, గెట్ వాన్టేజ్‌లతో కనెక్ట్ అవ్వడానికి అమెజాన్ సహాయం చేస్తుంది. ఇవి పాల్గొనే స్టార్టప్‌లకు తమ వ్యాపారాన్ని విస్తత స్థాయిలో విస్తరించడానికి క్యూరేటెడ్ ఆఫర్‌లను అందిస్తాయి.ప్రోగ్రామ్ కోసం అప్లికేషన్లు నేటి నుంచి తెరుస్తారు. జూన్ 9, 2024న ముగుస్తాయి. ఇది డెమో-డేతో ముగుస్తుంది.దీనిలో పాల్గొనే వారు తమ వ్యాపార ప్రతిపాదనలను ప్రముఖ వీసీ సంస్థలకు అందించడానికి, వారి కార్యకలా పాలను విస్తరించడానికి నిధులను పొందే అవకాశాన్ని పొందుతారు.ప్రొపెల్ ఎస్4లో భాగంగా, అమెజాన్ లీడర్‌లు, వీసీ భాగస్వాములు, సీనియర్ ఇండస్ట్రీ లీడర్‌లతో కూడిన మెంటార్‌షిప్ బోర్డును అమెజాన్ ఏర్పాటు చేసింది. వారు అభివద్ధి చెందుతున్న బ్రాండ్‌లతో కలిసి పని చేయటంతో పాటుగా వారికి తగిన వనరులు 1:1 మెంటార్‌షిప్, వర్క్‌షాప్‌లను గ్లోబల్డ్ మాండ్ ప్యాటర్న్‌లు, ఈ-కామర్స్ ద్వారా విజయవంతమైన ఎగుమతుల వ్యాపారం నిర్మాణంపై తగిన పరిజ్ఞానం అందిస్తారు.పాల్గొనే స్టార్టప్‌ల నెట్‌వర్క్‌కు సహాయం చేయడానికి, ప్రస్తుత పర్యావరణ వ్యవస్థ నుండి నేర్చుకోవడానికి అనుభవజ్ఞులైన వ్యవస్థాపకులను, ప్రొపెల్ పూర్వ విద్యార్థు లను ఆహ్వానించడం ద్వారా పీర్ లెర్నింగ్‌పై దృష్టి సారించే సెషన్‌లను అమెజాన్ నిర్వహిస్తుంది.



శ్రీ భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని ఫిల్మ్ నగర్ చౌరస్తాలోకార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శ్రీ భగీరథ మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ర్యాండంగా పత్రాల స్క్రూటినీ

- జిల్లా ఆర్వో, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా వినియోగించిన డాక్యుమెంట్లు సరిగా నింపారో.. లేదో.. మాల్ ప్రాక్టీస్ జరగలేదని నిర్ధారించుకోవడానికి డాక్యుమెంట్లను స్క్రూటీని చేశామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలనెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల లో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులు, ఏఆర్వోల సమక్షంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలలో 5 పోలింగ్ కేంద్రాలను ర్యాండంగా స్క్రూటీని చేశామన్నారు. హైదరా బాద్ నియోజకవర్గంలోని యాకుత్ పూర అసెంబ్లీ సెగ్మెం ట్‌లో ర్యాండంగా 9,305,44,130,270 పోలింగ్ కేంద్రా లను, చార్మినార్ సెగ్మెంట్‌లో 8,81,22,27,131 పోలింగ్ కేంద్రాలను మలక్‌పేట్ సెగ్మెంట్ లో 261,68,64, 234,300, బహద్దూర్‌పూర అసెంబ్లీలోని 166,97,203, 199,75 పోలింగ్ కేంద్రాలు, చాంద్రాయణగుట్టని 136,199,88,40,210 పోలింగ్ కేంద్రాలు, గోషామహల్ సెగ్మెంట్‌లోని 22,26,129,151,214 పోలింగ్ కేంద్రాలు, కార్వాన్‌లోని 287,302,270,136,301 పోలింగ్ కేంద్రాలను ర్యాండంగా 17సీ,17ఏ, పీవో డైరీ, విజిట్ షీట్, బుక్ లెట్‌లను పరిశీలించి అన్ని సరిగానే ఉన్న నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జనరల్ ఆబ్జెర్వర్ పీఐ శ్రీవిద్య, పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్వో, వెంకట చారి, మహిపాల్ రెడ్డి , టి. వెంకన్న, జ్యోతి, విక్టర్, రవి ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్ HMDA
బుధవారం | మే 15, 2024 | www.navatelangana.com

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంల తరలింపు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి-07 పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి చెందిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా హెూలీ మేరీ కాలేజీ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, వెస్లీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు మల్కాజిగిరి నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంక శుక్లా సమక్షంలో తరలించి సీల్ వేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ హెూలీ మేరీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో, ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఈవీఎంలను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఈవీఎంలను వెస్లీ కళాశాలతో ఉంచి సీల్ వేసి మూడంచెల పటిష్ట



స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత

- ఈవీఎం యంత్రాలను సీల్ చేసి 15 డీఆర్ కేంద్రాలకు తరలింపు
- అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా ఈవీఎం యంత్రాలు
- పోలింగ్ సరళిపై ఓటర్లు, నాయకుల ఆరా



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో సార్వత్రిక ఎన్నికల పోరు సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. దాదాపు నెల రోజులుగా హెూరాహెూరీగా కొనసాగిన ప్రచారం సోమవారం ముగియడంతో అంతా పోలింగ్ సరళిపై దృష్టి సారించారు. రాజకీయ నాయకులు, నగరవాసులు, అభ్యర్థులు, వారి అనుచరులు, ఎలాగైనా తమ పార్టీ అభ్యర్థినే విజయం సాధిస్తారని ధీమాలో ఉన్నారు. అయితే విజేత ఎవరో తేలాలంటే వచ్చే నెల 4వ తేదీ వరకు నిరీక్షించాల్సిందే. అప్పటి వరకు అన్ని పార్టీ నాయకుల్లో ఉత్కంఠ తప్పదు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం

హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం యంత్రాలను ఎన్నికల ఏజెంట్లు, అధికారుల సమక్షంలో (బ్యాలెట్ బాక్స్‌లను) సీల్ చేశారు. అనంతరం ఈవీఎం మెషిన్లను ఆయా ప్రాంతాలల్లో ఏర్పాటు చేసిన 15 డీఆర్ కేంద్రాలకు తరలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితోపాటు నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ సమక్షంలో ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్, సివిల్, స్థానిక పోలీస్ సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. రౌండ్ ది క్లాక్ నిరంతర పర్యవేక్షణ ఉంచారు. స్ట్రాంగ్ రూమ్‌ల వైపు ఎవరిని అనుమతించరు.

అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా...

హైదరాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చార్మినార్, యాకుత్‌పూర, కోఠి మహిళా పీజీ, డిగ్రీ కళాశాలలో గోషామహల్, అంబర్ పేట, జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో మలక్‌పేట, బండ్లగూడలోని ఆరోరా యూనివర్సిటీలో బహద్దూర్ పూర అసెంబ్లీ సెగ్మెంట్, నిజాం కళాశాలలో చంద్రయాన్ గుట్ట, అసెంబ్లీ సెగ్మెంట్, మాసాబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కార్వాన్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎం యంత్రాలను భద్రపరిచారు.

సికింద్రాబాద్...

ఇక సికింద్రాబాద్ లోకసభ నియోజకర్గ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఈవీఎంలను భద్రపరిచారు. మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ ఏయూలో నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ ఈవీఎంలను భద్రపరిచారు. దోమలగూడలోని ఏవీ కాలేజీలో ముషీరాబాద్, నారాయణగూడలోని రెడ్డికాలేజీలో అంబర్‌పేట్ నియోజకవర్గానికి సంభందించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఓయూలో సనత్‌నగర్, ప్రొఫెసర్ జీ.రామ్‌రెడ్డి సెంటర్‌ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (ఓయూ)లో సికింద్రాబాద్ నియోజక వర్గం ఈవీఎంల ను భద్రపరిచారు. సికింద్రాబాద్ వెస్లీ కాలేజీలో సికింద్రాబాద్ కంటోన్మెంట్, మల్కాజ్‌గిరిలకు సంబంధించి ఈవీఎంలను, యూసుఫ్ గూడాలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్‌కు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు.

నారాయణఖేడ్ ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. రాజారావు, ఎ.శ్యామ్ సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీవో, ఏపీవోలకు రోజుకు రూ. 600, ఓపీవోలకు రూ.400 రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 61 ని ఈ నెల 11న విడుదల చేసిందని తెలిపారు. సదరు ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సా పూర్, సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు రూ.3150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో 2400 మాత్రమే ఇచ్చారన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందు కని ప్రశ్నించినందుకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యా యులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని చెప్పారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గీతాంజలి హైస్కూల్ ప్రభంజనం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

పదో తరగతి ఫలితాల్లో గీతాంజలి హైస్కూల్ గత 42 ఏండ్లుగా అకాడమిక్ రికార్డ్ సృష్టిస్తూ వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో ప్రభంజనం సృష్టిస్తున్నదని స్కూల్ కరస్పాండెంట్, మేనేజ్మెంట్ ఒక ప్రకటనలో పేర్కొంది. పదవ తరగతి 2023-24 అకాడమిక్ ఇయర్‌లో మొదటి స్థానంలో మోక్షిత 9.7/10, శ్రేయస్ 9.5/10, రెండవ స్థానంలో ప్రణీత్ 9.3/10, సంకేష్ 9.2/10, తారక్ 9.0/10, మూడో స్థానంలో గాయత్రి 9.0/10, సాహితి 9.0/10, వి.దీక్షిత 8.7/10, రాహుల్ 8.7/10, సిద్ధూ 8.5/10, కీర్తిక 8.5/10 జీపీఏతో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధిం చి పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకార ణంగా నిలిచారు. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధనే కాకుండా తెలుగు సంస్కృతిని కాపాడేందుకు ముఖ్య మైన పర్వదినాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ కార్యక్ర మాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం నింపుతుంటారు.అలాగే సమ్మర్ క్రీడలు, విహార యాత్రలకు విద్యార్థులను తీసుకుపోతూ మనో వికాసాన్ని పెంపొందిస్తున్నారు.క్రమశిక్షణకు మారుపేరుగా సాంస్కృతిక వేదికైనా గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు గత 42 ఏండ్లుగా ప్రభంజనం సృష్టిస్తూ వస్తున్నదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయుల బృందం క్రమశిక్షణకు మారుపేరుగా కరస్పాండెంట్, మేనేజ్మెంట్ పని చేస్తుండటమే కారణం అని పేర్కొంది.



ఘనంగా అష్టలక్ష్మి దేవాలయం బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయ 28వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్ కుమార్, సుధాకర్, దామోదర్, బ్రహ్మోత్సవాల కమిటీ కన్వీనర్ రవీంద్ర కుమార్, అడ్వైజర్ అరుణ్ కుమార్, స్పెషల్ ఇన్వైట్ చిలుక ఉపేందర్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఫామ్-17 ఏ అండ్ ఎలక్షన్' స్క్రూట్నీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



మల్కాజిగిరి-7 పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికలకు సంబంధించిన ఫామ్-17 ఏ అండ్ ఎలక్షన్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా, జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెండ్ల సమక్షంలో స్క్రూట్నీ చేసినట్టు జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు.

ఆహారనాళంలో ఇరుక్కుపోయిన మటన్ ఎముక..!



- వృద్ధుడికి నెల రోజులుగా తీవ్ర సమస్య
- గుండెకు సమీపంలో ఆహార నాళానికి రంధ్రం
- ఎండోస్కొపీ ప్రొసీజర్‌తో తీసేసిన కామినేని వైద్యులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు సుమారు నెల రోజుల క్రితం ఓ పెండ్లిలో మటన్ తింటూ, పండ్లు లేకపోవడంతో పొరపాటున ఓ ఎముక మింగేశారు. ఆహారనాళంలో ఇరుక్కుపోయిన ఆ ఎముక.. లోపల రంధ్రం చేసి, తీవ్ర ఇన్ఫెక్షన్‌కు కారణమైంది. ఎదభాగం మధ్యలో తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న ఆ వద్ధుడు.. ఎట్టకేలకు ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్‌కు వచ్చారు. తొలుత నార్కట్‌పల్లిలోని కామినేనికి వెళ్లగా అక్కడ ఎండోస్కొపీ చేసి ఎముక ఉందన్న విషయాన్ని గుర్తించి, ఎల్బీనగర్ ఆస్పత్రికి పంపారు. ఇక్కడ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాధిక నిట్టల నేతృత్వంలోని వైద్యబృందం ఆయనను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన పరీక్షలు చేసి శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎండోస్కొపిక్ ప్రొసీజర్‌తోనే ఎముకను అత్యంత జాగ్రత్తగా బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డాక్టర్ రాధిక వివరించారు.

"66 ఏండ్ల శ్రీరాములుకు దవడ పండ్లు లేకపోవడంతో మటన్ ముక్కను నమలకుండా నేరుగా మింగేశారు. దీంతో దాదాపు 3.5 సెంటీమీటర్ల పొడవున్న ఎముక ముక్క కూడా లోపలకు వెళ్లింది. ఈ విషయం మొదటి తెలియకపోయినా.. రెండు మూడు రోజుల తర్వాత ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక వైద్యులకు చూపిస్తే అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీసి గ్యాస్ట్రిక్ ట్రబుల్ అనుకుని మందులు ఇచ్చారు. కానీ నొప్పి తగ్గకపోవడంతో కామినేని హాస్పిటల్‌కు వచ్చారు. నెల రోజులుగా ఆ ముక్క ఇరుక్కుపోవడం వల్ల ఆహారనాళానికి రంధ్రం చేసింది. ఆ ప్రాంతంలో ఇన్ఫెక్షన్ ఏర్పడి, పుండ్లు కూడా పడ్డాయి. కొంత చీము చేరింది. ఇదంతా గుండెకు బాగా దగ్గరగా ఉంది. దీన్ని అత్యంత జాగ్రత్తగా ఎండోస్కొపీ ప్రొసీజర్‌లోనే తొలగించాం. లేనిపక్షంలో అక్కడ పెర్ఫొరేషన్ లాంటి మరిన్ని సమస్యలు వచ్చేవి" అని తెలిపారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ - చైతన్యపురి



ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు, చిత్ర లే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా మంగళవారం చిత్ర లే అవుట్ ఆర్చ్ వద్ద మజ్జిగ పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ 47వ వివాహ వారికోత్సవం సందర్భంగా ఔషధీయ మజ్జిగను పంపిణీ చేసినట్టు తెలిపారు. వేసవి తాపం నుండి పాదచారులకు కొంత ఉపశమనం కలిగించడం కోసం చల్లటి మజ్జిగను పంపిణీ చేసినట్టు చెప్పారు. జాగృతి అభ్యుదయ సంఘం, మొదటి ముద్ద వారి సహకారంతో కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. చిత్ర లే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, బీజేపీ నాయకులు శేఖర్ రావు, కుసుమ, రామకృష్ణ , కిశోర్ రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

NOTICE

This is Certify that our client M/s S V Storage & Logistics a partnership firm registered with the Registrar of Firms and Registrar firm of Hyderabad-South, vide a registered partnership deed Dated 12th June 2020 with S.No: 977 of 2020. Here by who are having any transactions with above said firm now and in further they should contact my clients/Partners Shri. Panjugula Anjaneyulu & Shri . Pathuri Harikishan Goud & Shri Pathuri Ashok Kumar & Pathuri Akhilesh Goud ,Address at H.No.17-1- 383/27, Vinay Nagar Colony, Saidabad, Hyderabad-500 059,Telangana,India. The general public is hereby informed that M/s. S V Storage & Logistics is a partnership firm was dissolution on 9th May'2024, due to retirement /expulsion of the partners.

MOHAMMED HAMEED KHAN
B.A.,B.ED.,LLB. Advocate & Notary Public
Address Door No.1-8-495/19/C, Vigar Nagar, Near Prakash Nagar, Begumpet, Sec-bad- 03.T,S Mobile No.9391025702

PASSPORT MISSING

General Public that my client **Kailash Smrithika Yadav, D/o. Sanjay Kumar Yadav Kailash**, W/o.Abhishek, R/o. H.No.5-1-1048, Gowliguda, RamMandir, Hyderabad, T.S. has lost her Original passport bearing **No.P3052242** issued by Passport Authority. Hyderabad, Telangana, Therefore the General Public is hereby informed and requested if any person found the said Original passport, please contact the undersigned and not misuse the same., **Cell: 9246104990**

NOTICE

This is Certify that our client M/s SANTOSHI MATA HP GAS ENTERPRISES a partnership firm registered with the Registrar of Firms, Registrar firm of Ranga reddy, vide a registered partnership deed Dated 29th June 2016 with S.No: 2498 of 2016. Here by who are having any transactions with above said firm now and in fuither they should contact my clients/Partenrs Smt.Pathuri Aishwarya & Shri.Pathuri Ashok Kumar ,Address at H No. 44-30, Plot No. 82,Survey No. 326, Beerappa Nagar, Jagadgiri Gutta, Quthubullapur-Village& Mandal & GHMC Circle, Ranga reddy -500 037.The general public is hereby informed that M/s SANTOSHI MATA HP GAS ENTERPRISES is a partnership firm was dissolution on 9th May '2024, due to retirement l expulsion of the partners.

MOHAMMED HAMEED KHAN
B.A.,B.ED.,LLB. Advocate & Notary Public
Address Door No.1-8-495/19/C, Vigar Nagar, Near Prakash Nagar, Begumpet, Sec-bad- 03.T,S Mobile No.9391025702

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టు, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
ఐ.ఎ. నెం. 93 ఆఫ్ 2023 ఇన్
ఒ.యస్. నెం. 5 ఆఫ్ 2013

బిట్వీన్ :
బి. శ్రీవాణి మరియు ఇతరులు
...... పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్
మరియు
సుంకర ఉమా శంకర్‌రావు మరియు ఇతరులు
.... రెస్పాండెంట్స్/ డెపెండెంట్స్

టు,
1) జి. జయశాలిని, తండ్రి : ప్రసాదరావు, వయస్సు : 37 సం.లు, నివాసం : సింగరేణి కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ (ఆర్5)
2) జి. జయశ్రీనాథ్, తండ్రి : ప్రసాదరావు,వయస్సు : 42 సం.లు, నివాసం : గ్రీన్ హిల్స్ కాలనీ, ఆర్‌కెపురం, సరూర్ మండలం, రంగారెడ్డి జిల్లా (ఆర్6)

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పైన కేసులో ఫైనల్ డిక్రీ కొరకు పైన ఉదహరించిన పిటీషనర్స్ పిటిషను వేసినారు. అట్టి పిటిషన్‌లో మీ ఇరువురు కోర్టు నోటీసులు పంపినప్పటికీ తీసుకొనకుండా తిప్పి పంపుతున్నారు. కావున మీ హాజరు నిమిత్తం పైన ఉదహరించిన కేసును ది. 06.06.2024కు వాయిదా వేసినారు. కావున మీరు పైన ఉదహరించిన కోర్టులో ది. 06.06.2024న ఉ.గం. 10.30 ని॥లకు హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//

కొత్తగూడెం
ది.14.05.2024

ఎస్. రమణారెడ్డి
న్యాయవాది, కొత్తగూడెం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDL JUNIOR CIVIL JUDGE SRIKAKULAM (EXCISE & PROHIBITION COURT) SRIKAKULAM.
OS 32/2017

Between: **Boyina (Kumarmana) Padmaja** ...Plaintiff
And: **Boyina Domadara Rao & Others** ...Defendants

To,
Baratam Anusha, C/o B. Damodara Rao, Manjil Galaxy appartments, Flat No. 307, Uppal Junction, Hyderabad, Telanga State.

పై నెంబరు దావాలో వాది OS32/2017 Srikakulam 3rd Addl Junir civil judge at srikakulam కోర్టులో దావా దాఖలు చేయగా మీకు ఎన్ని సార్లు కోర్టు వారు అరర్ మేరకు సమన్లు పంపించిన మీరు పుచ్చుకోకుండా జాప్యం చేసినందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కావున **తేది 16-05-2024న ఉ॥ 10-30 గం॥ లకు** పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరుచు కొనవలెను. లేని యెడల మీ పరోక్షం గా తీర్మానించడమగునని ఇందు ములముగ తెలియ పరచడమైనది.

// శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ మేరకు //
పి. రామాంజనేయులు, తంగి రామారావు
న్యాయవాదులు,
శ్రీకాకుళం,సెల్ నెంబర్: 9247382164.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-XI ADDITIONAL METROPOLITAN MAGISTRATE R.R.DIST. AT: RAJENDRA NAGAR
O.S.NO.168 of 2024

Between:
1.Smt.Praveena Sonkamble @ Philkhana Venkata Lakshmi Praveena, W/o Jiten Sonkamble, Aged abut 34 yrs, Occ: Private Employee
2.Baby Saanvi Sonkamble, D/o Jiten Sonkamble, Aged about 6 years, Occ: Student,
3.Baby Shloka Sonkamble, D/o Jiten Sonkamble, Aged about 1yer, Occ: Nil, Plaintiffs No.2 and 3 being Minors, represented by their Natural mother andguardian. All are R/o Plot No.14, Mallikharjuna Nagar,, Bandlaguda Jagir, Rajendranagar, Hyderabad, Ranga Reddy District-500 086 ...Plaintiffs
And
The Tahsildar Rajendranagar & another ...Defendants

To
All Concerned
Please take notice that the above named Plaintiffs had filed a suit to declare them as Legal Heirs of Late Late Jiten Sonkamble, S/o Madhukar Sonkamble. The Honourable Court was pleased to order publication of this notice for your appearance in the above suit and the matter is posted **to 07-06-2024**, therefore, any person/s having objections may appear before the above named court **at 10.30 am** on the said date either in person or through an Advocate, failing which the matter will be heard exparte and orders will be passed on merits. Hence this notice.

//BY THE ORDER OF THE COURT//
GOTURU KRISHNA RAO
M.A.S.NARASIMHA RAO
SRIPAL REDDY
Advocates
Plot No. 297, Road No.11, Vasavi Colony, SRK Puram HYDERABAD-500 102
Ph:9948316457 & 9849425094

IN THE COURT OF THE HON'BLE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MEDCHALMALKAJGIRI DISTRICT AT: KUSHAIGUDA
O.S.No.492 of 2024.

Between:-
1.Sri Gadde Joel Hamilton S/o Late Gadde John Hamilton,
2.Sri Gadde Joshua Hamilton S/o. Late Gadde John Hamilton ...Plaintiffs
AND
1.The Tashildar of Malkajgiri Madal, Neeredmet X Roads, Medchal- Malkajgiri District, Telangana State.
2. All concerned ...Defendants

To
All Concerned

PUBLIC NOTICE

General public are hereby informed that my clients Sri Gadde Joel Hamilton S/o Late Gadde John Hamilton, aged about 47 years, Occ:Business; R/o.Flat No. 201,Raindrops Apartments, Road Number12, Vivekanandapuram, Sainikpuri, Hyderabad, and Sri Gadde Joshua Hamilton S/o.Late Gadde John Hamilton,aged about 44 years, Occ: Business, Flat No. 301, Block-C, Sri Shivasai Residency, Behind Temple Tree Apartment, Sri Ram Nagar Colony, Kondapur, K.V.Rangareddy, Telangana, filed the above suit on the file of the Hon'ble IInd Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri District at Kushaiguda, for declaring the plaintiffs are the only legal heirs of deceased Late Gadde John Hamilton, S/o Late G.S.John and Late Leela Grace Hamilton W/o Late Gadde John Hamilton. for legal status.
Therefore, if any person(s) has/have any objection of any sort for granting of the legal status in favour of the above said plaintiffs in respect of deceased Late Gadde John Hamilton, S/o Late G.S.John and Late Leela Grace Hamilton W/o Late Gadde John Hamilton, such person(s) may appear either in person or through an Advocate **on 10-06-2024 at 10.30 AM** in the proceedings in O.S.No.492 of 2024 before the Hon'ble IInd Addl. Junior Civil Judge, Medchal-Malkajgiri District at Kushaiguda, and raise their objections if any.

(BY ORDER OF THE HON'BLE COURT)
A.SAIBABA
ADVOCATE
Office/ Res : H.No.8-3-301, Second Bazar, Secunderabad,-500 003 Ph :+91-98491 94468.

IN THE COURT OF THE HON'BLE II Addl JUNIOR CIVIL JUDGE CUM X ADDL. METROPOLITAN MAGISTRATE RANGA REDDY AT:KUKATPALLY
O.S.NO: 955 OF 2022

BETWEEN:
Maddi Swathi and 2 Others ...Plaintiffs
AND
The Thashildar, Sherilingampally Mandal and All Concerned ...Defendants

TO,
To whomsoever it may concern/ Public at large,
Please take notice that the above suit is filed seeking to declare the Plaintiffs viz., 1.Maddi Swathi,w/o Late Kishore Kumar 2.Kumari Maddi Hasini, and 3.Maddi Umadevi, as the legal heirs of Kishore Kumar, s/o late Krishna Rao who died on 19/08/2020. The above suit stands posted to 10/06/2024 for receiving objections, if any from any interested party.
Therefore you are hereby required to appear before the Hon'ble II Addl Junior civil Judge cum X AMM, Ranga Reddy District at Kukatpally, **on 10/06/2024 at 10.30 AM,** either in person or through your Advocate and file objections/ written statement/ counter if any failing which the matter will be decided in your absence.

(By the order of the court)
P.V.SIVA KUMAR
AND Associates
Advocates
Flat no.104, Sai Residency, Near Madinaguda Elect sub-station, Madinaguda, Miyapur, Hyderabad-500049. Telangana. Ph:9441070455.

BEFORE THE HON'BLE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, RANGA REDDY DISTRICT AT: L.B Nagar
C.C.No.324 OF 2023

BETWEEN :
A.Ram Kiran Tejomurthulu, S/o. Subrahmanyam Tejomurthulu, aged about 44 yrs, Occ: Pvt Employee, R/o.Flat No.303, Saikota Sunshine, HMT Suvarna Valley, RTC Colony, Miyapur, Ameenpur, Medak. ...COMPLAINANT
AND
MATIC INTERIORS,
Plot No.35, Lane 21, A1block, 9-A 1/S35, Shop No.35, 5 TH phase, Janapriya Apartments, Miyapur, Hyderabad, Medchal Malkajgiri, Telangana, 500049 Phone No. 9577628888.Rep.by its Manager ...OPPOSITE PARTY

Please take notice that the above-mentioned case is filed against you by my client Mr.A.Ram Kiran Tejomurthulu in the court of the Hon'ble Consumer Dispute Redressal Commission, Ranga Reddy District, at L.B Nagar has ordered submitted service of notice to you through the publication of notice in Nava Telangana (Miyapur, Medchal-Malkajgiri District), Newspaper for your appearance before this Hon'ble Commission. Therefore, the same is hereby published hence take notice.
As per the order by the Hon'ble Commission, you have to attend the said Hon'ble Commission **on 04/06/2024 at 10:30 A.M** either by person or through an authorized advocate and answer the claim of the complainant, in the above case without fail to protect your interest.

(BY ORDER OF THE COURT)
Sd/-
B.SHASHI KANTH,
N.JAGDISH PATEL YADAV
ADVOCATES
Flat No.308, #3 rd Floor, My Home Lakshmi Nivas, Opp: Green Park Hotel, Metro Pillar No.C1427, Ameerpet, HYD-500016, Ph No.9642612345, 9603257777.

IN THE COURT OF THE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD.
O.S.NO.2098 OF 2024

Between:-
1.Smt.Andhi Sudha, W/o.Late Andhi Sadanand, Aged about 50 yrs, Occ:House wife
2.Mr.Andhi Nikhilesh, S/o.Late Andhi Sadanand, Aged about 28yrs, Occ: Clinical Research Coordinator
3.Mr.Andhi Vinay, S/o.Late Andhi Sadanand, Aged about 26 yrs, Occ: Advocate
4.Ms.Andhi Swetha, D/o.Late Andhi Sadanand, Aged about 22yrs, Occ: Private Employee
(Above All are Residents of H.No. 3-5-429, Vittalwadi, Narayanguda, Hyderabad – 500029) ...Plaintiffs.
AND
1.The Tahasildar, Himayatnagar Mandal Revenue Office, Bagh Lingampally, Hyderabad, TS.
2. All concerned. ...Defendants

To:
All concerned. ...Defendant No.2

The above-named plaintiffs had filed the above suit O.S.No.2098 of 2024 on the file of the Hon'ble X Junior Civil Judge, City Civil Court, at: Hyderabad, for declaration to declare that the plaintiffs and Defendant No.1 are the legal heirs of Late Andhi Sadanand and for other reliefs. The said suit O.S. No.2098 of 2024 is posted **to 18-07-2024** for the objections if any from the objectors, before the said Hon'ble Court either in person or through an Advocate **at 10-30 A.M.** failing which the matter will be decided ex-parte.

(By order of the Court)
M/S. S & T LAW ASSOCIATES
P.S. TEJAS
B.SAMYUKTHA
ADVOCATES FOR PLAINTIFFS
(O): M. No. 4-2-611/6, Mahakali Temple Lane, Ramkoti, Hyderabad, Cell: 8885264330

BEFORE THE M.A.C.T (HON'BLE I ADDL. DIST. JUDGE) At NIZAMABAD
O.P.NO 383/2023

Between:
Radha Kishan Rao. Petitioner
And
Ola Fleet Technologies Private Limited Company and Another Respondents

To (**R1** and **R2**)
Ola Fleet Technologies Private Limited Company, D.NO.9-2-233 to 239/1&2, Rezimental Bazar, Secunderabad (Owner of CAR)
Merugu Surender, S/o Merugu Yadagiri, Age: 36 yrs, Occ: Private Job, R/o: H.No: 3-5-305, Kotagally, Nizamabad. (Driver of CAR)
Whereas the above-named petitioner has filed the above case for grant of compensation on account of injury in motor vehicle accident, several times notices sent to you returned unserved.
Take notice that the above case is posted on **21-5-2024 at 10.30 A.M** for your appearance.You are hereby required to appear either in person or through a pleader, before the above said court on the aforesaid date and time, failing which the matter will be decided in your absence.

//By order of the Court//
G.V. KRUPAKAR REDDY
N. Nishanth, Advocates.
"SRI NILAYAM
"5-9-64. Road No.1.
Yellammagutta, NIZAMABAD.
Cell:-9849333644

BEFORE THE M.A.C.T. (HON'BLE I ADDL, DIST. JUDGE) At NIZAMABAD
O.P.No 382/2023

Between:
Aparna Petitioner
And
Ola Fleet Technologies Private Limited Company and Another Respondent

To(**R1** and **R2**)
Ola Fleet Technologies Private Limited Company, D.NO.9-2-233 to 239/1&2, Rezimental Bazar, Secunderabad. (Owner of CAR)
Merugu Surender, S/o Merugu Yadagiri, Age 36 yrs, Occ. Private Job, R/o: H.No: 3-5-305, Kotagally, Nizamabad. (Driver of CAR)
Whereas the above-named petitioner has filed the above case for grant of compensation on account of injury in motor vehicle accident, several times notices sent to you returned un served.
Take notice that the above case is posted on **10-6-2024 at 10.30 A.M** for your appearance You are hereby required to appear either in person or through a pleader, before the above said court on the aforesaid date and time, failing which the matter will be decided in your absence.

//By order of the Court//
G.V. KRUPAKAR REDDY
N.Nishanth, Advocates.
"SRI NILAYAM
"5-9-64. Road No.1.
Yellammagutta, NIZAMABAD.
Cell:-9849333644

IN THE COURT OF THE HON'BLE VI ADDL. JUNIOR CIVIL JUDGE, R.R.DISTRICT AT: L.B.NAGAR
O.S.No.1076 Of 2019

Between:
Smt. Kasturi & 5 others ...Plaintiffs
Vs
Sri Bhupathi Raju Varha Narsimha Raju & others ...Defendants

To,
Sri Bhupathi Raju Varha Narsimha Raju, S/o.Late Anjanaya Raju, aged 66 yrs, Occ: Business, R/o.H.No.G-9, B-Block, Emerald Amrutha Hills, Punjagutta,Hyderabad-500082.

NOTICE
SUIT SUMMONS THROUGH PUBLICATION

Please take notice that, the above suit was filed by the plaintiff for Perpetual Injunction against you being arrayed as Defendant No. 1. Whereas on several occasions notices sent through process of court, could not served on you, due to which reason on the orders of the Hon'ble court, notices are sought to be served through substituted service by this paper publication, please be informed that, the case is posted **on 05.06.2024** and if you fail to appear before the Hon'ble court **at 10.30. A.M** on the said day either in person or through your counsel, the matter will be decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)
A.Tulsi Raj Gokul
Advocate
7-1-50/2 siddardha Apartments Flat NO.106, Shyam Karan Road Ameerpet, Hyderabad, Mob:9848231476

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

బుధవారం | మే 15, 2024 | www.navatelangana.com

ఘనంగా కానుకంటి భరత్ వంజరి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ బీజేవైఎం కార్యదర్శి కానుకంటి భరత్ వంజరి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డిలు భరత్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మేడ్చల్ జిల్లా బీజేవైఎం కార్యదర్శి రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ ఐటీ సెల్ కన్వీనర్ కేశవ్ రెడ్డి, బీజేవైఎం నాయకులు ప్రణయ్ తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉండాలి

- కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండడమే నాయకుడి లక్షణమని కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ అన్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో నివాసముంటున్న బీఆర్ఎస్ కార్యకర్త కవిత భర్త మౌలా ఇటీవల యాక్సిడెంట్‌కు గురై కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ వారి ఇంటికి వెళ్లి మంగళవారం పరామర్శించారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కార్యకర్తలు కష్టాల్లో ఉన్నప్పుడు నాయకులు అందుబాటులో ఉంటూ వారికీ సహాయపడాలని విజ్ఞప్తి చేశారు.

'పది' ఫలితాల్లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



- డైరెక్టర్ సుశీల్ కుమార్

నవతెలంగాణ-కీసర

పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పల్లవి స్కూల్ డైరెక్టర్ సుశీల్ కుమార్ తెలిపారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలోని పల్లవి స్కూల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో స్థాపించిన పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫలితాలు ప్రతీ సంవత్సవరం పెరుగుతూ వస్తున్నాయని చెప్పారు. ఈ సంవత్సరం స్కూల్ టాపర్‌గా ఎమ్. పునీత్ (97.2శాతం), సెకండ్ టాపర్‌గా ఎమ్. యుగాల (95.6శాతం), సాయి సుభాష్ (91.4శాతం)గా నిలిచారని పేర్కొన్నారు. ఏ1 గ్రేడ్‌లో 70మంది (90శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇద్దరు విద్యార్థులు మ్యాథమెటిక్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలకు కృషి చేసిన ప్రిన్సిపాల్ శ్రీలత చెన్నప్రగడకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజబొల్లారంలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు
- నిబంధనలను తుంగలో తొక్కుతున్న అక్రమ నిర్మాణదారులు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. వాటిని అరికట్టాల్సిన పంచాయతీరాజ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో అక్రమ నిర్మాణలు అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజబొల్లారం గ్రామపంచాయతీ పరిధి ఇండస్ట్రియల్ జోన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ నిర్మాణాలు చేపట్టాలంటే ఇండస్ట్రియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలి. కానీ ఎలాంటి జోన్ మార్పిడిలు లేకుండానే పలువురు అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. జోన్ మార్చిన అనంతరం హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకొని నిర్మాణాలను చేపట్టాలి. కానీ అక్రమ నిర్మాణదారులకు అవేవి పట్టడం లేదు. పంచాయతీ కార్యదర్శులు అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే తప్ప వారిపై చర్యలు తీసుకుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అధికారులు అడ్డుకుంటే ఇలాంటి పరిస్థితులు పునరావృతం అయ్యే అవకాశం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జేసీబీ డ్రైవర్ షబ్బీర్‌కు న్యాయం



- రెండు నెలల వేతనం రూ.40 వేలు ఇప్పించిన రవిసింగ్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఖాజాగూడ హిల్‌లోని జూబ్లీ రెడీమిక్స్ కంపెనీ జేసీబీ ఓనర్ నారాయణ రెడ్డి దగ్గర ఎండీ. షబ్బీర్ అనే కార్మికుడు జేసీబీ డ్రైవర్‌గా కొన్నేండ్లుగా పని చేస్తున్నాడు. ఓనర్ నారాయణరెడ్డి ఉద్దేశపూర్వకంగా జనవరి, ఫిబ్రవరి రెండు నెలల వేతనం రూ.40 వేలు చెల్లించకుండా ఎండీ. షబ్బీర్‌ను బెదిరించి పనిలో నుంచి తొలగించాడు. ఎండీ. షబ్బీర్ ఈ విషయాన్ని బీఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి తనకు న్యాయం చేయాలని కోరారు. రవిసింగ్ హుటాహుటిన ఓనర్ నారాయణరెడ్డితో మాట్లాడి రెండు నెలల వేతనం రూ.40వేలు ఇప్పించాడు. ఈ సందర్భంగా షబీర్, మాట్లాడుతూ తనకు న్యాయం చేసిన రవిసింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనీల్, సుదర్శన్, జగన్, ప్రేమ్,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష మెజార్టీతో సునీతారెడ్డి గెలుపు ఖాయం




- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

మల్కాజిగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి లక్ష మెజార్టీతో గెలువడం ఖాయమని అన్ని సర్వేల రిపోర్టులు చెబుతున్నాయని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మంగళవారం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ పార్టీ అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అన్ని సర్వేలు, రిపోర్టులు మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, వేణు, కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, బాలాజీ, రఘు, సాదు ప్రతాప్ రెడ్డి, బషీర్ భాయ్, టోచర్, పిడికిడి గోపాల్ చౌదరి, మోహన్ రెడ్డి, బాకీ భాయ్, రాజేందర్ డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, మధు, కృష్ణ రాజ్ పుత్, కె. రమేష్, ప్రవీణ్, మహిళా నాయకురాలు పుష్పారెడ్డి, రమాదేవి, రేష్మా, జ్యోతి, రజిత, కృష్ణవేణి, జోజమ్మ, భరతమ్మ, రాధ, మారుతి, విజయలక్ష్మి, రేణుక, స్వరూప, బండి సుధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ శేఖర్‌గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్‌గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం చింతల్ చంద్రా నగర్‌లోని ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విజయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బాలునేత శాలువాతో సన్మానించారు. కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మహేష్, నాని, తదితరులున్నారు.

బ్యాంకాక్ బాట పట్టిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు!

- చైర్మెన్ పదవిని కాపాడుకోవడానికేనా?
- మారుతున్న రాజకీయ సమీకరణాలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు బ్యాంకాక్ బాట పడుతున్నారు. ఈనెల 18న బ్యాంకాక్ ఫ్లైట్ ఎక్కెందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ పదవిని కాపాడుకునేందుకు చైర్ పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్లను తీసుకొని బ్యాంకాక్ వెళ్తున్నట్టు తెలిసింది.

అవిశ్వాసం తప్పదా?

గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం తప్పేటట్లు లేదు. ఇటీవల గుండ్లపోచంపల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్ ప్రభాకర్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఖాయమని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాపాడుకునేందుకు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి బ్యాంకాక్ టూర్ వేసినట్టు తెలిసింది. ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో బ్యాంకాక్ ట్రిప్పుకు వెళ్తున్నట్టు సమాచారం.

మొత్తం 15 మంది కౌన్సిలర్లు

గుండ్లపోచంపల్లి మున్సిపల్‌కు మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్‌కు ఐదుగురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు ఆరుగురు, బీజేపీ నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. అయితే అవిశ్వాసం పెట్టాలంటే కాంగ్రెస్‌కు ఇంకొక కౌన్సిలర్ అవసరం ఉంటుంది. ఇందుకోసం కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ పార్టీలు పావులను కదుపుతున్నాయి.

వీణా సురేందర్ గౌడ్ ఎటువైపు?

బీఆర్ఎస్‌లో ఉన్న ఆరుగురు కౌన్సిలర్ల నుంచి ఐదుగురు కౌన్సిలర్లు ఆ పార్టీని వీడే పరిస్థితులు కనిపించడం లేదు. మిగిలిన ఒకే ఒక కౌన్సిలర్ వీణా సురేందర్ గౌడ్ వైపు రెండు పార్టీ నేతలు చూస్తున్నారు. వీణా సురేందర్ గౌడ్‌ను కాంగ్రెస్ వైపు తిప్పుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చిన గుండ్లపోచంపల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్ ప్రభాకర్‌తో వీణా సురేందర్ గౌడ్‌కు సత్సంబంధాలు ఉండడంతో ప్రభాకర్ ద్వారా కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఇటు బీఆర్ఎస్ సైతం కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటుంది.

ఆ ఒక్క కౌన్సిలర్ కింగ్ మేకర్

గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే ఒక్క కౌన్సిలర్ అవసరం ఉంది. ఆ ఒక్క కౌన్సిలర్ ఎవరో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ ఒక్క కౌన్సిలరే గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ అవిశ్వాస తీర్మానంలో కింగ్ మేకర్‌గా మారనున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కు ఆరుగురు కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్‌కు ఐదుగురు కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే ఆరుగురు కౌన్సిలర్లు ఉండాల్సిందే. దీంతో బీఆర్ఎస్ లో ఉన్న ఆరుగురు కౌన్సిలర్ల నుంచి కింగ్ మేకర్ ఎవరు కానున్నారో వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్‌లో చేరిన కుండ భానుచందర్



నవతెలంగాణ-మేడ్చల్

కాంగ్రెస్ గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ 5వ వార్డు బీఆర్ఎస్ యువ నాయకుడు కుండ భానుచందర్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నట్లు సాయిపేట శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ గుండ్ల పోచంపల్లిలో మరికొంత మంది యువకులు కాంగ్రెస్ చేరుతారని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా రాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయన్నారు. రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు గెలిపించారని తెలిపారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగ య్యే అవకాశాలు ఉన్నాయని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి నరేందర్, ఈశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ ప్రభాకర్, సుధాకర్, ఫిలిప్స్, కృష్ణ రెడ్డి, కిషన్, నవీన్, మహేష్, భాస్కర్, మహేందర్, వర్మ వెంకట్, ప్రవీణ్, షబ్బీర్, పరిటాల సూరి, నందు, సందీప్, ఉన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో చేపడుతున్న యూజీడి పైప్ లైన్ నిర్మాణ పనులను మంగళవారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు యాదిరెడ్డి, రామ కోటేశ్వరరావు, కృష్ణమూర్తి, అందె నరసింహ, మదన్, సీత రాముడు, వెంకట్రామిరెడ్డి, రామేశ్వర్, బాబు రావు, బసవ లింగయ్య, ప్రకాష్, బసవ రాజు తదితరులు పాల్గొన్నారు.

మంగ పద్మావతి సమేత శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్, ఆదర్శనగర్‌లోని అలర్మేల్ మంగ పద్మావతి సమేత శ్రీవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12న ఘనంగా ప్రారంభమై 15వ తేదీన ముగియనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ, స్థానిక ఆదర్శనగర్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ, సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ముందుగా హౌసింగ్, బిల్డింగ్స్ సొసైటీ సభ్యుల బృందం ఆధ్వర్యంలో శ్రీవారికి పట్టు వస్త్రాలను మంగళవారం అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డి.ఎల్.శ్రీధర్ ఉపాధ్యక్షులు మురళీధర్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎం.ఇందిరారెడ్డి, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి గంటి ఫణిశర్మ డైరెక్టర్లు డాక్టర్.పద్మా శ్రీధర్, కే.విజయలక్ష్మి దుర్గా సుబ్బారావు, హౌసింగ్ సొసైటీ డైరెక్టర్లు ఎం.దుర్గా, వి.ఆంజనేయులు, నాగదేశి రవికుమార్, నాంచారమ్మ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, నారాయణ గౌడ్, కార్యదర్శి జే.శ్రీనివాస్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండువగా కొనసాగింది.



నిమ్మలవాణికుంట బఫర్‌లో ఆగని అక్రమ భవన నిర్మాణం

- చోద్యం చూస్తున్నారంటూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై ఆరోపణలు
- సమస్యను పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తూతూ మంత్రంగా చర్యలు
- అయినా ఆగని అక్రమ నిర్మాణం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పార్టీ పరిధిలోని బౌరంపేట్ పరిధిలోని సర్వే నెంబర్ 660 నిమ్మలవాణికుంట 1ఎకరా 15 గుంటలు శిఖం భూమి ఉంది. దాని పక్కన కీర్తి హెూమ్స్ పేరిట విల్లాల నిర్మాణం చేపట్టిన సమయంలో ఈ స్థలం జోలికి వెళ్లకుండా తమ పరిధిలోనే నిర్మించుకున్నారు. ఐదేండ్లుగా ఆ స్థలంలో ఎలాంటి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరగలేదు. ఇటీవల నిమ్మలవాణికుంట బఫర్‌లో 150 గజాల స్థలంలో ఓ వ్యక్తి భవన చేపట్టడంతో ఆ అక్రమ నిర్మాణంపై వివిధ పత్రికల్లో వార్తలు రావడంతో విషయం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో అధికారులు నిమ్మలవాణికుంటను సర్వేయర్‌తో పరిశీలిస్తే బఫర్‌లోనే కొనసాగుతున్నట్లు తెలింది. ఆ నివేదికతో రెవెన్యూ యంత్రాంగం, ఇరిగేషన్ అధికారులు అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని నిలిపేశారు. 15 రోజులు స్తబ్ధతగా ఉన్న భవన నిర్మాణదారుడు మళ్లీ పనులు చేపట్టడంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. గ్రామపంచాయతీ హయాంలో సర్వే నెంబర్ 660 గా ఉన్న నిమ్మలవాణికుంట అధికారులు మాత్రం 667 సర్వే నెంబర్‌తో సూచించి కొంత స్థలం మాత్రమే బఫర్‌లో వస్తుందని తెలపడంతో ఇరిగేషన్, రెవెన్యూ, సర్వేయర్ ఒకరిపై ఒకరు దాటవేత ధోరణితో వ్యవహరించడం వల్ల నిర్మాణదారుడు ఆపివేసిన భవన నిర్మాణాన్ని మళ్లీ మొదలు పెట్టాడు. బౌరంపేట్‌లో నిమ్మలవాణికుంటలో భవన నిర్మాణం పనులు జరుగుతున్నా అధికారులు అటువైపు చూడకపోవడం గమనార్హం. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల తీరును స్థానికులు విమర్శిస్తున్నారు. కుంటలు చెరువు శిఖం భూమిని కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తే భవిష్యత్తులో నిమ్మలవాణికుంటలో మరిన్ని అక్రమ నిర్మాణాలు వెలుస్తాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు శిఖం భూముల్లో రానున్న రోజుల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని అధికారులు చర్యలు చేపట్టాలని, నిమ్మలవాణికుంట స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. నిమ్మలవాణికుంట చర్యలపై ఆర్ఐ భారతిని మీడియా వివరణ కోరగా భవన నిర్మాణం జరుగుతున్నది వాస్తవమే కొద్దిగా బఫర్‌లో వచ్చేటట్లుగా ఉందని సర్వేయర్ తనకు దృష్టి తెచ్చారని తెలిపారు. జాయింట్ యాక్షన్ టీంతో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


మనవరాలితో సరదాగా గడిపిన మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో ముగిసిన నాలుగు నెలల్లోపే మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన కుటుంబ సభ్యులకు సమయం కేటాయించకుండా ప్రతిరోజు ప్రజల దగ్గరికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ, వాటిని పరిష్కారం చేసుకోవడంతోనే కాలం గడిచిపోయింది. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో, మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఒకవైపు పాదయాత్రలో, మరోవైపు డివిజన్‌లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కొరకు గత 40 రోజులుగా సుదీర్ఘ ప్రచారం చేయడంలో నిమగ్నమై తీరిక లేకుండా గడిపాడు. ఇక నిన్నటితోఎన్నికల పర్వం ముగియడంతో మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి చాలా రోజుల తర్వాత సరదాగా గడిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన మనవరాలు ఐరాతో కలిసి టీవీలో క్రికెట్ మ్యాచ్ చూస్తూ, షటిల్ ఆడుతూ, కుటుంబ సభ్యులతో చాలా రోజుల తర్వాత సమయం కేటాయించారు.

మనవడు ఆర్యవీర్‌తో ఆటవిడుపుగా గడిపిన అరెకెపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అసెంబ్లీ ఎన్నికల అనంతరం, స్వల్ప కాలంలోనే పార్లమెంట్ ఎన్నికల నగారా మోగడంతో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం, గడచిన నెల రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత పాదయాత్రలు, ఎన్నికల ప్రచారం, పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశాలతో హడావిడిగా గడిపిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మంగళవారం ఇంట్లో తన మనువడు ఆర్యవీర్‌తో ఆటలాడుతూ ఆటవిడుపును పొందారు. మనుమడుతో కలిసి టీవీలో కార్టూన్ వీడియోలను తిలకిస్తూ చిన్నారిని ఆటలాడిస్తూ సరదాగా గడిపారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



- యువజన సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- ప్రారంభించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ
- లాస్ట్ బస్‌స్టాప్ వద్ద మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి

సగరుల కుల గురువు, పవిత్రమైన గంగను భువికి తీసుకువచ్చిన శ్రీ అపర భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని మంగళవారం జగద్గిరిగుట్ట సగర సంఘం ఆధ్వర్యంలో షిరిడి హిల్స్ సగర సంఘ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సగర యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు సంఘం కార్యాలయంలో గల భగీరథ మహర్షి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాలలో యువజన సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కొనసాగింది. జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద బాటసారుల కోసం వేసవి తాపాన్ని తీర్చేందుకుగాను మజ్జిగ పంపిణీ చేశారు. అంతకుముందు గాంధీ మాట్లాడుతూ..సగర ఉప్పర కులస్తులకు ఆరాధ్య దైవం భగీరథుడు వారి పేరుపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని తీసుకువచ్చి, ఇంటింటికీ మంచి నీటి సరఫరా చేసి, ప్రజల దాహార్తిని తీర్చి, భగీరథ మహర్షికి గుర్తింపు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ సాగర సంగం ఆధ్వర్యంలో నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భగీరథ జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున సగర సంఘం నాయకులు, మహిళలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కే.పి.రాములు సాగర్, సలహాదారులు,జగద్గిరిగుట్ట సగర సంఘం మాజీ అధ్యక్షులు రంగాపురం దయాసాగర్, సగర సంఘం అధ్యక్షులు కొండయ్య సాగర్, ప్రధాన కార్యదర్శి ఆస్కానీ శ్రీనివాస సాగర్, కోశాధికారి కొమ్ముల రాజసాగర్, మహిళా సంఘం అధ్యక్షురాలు జి.కుసుమమ్మ, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.శాంత సాగర్, కోశాధికారి సిహెచ్.జ్యోతి సాగర్, యువజన సంఘం అధ్యక్షులు ఎం.మురళి సాగర్, ప్రధాన కార్యదర్శి చిలుకా శేఖర్ సాగర్, కోశాధికారి సంపత్ సాగర్, గ్రేటర్ హైదరాబాద్ సగర ఉప్పర సంఘం గౌరవాధ్యక్షులు అస్కని వెంకటస్వామి సాగర్, అధ్యక్షులు మోడల రవి సాగర్, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట రాములు సాగర్, కోశాధికారి దిండి రామస్వామి సాగర్ ఉన్నారు.





ఈ ఆహారంతో మీ గుండె పదిలం..

గుండె పదిలంగా ఉండాలంటే ఫైబర్ అధికంగా ఉన్న పౌష్టికాహారం తీసుకోవాలని, కూరగాయలు,ఫ్రూట్స్, ఆకుకూరలు విధిగా ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఫ్రైడ్, జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్స్‌ను అసలే తీసుకోవద్దని అన్నారు. ఆయిల్ అధికంగా లేకుండా గుడ్లు, ఫిష్, ఫ్రూట్స్, కూరగాయలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యంగా, పదిలంగా ఉంటుందని వైద్యులు చెప్పారు.

తలనొప్పికి ట్యాబ్లెట్స్ వాడుతున్నారా.?

తలనొప్పి ప్రతీ ఒక్కరిలో సర్వసాధారణంగా వచ్చే సమస్య. మనలో చాలా మంది ఏదో ఒక సమయంలో తలనొప్పి సమస్యను ఎదుర్కొనే ఉంటారు. నిద్రలేకపోవడం మొదలు మరెన్నో కారణాలతో తలనొప్పి వేధిస్తుంటుంది. మనలో చాలా మంది తలనొప్పి రాగానే వెంటనే మందులు వేసుకుంటారు. అయితే ట్యాబ్లెట్ వేసుకుంటే వెంటనే ఉపశమనం లభిం చినా వాటివల్ల కలిగే దుష్ప్రభావాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అందుకే తలనొప్పిని వీలైనంత వరకు సహజ మార్గాల ద్వారానే తగ్గించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌కి అలవాటు పడడం ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

తల్లీకూతుళ్ల విజయాలు

మాతృదినోత్సవ సంబరాలను ఇటీవలె ఎంతో ఘనంగా జరుపుకున్నాం. అభినందనలతో, బహుమానాలతో మన తల్లులను ముంచెత్తాం. అయితే మదర్స్ డే అంటే కేవలం మాతృ ప్రేమకు సంబంధించిన వేడుక మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సాధించిన అద్భుతమైన విజయాలను గుర్తించే సందర్భం కూడా. ఈ ప్రత్యేకమైన రోజున వారి రంగాలలో గొప్ప విజయాలు సాధించిన తల్లీ కూతుళ్లు ఎందరో ఉన్నారు. వారి నుండి ప్రేరణ పొందుదాం. అడ్డంకులను అధిగమించిన వారి సంకల్ప శక్తిని ఓ సారి గుర్తు చేసుకుందాం...



పౌర సేవకులు...

సివిల్ సర్వీసెస్ రంగంలో మంచి పేరు తెచ్చుకున్న హిమాలి కాంబ్లే దాబీ, టీనా దాబీ అనే అసాధారణమైన తల్లీ కూతుళ్లను ఇప్పుడు మనం కలుసుకున్నాం. టీనా 2016 యూపీఎస్సీ టాపర్‌గా కీర్తిని పొందగా, రిటైర్డ్ ఇండియన్ ఇంజినీ రింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) అధికారి హిమాలి కూడా ఒకప్పుడు యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది. తన కూతుళ్లు టీనా, రియాలకు ఐఏఎస్ సాధించాలని బలమైన కోరిక. పిల్లల కలను నిజం చేయాలనే ఉద్దేశంతో వారికి అవసరమైన మార్గనిర్దేశం చేయాలనే కోరికతో హిమాలి తన పదవికి స్వచ్ఛంద విరమణ తీసుకున్నారు. ఔత్సాహిక పౌర సేవకులను ప్రేరేపించారు. యూపీఎస్సీ వంటి కఠినమైన పరీక్షా ప్రక్రియను ఛేదించడంలో తల్లిగా పిల్లలకు మార్గదర్శకత్వం చేశారు.

- హిమాలి కాంబ్లే దాబీ, టీనా దాబీ



3డి జీబ్రా క్రాసింగ్‌ల రూపకల్పన

ఈ తల్లీకూతుళ్లల వినూత్న ఆలోచన భారతదేశంలో పాదచారుల భద్రతపై శాశ్వత ప్రభావాన్ని చూపింది. పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌ల దృశ్యమానతను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించారు. గుర్తించడంతోనే ఆగిపోలేదు. భారతదేశపు మొట్టమొదటి 3డి జీబ్రా క్రాసింగ్‌ల రూపకల్పనను వారు తమ బాధ్యతను తీసుకున్నారు.
ఆ తల్లీ కూతుళ్లు చూపిన ఈ చొరవ వారి సృజనాత్మకతనే కాకుండా రహదారి భద్రతను మెరుగుపరచడంలో వారి అచంచలమైన నిబద్ధతను కూడా ప్రదర్శిస్తుంది. సాంప్రదాయిక విధానాలను అధిగమించడం ద్వారా దృశ్యపరంగా అద్భుతమైన పరిష్కారాన్ని పరిచయం చేశారు. కాస్త చేయూత ఉంటే తమ నైపుణ్యాన్ని ఉపయోగించి మహిళలు అద్భుతాలు సృష్టించగలరని చెప్పడానికి సౌమ్య, శకుంతలలు ఉదాహరణగా నిలిచారు.

- సౌమ్య పాండ్య ఠాకూర్, శకుంతల పాండ్య

వైద్యాన్ని, వేగాన్ని మిళితం చేసి

కర్నాటకకు చెందిన ఈ తల్లీ కూతుళ్లు పవర్‌హౌస్ భారతదేశంలో మొట్టమొదటి ఆల్-మహిళా రేసింగ్ టీమ్‌గా అవతరించారు. ఆ రంగంలో మహిళలకున్న అడ్డంకులను అధిగమించారు.



ప్రొఫెషనల్ ర్యాలీ రేసర్లు, ప్రాక్టీస్ చేసే వైద్యులుగా వైద్యం పట్ల వారి అంకితభావంతో, వేగం పట్ల వారి అభిరుచిని మిళితం చేశారు. శివాని ఎంబీబీఎస్ పూర్తి చేశారు. భారతదేశపు మొట్టమొదటి ఆల్-ఉమెన్ రేసింగ్ టీమ్‌లో ఆమె భాగం. అదే సమయంలో ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్, ప్రొఫెసర్ అయిన దీప్తి తన కుమార్తె రేసింగ్ కలలకు మద్దతునిస్తూ కో-డ్రైవర్, నావిగేటర్ పాత్రను పోషిస్తున్నారు. పురుషాధిక్య మోటార్‌స్పోర్ట్ రంగంలో శివాని, దీప్తి నిర్భయంగా తమ విజయానికి అవసరమైన మార్గాన్ని రూపొందించుకున్నారు. రేసులను గెలుచుకుని ఆ రంగంలో తమదైన ముద్ర వేశారు.

- దీప్తి పృథ్వీ, శివాని



గొప్ప ఎత్తులకు ఎదిగారు

ఆడ్రీ మాబెన్, అమీ మెహతా అద్భుతమైన తల్లీ కూతుళ్లని చెప్పవచ్చు. వారు తమలోని క్రియేటివితో గొప్ప ఎత్తులకు ఎదిగారు. ఆడ్రీ మాబెన్ భారతదేశపు మొట్టమొదటి మహిళా మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా చరిత్ర సృష్టించారు. తన ప్రయాణంతో ఔత్సాహిక మహిళా విమానయానకారులకు మార్గం సుగమం చేశారు. ఆమె తన కూతురు అమీ మెహతాతో కలిసి మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ప్రదక్షిణ యాత్రకు ప్రయత్నిం చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించారు. అసాధారణమైన ప్రయాణం చేసి ఎంతో మంది ప్రశంసలలను అందుకున్నారు.

- ఆడ్రీ మాబెన్, అమీ మెహతా

ఇంటి నుండి ఫీల్డ్‌కు

ప్రతిభ, అంకితభావం, కుటుంబ మద్దతు గురించి క్రీడా కారులైన ఈ తల్లీ కూతుళ్ల ఎంతో గొప్పగా చెబుతారు. హైజంప్‌లో జాతీయ రికార్డ్ హోల్డర్‌గా సహానా అద్భుతమైన కెరీర్ కొనసాగిస్తుంటే, లాంగ్ జంప్‌లో పవన విజయాలు సాధిస్తున్నారు. ఈ తల్లీ కూతుళ్ల క్రీడల్లో తామెంటో నీరూపించుకుంటున్నారు. వీరి ట్రాక్ ఇంటి నుండి ఫీల్డ్‌కు విస్తరించింది. యూ20 ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పవన గొప్ప విజయం, లాంగ్ జంప్‌లో ఆమె తల్లి చూపిన పట్టుదల వీరిద్దరిలో ఉన్న ప్రతిభను నొక్కి చెబుతుంది. అథ్లెటిక్స్ ప్రపంచాన్ని వారిద్దరు కలిసి నావిగేట్ చేస్తున్నారు. సహానా ఒక మార్గదర్శక శక్తిగా, పవన ఒక మంచి యువ క్రీడాకారిణిగా వారు భవిష్యత్‌లో సాధించేందుకు తమ ముందు పెద్ద విజయాలను లక్ష్యంగా పెట్టుకున్నారు.



- సహానా కుమారి, పవన నాగరాజ్

వేసవిలో గర్భిణులు ఏం తినాలి?

గర్భం అనేది స్త్రీ జీవితంలో ఒక అత్యంత అందమైన ప్రయాణం. అయితే వేసవిలో గర్భిణీలు చాలా జాగ్రత్తగా ఉండాలి. డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవడమే కాదు, పోషకాహారాన్ని తీసుకొని బిడ్డ ఆరోగ్యాన్ని, తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

గర్భిణులు వేసవికాలంలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్లు, సహజ చక్కెరలు నిండి ఉన్న ఆహారాలను అధికంగా తినాలి. వీటిని తినడం వల్ల జుట్టుకు, చర్మానికి ఎంతో మేలు జరుగుతుంది. జీర్ణ క్రియను, పేగు కదలికలను సులభతరం చేస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. డైటీషియన్లు చెప్పిన ప్రకారం గర్భిణీలు వేసవిలో ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలి? ఎలాంటి పదార్థాలను దూరంగా పెట్టాలో తెలుసుకుందాం.

ఏం తినాలి?

గర్భిణులు వేసవిలో పుచ్చకాయలను తినటంవల్ల డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు.



నిమ్మకాయ రసం, కివీ పండ్లు, జామ, పీచ్, రేగు పండ్లు అధికంగా తినాలి. వీటన్నింటిలో కూడా ఇనుము అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఐరన్, ఫైబర్ అధికంగా ఉండే ఆపిల్ పండ్లు ప్రతిరోజూ రెండు తినడం చాలా అవసరం. అలాగే రోజుకో అవకాడో పండు తింటే మంచిది. దీనిలో మంచి కొవ్వులు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇక రోజుకు రెండు అరటిపండ్లు కూడా తినాలి. మామిడి పండ్లు తినడం వల్ల విటమిన్ ఏ, విటమిన్ సి పోషకాలు పుష్కలంగా అందుతాయి. అలాగే నీళ్లు అధికంగా తాగుతూ ఉండాలి. లస్సీ, కొబ్బరి నీరు, మజ్జిగ వంటివి అధికంగా తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉంటుంది.

ఏం తినకూడదు?

గర్భిణీలు ఇంట్లో తయారుచేసిన ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. బయట దొరికే మిల్క్ షేక్స్ వంటి చక్కెర పానీయాలను తీసుకోకూడదు. పంచదార కలిపిన పానీయాలకు, ఆహారాలకు దూరంగా ఉండాలి. సోడాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు తినకూడదు. కాఫీ, టీలు కూడా మానేయడమే మంచిది. వేసవిలో కాఫీ, టీలు శరీరాన్ని డిహైడ్రేషన్‌కు గురయ్యేలా చేస్తాయి.

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

(మొదటిపేజీ తరువాయి)

నిలబడ్డారన్నారు. బీజేపీని గెలిపించేందుకే కాంగ్రెస్ పార్టీ పలు చోట్ల డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి, ఆ పార్టీ గెలుపునకు కృషి చేసిందని ఆరోపించారు. గడిచిన పదేండ్ల పాలనలో బీజేపీ చేసింది శూన్యం అని, పెట్రోల్, డీజిల్ నిత్యావసర వస్తువుల ధరలు పెంచడంతో ప్రజలు ఆ పార్టీని నమ్మడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. కొత్త జిల్లాలను తొలగించి, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కాంగ్రెస్ చిల్లర రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ, వృద్ధులకు రూ.4000 పెన్షన్, రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలకు బీఆర్ఎస్ ముచ్చెమటలు పట్టించిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కష్టం ఊరికే పోదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బలం చేకూరుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టెస్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్ రావు, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి ఉన్నారు.

13 సీట్లు మావే

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని రేవంత్‌రెడ్డి చెప్పారు. మెదక్‌లో బీజేపీ మూడో స్థానంలోకి వెళ్లిందని తెలిపారు. ఏ పార్టీకి ఆ పార్టీ పనిచేసి ఉంటే అంచనా వేయడం సులువన్నారు. బీజేపీకి కేంద్రంలో 220కు పది అటో, ఇటో వస్తాయని వివరించారు. ఇంతటితో రాజకీయ కార్యకలాపాలు ముగిశాయన్నారు. ఇప్పటి నుంచి పరిపాలనపై దృష్టి సారిస్తామన్నారు. హామీల అమలుపై సమీక్ష చేస్తామన్నారు.

రైతు రుణమాఫీకి నిధులు సమకూరుస్తాం

రైతు రుణమాఫీ చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. విద్యా సంవత్సరం మొదలుకానుందని, సన్నబియ్యం సరఫరా, పుస్తకాలు, యూనిఫామ్ తదితర అంశాలపై సమీక్ష చేస్తామని వివరించారు. ఫార్మర్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి ఆదాయం సమకూర్చుతామనీ, దాని ద్వారా రుణం తీసుకుని రైతు రుణమాఫీ చేస్తామన్నారు. రైతుకు పెట్టుబడి, గిట్టుబాటు ధరలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రేషన్ దుకాణాల ద్వారా గతంలో మాదిరి ఎక్కువ వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఏయే వస్తువులు ఇవ్వొచ్చో పరిశీలించి నిర్ణయిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ హెచ్చరించారు.

కాల్పులు జరిపిన స్టూడెంట్‌కు పదేండ్ల జైలు శిక్ష : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

ర్యాగింగ్ పాల్పడిన సందర్భంగా హైదరాబాద్, దారుసలాంలోని దక్కన్ ఇంజనీరింగ్ కాలేజీలో 2007లో ఫైరింగ్‌కు పాల్పడిన మహమ్మద్ ఉమీదుల్లా ఖాన్‌కు హైకోర్టు పదేండ్ల జైలు శిక్షను విధించింది. లోయర్ కోర్టు గతంలో ఖాన్‌కు పదేండ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధించింది. ఈ తీర్పును కొట్టేయాలని ఖాన్ వేసిన అప్పీల్‌ను జస్టిస్ వేణుగోపాల్ కొట్టేశారు. దక్కన్ కాలేజీలో ముఖ్రం సిద్ధిఖీపై కాల్పులపై నమోదైన కేసులో పదేండ్ల జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానాలను విధిస్తూ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న ఖాన్ అప్పీల్ పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమన్నారు. బీటెక్ చదివే ఖాన్‌కు కాల్పులు జరిపితే ప్రాణాలకు ముప్పు ఉంటుందని తెలుసుననీ, కావాలనే కాల్పులు జరిపినట్టు స్పష్టమవుతున్నదని చెప్పారు. ప్రాసిక్యూషన్‌లో జోక్యానికి ఆస్కారం లేదనీ, కింది కోర్టు తీర్పులో జోక్యానికి వీల్లేదని స్పష్టం చేశారు.

ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తం

(మొదటిపేజీ తరువాయి)

అంచనాల్లో ఆ పార్టీ నేతలున్నారు. మిగతా నాలుగు నియోజకవర్గాల్లోనూ పోటాపోటీగా ఓట్లు వస్తాయంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన మేలు, కేసీఆర్, హరీశ్‌రావు పట్ల ఉన్న అభిమానం, బూత్ స్థాయిల్లో చేసిన తాయిలాల మేనేజ్‌మెంట్ వర్కవుట్ అవుతాయని ఆశిస్తున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపుపై ధీమాగా ఉన్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో సైతం బీఆర్ఎస్‌కు దీటుగా కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయని లెక్కలేస్తున్నారు. ఆ మూడు స్థానాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే డబుల్ ఓట్లు ఎంపీ అభ్యర్థికి వస్తాయని అంటున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, బీసీ, ముదిరాజ్ కార్డ్ బాగా ప్రభావితం చేసిందని చెబుతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సైతం గెలుపు ఖాయమంటున్నారు. ఆయన రెండు ఎన్నికల్లో ఓడిపోవడం, స్థానికంగా తనకున్న సానుకూల పరిస్థితులు కలిసొస్తాయంటున్నారు. ప్రధాని మోడీ ప్రభావంతో యువత, వ్యాపారస్తులు, మధ్య తరగతి ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపారనే ఆశలో ఉన్నారు.

జహీరాబాద్‌లో క్రాస్ ఓటింగ్ ఎవరికి మేలు చేస్తుందో..?

జహీరాబాద్ పార్లమెంట్‌లో 74.63 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గం పరిస్థితి కూడా ఉత్కంఠగా ఉంది. లింగాయత్ సామాజిక తరగతి ఓట్లు ఎటు వైపు మొగ్గు చూపాయో తేలట్లేదు. ఇక్కడ క్రాస్ ఓటింగ్ ప్రభావం జరగడంతో అది ఎవరికి కలిసొస్తుందనేది చూడాలి. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కర్, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఇద్దరూ లింగాయత్ సామాజిక తరగతికి చెందిన వారు కావడంతో ఓట్లు చీలాయి. ఆ సామాజిక తరగతి ఓట్లు గంప గుత్తగా ఒక్కరికే పడలేదు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలున్న అందోల్, నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డిలో భారీ మెజార్టీ వస్తుందంటున్నారు. మిగతా మూడు చోట్ల కూడా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో ఓటర్లు హస్తం గుర్తుకే వేశారని చెబుతున్నారు. కాంగ్రెస్‌కే గెలుపు అవకాశాలున్నప్పటికీ ఆ పార్టీలో ఒకటి, రెండు చోట్ల సొంత పార్టీ ఎమ్మెల్యేలే సహకరించలేదనే గుసగుసలూ ఉన్నాయి. అది ఏ మేరకు నష్టం చేస్తుందనేది చూడాలి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సైతం గెలుస్తామంటున్నా.. క్షేత్రస్థాయిలో ఓట్లు పడలేదనే చర్చ నడుస్తోంది. పైగా గులాబీ ఓట్లు కారుకు పడకపోవడం వల్ల క్రాస్ ఓటింగ్ జరిగిందంటున్నారు. అది కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను చూసి అటు వైపు మళ్లిందా..? లేక బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలిచి బీజేపీ నుంచి పోటీ చేస్తున్న బీబీ పాటిల్‌కు అనుకూలంగా మారిందా..? వేచి చూడాలి.

పోలింగ్ సరళిపై పోస్ట్‌మార్టం.. 20 రోజుల నిరీక్షణతో ఉత్కంఠ

ఓటర్లు తీర్పు తెలుసుకునేందుకు మరో 20 రోజులు ఆగాల్సిందే. మరో మూడు దశల్లో పోలింగ్ పూర్తయ్యాక జూన్ 4న ఓట్ల లెక్కింపు చేస్తారు. ఎన్నికల ప్రచారంలో క్షణం తీరిక లేకుండా గడిపిన అభ్యర్థులు ఫలితం తేలేందుకు 20 రోజుల పాటు ఉత్కంఠగా ఎదురు చూడక తప్పదు. నరాలు తెగే ఉత్కంఠతో ఉక్కిరి బిక్కిరవుతున్న అభ్యర్థులు అనేక రకాల విశ్లేషణలు చేస్తున్నారు. పోలింగ్ సరళిపై పోస్ట్‌మార్టం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ప్రభావం చూపిన పరిస్థితుల్ని అంచనా కడుతున్నారు. భారీ జన సమీకరణ, పోల్ మేనేజ్‌మెంట్, కుల, మతం ప్రభావం, ప్రభుత్వ పథకాలు, చేసిన అభివృద్ధి, స్థానిక అంశాలు.. ఇలా అనేక కోణాల్లో లెక్కలేస్తున్నారు. ఎక్కడ వీక్‌గా ఉన్నాం.. ఎక్కడ ఆధిక్యంలో ఉన్నామనేది బూత్ కమిటీలు, పార్టీ పరిశీలకులు, రాజకీయ విశ్లేషకులిచ్చిన రిపోర్టులను తిరగేస్తున్నారు. పార్టీ పరమైన అంచనాలే కాకుండా వ్యక్తగతంగా అనుయాయులతో సేకరించిన గ్రౌండ్ రిపోర్టును బట్టి గెలుపునకు దగ్గరగా ఉన్నామా..? దూరంగా ఉన్నామా..? అనే స్పష్టతకు వస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం పూర్తయ్యాక జియో ట్యాగింగ్ అనుసంధానంతో ఈవీఎంలను పోలీస్ బలగాల భద్రత మధ్య స్ట్రాంగ్ రూముల్లోకి చేర్చారు. మెదక్ పార్లమెంట్ నియోజవర్గం పరిధిలో ఉన్న 2124 పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లో ఉంచారు. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈవీఎంలను నర్సాపూర్‌లో ఉన్న బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లోని ఈవీఎంలను ప్రభుత్వ గిరిజన జూనియర్ కళాశాల్లో భద్రపర్చారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఉంచారు.

ఎన్నికల బాండ్ల స్కామ్‌పై సిట్ దర్యాప్తు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చింది. త్వరగా ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని జస్టిస్ సంజీవ్ ఖన్నాను భూషణ్ కోరారు. ప్రస్తుతం ఆ పిటిషన్ భారత ప్రధాన న్యాయమూర్తి ముందు వుందని, ఆయన విచారణకు ఒక తేదీని కేటాయించి, బెంచ్‌ను ఏర్పాటు చేస్తారని తెలిపారు. భూషణ్, న్యాయవాదులు చెరియల్ డిసౌజా, నేహా రాథీలు ప్రాతినిధ్యం వహిస్తున్న కామన్ కాజ్ అండ్ ది సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ ఈ పిటిషన్ వేసింది. దేశంలోని ప్రధాన దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను శాఖ వంటి సంస్థలు అవినీతికి అనుబంధ సంస్థలుగా మారినట్టు కనిపిస్తోందని ఆ పిటిషన్ పేర్కొంది. ఈ సంస్థల దర్యాప్తును ఎదుర్కొంటున్న పలు కంపెనీలు, సంస్థలు, దర్యాప్తు ఫలితాలను ప్రభావితం చేసేందుకు గానూ పాలక పార్టీకి పెద్ద మొత్తాల్లో విరాళాలు అందచేశాయని పిటిషన్ పేర్కొంది. అందువల్ల, ఈ కేసులో దర్యాప్తు జరిపితే ప్రతి సంఘటన వెనుక గల కుట్ర కుతంత్రాలు బయటపడడమే కాకుండా ఈ కుట్రలో భాగస్వాములైన ఈడీ, ఐటీ, సీబీఐ అధికారుల గురించి కూడా వెల్లడవుతుందని పిటిషన్ పేర్కొంది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు చేసిన క్విడ్ ప్రో కో ఏర్పాట్లుగా ఈ బాండ్లు కనిపిస్తున్నాయని పేర్కొంటూ, హిందూ, ఇతర మీడియా సంస్థలు జరిపిన విస్తృతమైన డేటా తవ్వకాలను, వార్తలను ఈ సందర్భంగా పిటిషన్ ప్రస్తావించింది.

రైతన్న ఆగ్రహం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో కొన్ని రోజుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి 40.500 కిలోల బస్తాను తూకం వేసి అందులో నుంచి బస్తా బరువు పేరిట 500 గ్రాములు తగ్గించి.. 40 కిలోల ధాన్యానికి ధర నిర్ణయిస్తారు. ఈ కేంద్రంలో కూడా ఇదే విధంగా తూకం వేస్తున్నారు. కానీ 42 కిలోల నుంచి 43 కిలోల వరి ధాన్యాన్ని తూకం వేస్తే 40.500 కిలోల వరి ధాన్యం తూకం వేసినట్టుగా చూపించే విధంగా నిర్వాహకులు కాంటాను సవరించారు. మంగళవారం కేంద్రానికి వచ్చిన రైతు రౌతు సత్తన్న కల్లం వద్దే నిర్వాహకులు ధాన్యం తూకం వేశారు. రైతుకు తూకంపై అనుమానం రావడంతో ఆ ధాన్యాన్ని పక్కనే ఉన్న ప్రయివేట్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లి తూకం వేశాడు.

అక్కడికి, ఇక్కడికి తేడా ఉండటంతో రైతులు వెళ్లి నిర్వాహకులను నిలదీశారు. వారూ తేడా ఉన్నట్టు అంగీకరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న సహకార సంఘం సీఈఓ బక్కయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. వెంటనే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు. అనంతరం కేంద్రం నిర్వాహకుడు తుమ్మిడె నారాయణ కల్లం వద్దకు వచ్చి రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినకుండా స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు, కలెక్టర్‌కూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా, సోమవారం ఈ కొనుగోలు కేంద్రం నుంచి 220 క్వింటాళ్ల వరి ధాన్యం మిల్లర్లకు పంపించారు.

ఈ ధాన్యం విక్రయించిన రైతులు కూడా ఇప్పుడు ఆందోళనకు దిగారు. తమ ధాన్యం తూకంలో కూడా మోసం జరిగి ఉంటుందని, దీనిపై వివరాలు రాబట్టాలని సీఈఓ బక్కయ్యను వారు నిలదీయడంతో మిల్లర్లకు ఈ కేంద్రం నుండి రవాణా అయిన ధాన్యం వివరాలను సేకరించారు. నాలుగు క్వింటాళ్ల వరి ధాన్యం అధికంగా వచ్చినట్టు సదరు మిల్లర్ల ద్వారా తెలిసిందని సీఈఓ బక్కయ్య తెలిపారు. తూకంలో జరుగుతున్న మోసం విషయంలో కేంద్రం నిర్వాహకుల హస్తంతో పాటు సహకార సంఘం నాయకులూ చేతివాటం ప్రదర్శించి ఉంటారని, దీనిపై లోతుగా విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వారణాసిలో మోడీ నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్త బైజ్‌నాథ్ పటేల్, ఓబీసీకి చెందిన లాల్‌చంద్ కుష్వాహా, దళిత సమాజానికి చెందిన సంజయ్ సోంకర్ ప్రధాని నామినేషన్ పత్రంపై ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టకు జ్ఞానేశ్వర్ శాస్త్రి ముహూర్తం నిర్ణయించారు. ఆయన జ్యోతిష్య పండితుడు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన బైజ్‌నాథ్ పటేల్ ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వారు. లాల్‌చంద్ కుష్వాహా కూడా ఓబీసీయే. బీజేపీకి మద్దతుగా ఉన్న ఓబీసీల నుండి ఇద్దరు ప్రతిపాదకులను మోడీ ఎంచుకోవడం గమనార్హం. సంజయ్ సోంకర్ దళిత సమాజానికి చెందిన వ్యక్తి. సమాజంలోని అన్ని వర్గాలనూ తాను అక్కున చేర్చుకున్నానని చెప్పుకునేందుకు మోడీ ఆయనతో నామినేషన్ పత్రంపై సంతకం చేయించారు.ఇది ఓటు రాజకీయమేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

మోడీ నామినేషన్ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీహార్ సీఎం నితీష్ కుమార్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ శాయ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ అసోం సీఎం హేమంత్ బిశ్వ శర్మ, హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ, గోవా సీఎం ప్రమోద్ సావత్, సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్, త్రిపుర సీఎం మాణిక్ సాహా, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సహా పలువురు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు కూడా మోడీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థతో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలనూ ఏర్పాటు చేసి పటిష్టమైన నిఘాను పెట్టామని తెలిపారు. ముఖ్యంగా, స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఆర్పీఎఫ్ బలగాలు ఈవీఎంలను పరిరక్షిస్తాయనీ, వాటి తర్వాత రాష్ట్ర టీఎస్ఎస్పీ బలగాలు పహారా కాస్తాయనీ, వాటి తర్వాతి వరుసలో సివిల్ పోలీసులు కాపు కాస్తారని.. ఈ విధంగా మూడంచెలుగా భద్రతను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. వీటితో పాటు స్ట్రాంగ్ రూమ్ నుంచి ఒక కిలో మీటరు దూరం వరకు సాయుధ పోలీసులతో గస్తీ ఉంటుందని అన్నారు. ఈ వ్యవస్థ జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యి ఫలితాలు ప్రకటించే వరకూ కొనసాగుతుందని ఆయన తెలిపారు. మొత్తమ్మీద రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందనీ, అందుకు పోలీసులు ఎంతగానో శ్రమించారని ఆయన ప్రశంసించారు. ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన కేంద్ర బలగాల్లో కొన్నింటిని మాత్రం రాష్ట్రంలో ఉంచుకొని మిగతావాటిని పంపించేశామని డీజీపీ తెలిపారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో దర్యాప్తు సమగ్రంగా సాగుతున్నదని ఆయన తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొనబడిన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కోసం రెడ్ కార్నర్ నోటీసును జారీ చేసినట్టు తెలిపారు. ఇంటర్‌పోల్‌కు నోడల్ ఏజెన్సీ అయిన రాష్ట్ర సీఐడీ ద్వారా సీబీఐకి ఈ నోటీసును పంపించామని ,దాని ఆధారంగా సీబీఐ ఇంటర్‌పోల్‌తో సంప్రదించి నోటీసు ప్రక్రియ సక్రమంగా అమలు జరిగేలా పర్యవేక్షిస్తుందని డీజీపీ వివరించారు. ప్రభాకర్‌రావు ఆచూకీ కోసం మొదలు పెట్టిన రెడ్‌కార్నర్ నోటీసు ప్రక్రియ పూర్తి కావటానికి కొంత సమయం పడుతుందనీ, దానిపై రాష్ట్ర సీఐడీ అధికారులు ఎప్పటికప్పుడు వాకబు చేస్తారని రవిగుప్తా చెప్పారు.

జూన్ 4న రైతు రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

రాగానే రైతు రుణమాఫీ చేసి తీరుతామని, అదానీ, మోడీ..గోడీ మీడియా ఏం రాసుకుంటారో రాసుకోండి.. ఎవరికీ భయపడేది లేదు..ఈ మీడియా మోడీ ఫొటోలు మాత్రమే వేస్తుంది.. ఏమైనా వేసుకోండి..అయితే మేం చేయాలనుకున్నది చేస్తాం'అని స్పష్టం చేశారు. పేద మహిళల ఖాతాల్లో నెలకు రూ. 8,500 చొప్పున ఏడాదికి రూ. లక్ష వేయబోతున్నామని, ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళ ఖాతాల్లో మహాలక్ష్మి పథకం కింద ఈ డబ్బులు వేస్తామని చెప్పారు.





సెమీస్ రిజర్వు డేలకు ఐసీసీ 'నో'

- వర్షంతో రద్దయితే రన్‌రేట్ ప్రాతిపదికన
- టై అయితే సూపర్ ఓవర్‌తో ఫలితం
- టి20 ప్రపంచకప్

దుబాయ్: వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరిగే టి20 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) స్పష్టతనిచ్చింది. రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వు డేలను కేటాయించడం లేదని స్పష్టం చేసింది. అనివార్య కారణాలవల్ల సెమీఫైనల్స్ మ్యాచ్‌లు నిలిచిపోతే అవసరమైతే 250 నిమిషాలు(సుమారు 4గంటలు) తర్వాత అయిన మ్యాచ్‌ను కొనసాగిస్తామని తెలిపింది. అంతేగాని సెమీస్ మ్యాచ్‌లను మరుసటిరోజుకు వాయిదా వేసే ప్రసక్తి లేదని పేర్కొంది. మ్యాచ్‌లను మరుసటిరోజుకు వాయిదా వేయడం వల్ల ఫైనల్లో ఆడే ఆటగాళ్లు ఇబ్బందులు పడతారని తెలిపింది. సెమీస్ ముగిసిన మరుసటిరోజే ఆ జట్టు ఫైనల్ మ్యాచ్ ఆడాల్సి ఉంటుందని అందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఒకవేళ సెమీస్ మ్యాచ్ టై అయిన పక్షంలో నిబంధనల ప్రకారం సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని నిర్ణయిస్తామని, వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దయిన పక్షంలో రెండో లీగ్ పోటీలు ముగిసిన తర్వాత మెరుగైన రన్‌రేట్ కలిగి మొదటిస్థానంలో ఉన్న జట్టు ఫైనల్‌కు చేరందని ఆ ప్రకటనలో తెలిపింది. ఐసిసి టి20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ జూన్ 27న ట్రినిడాడ్, గయానా వేదికలుగా జరగనున్నాయి. జూన్ 28న ట్రావెల్ డేగా, 29న ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు ఐసిసి తెలిసింది.

గెలిచినా.. ఢిల్లీకి కష్టమే..

ఓటమితో లక్నో ఆశలూ ఆవిరి



న్యూఢిల్లీ: ప్లే-ఆఫ్‌కు చేరడం కష్టమే అయినా.. చివరి మ్యాచ్‌లో ఢిల్లీ గెలిచి చిగురాశలతో మిగతాజట్ల ఫలితాలకు వేచిచూస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన తన చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 19 పరుగులు తేడాతో గెలిచి ఈ సీజన్‌లో 7వ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో మొత్తంగా 14 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఢిల్లీ 14పాయింట్లతో ప్రస్తుతానికి పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. ఇప్పటికే 14 పాయింట్లు సాధించిన జట్లతో పోటీపడినా ఢిల్లీ (-0.482) రన్‌రేట్ అన్ని జట్లకంటే తక్కువగా ఉంది. పైగా మరికొన్ని జట్లుకు 14 పాయింట్లు సాధించే అవకాశం ఉండటంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు వదులుకోవాల్సిందే. మరోవైపు ఓడిన లక్నో జట్టు ప్రస్తుతం 12 పాయింట్లతో 7వ స్థానంలో ఉంది. ఈ జట్టుకు మరొక మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. చివరిమ్యాచ్‌లో విజయం సాధించినా ప్రస్తుత రన్‌రేట్‌తో లక్నో కూడా ప్లేఆఫ్‌కు చేరడం అసాధ్యం.

మంగళవారం మ్యాచ్‌లో ఢిల్లీ విధించిన 209 పరుగుల ఛేధనలో లక్నో పోరాడినా ఫలితం సాధించలేకపోయింది. 20 ఓవర్లు ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి 189 పరుగులు మాత్రమే సాధించింది. ఛేధనలో ఢిల్లీ ఓపెనర్లు డికాక్, కెఎల రాహుల్‌తో పాటు, స్టోయిన్స్, దీపక్ హుడా తీవ్రంగా నిరాశపర్చారు. దీంతో 4 వికెట్ల నష్టానికి 44 పరుగులు మాత్రమే చేసింది. అయితే ఈ దశలో పూరన్ (61 పరుగులు) దాటిగా ఆడటంలో లక్నో రేసులోకి వచ్చింది. ఈ తరువాత అర్షద్ ఖాన్ (58 నాటౌట్) జట్టును గెలిపించడానికి ప్రయత్నించాడు. దీంతో చివరిలో ఓవర్‌లో విజయం కోసం 23 పరుగులు చేయాలి ఈ స్థితిలో రషిక్ సలాన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చాడు. దీంతో లక్నోకు ఓటమి తప్పలేదు. మూడు కీలక వికెట్లు తీసిన ఢిల్లీ బౌలర్ ఇశాంత్ శర్మకు ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ అవార్డు లభించింది.

మంగళవారం మ్యాచ్‌లో టాస్ ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్‌లో బ్యాటర్లు కదం తొక్కారు. ఓపెనర్ అభిషేక్ పోరెల్, మిడిలార్డర్ బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్ అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 208పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు శుభారంభం దక్కలేదు. ఫ్రేజర్(0) రెండో బంతికే డకౌట్ కావడంతో ఢిల్లీ కష్టాలతోనే ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ డకౌటైనా.. మరో ఓపెనర్ అభిషేక్ పోరెల్(58) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో రెండో అర్ధ సెంచరీ నమోదు చేశాడు. అయితే.. నవీన్ ఉల్ హక్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి బౌండరీ వద్ద పూరన్ చేతికి దొరికాడు. ఆ తర్వాత షాయ్ హోప్(38) అండగా పోరెల్ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. బౌలర్ మారినా బంతి లక్ష్యం బౌండరీయే అన్నట్టుగా చిచ్చరపిడుగు చెలరేగాడు. హోప్ సైతం ధనా ధన్ ఇన్నింగ్స్‌తో రాణించడంతో వీరిద్దరూ రెండో వికెట్‌కు 92 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ ద్వయాన్ని బిష్ణోయ్ విడదీశాడు. హోప్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(33) ఆచితూచి ఆడాడు. ఆ తర్వాత క్రీజ్‌లో నిలదొక్కుకున్నాక బ్యాట్ ఝుళిపించాడు. 23బంతుల్లో 5ఫోర్ల సాయంతో 33పరుగులు చేసి నవీన్-ఉల్-హక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. చివర్లో స్టబ్స్(57నాటౌట్; 25బంతుల్లో 3ఫోర్లు, 4సిక్సర్లు), అక్షర్ పటేల్(14నాటౌట్) రాణించడంతో ఢిల్లీ జట్టు భారీస్కోర్ నమోదు చేసింది. ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు ఇదే ఆఖరి మ్యాచ్ కాగా.. ఆ జట్టు 12పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతోంది. లక్నో బౌలర్లు నవీన్-ఉల్ హక్‌కు రెండు, బిష్ణోయ్, అర్షాద్ ఖాన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: ఫ్రేజర్ (సి)నవీన్-ఉల్-హక్ (బి)అర్షాద్ ఖాన్ 0, అభిషేక్ పోరెల్ (సి)పూరన్ (బి)నవీన్-ఉల్-హక్ 58, హోప్ (సి)రాహుల్ (బి)రవి బిష్ణోయ్ 38, రిషబ్ పంత్ (సి)దీపక్ హుడా (బి)నవీన్-ఉల్-హక్ 33, స్టబ్స్ (నాటౌట్) 57, అక్షర్ పటేల్ (నాటౌట్) 14, అదనం 8, (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 208పరుగులు.

వికెట్ల పతనం: 1/2, 2/94, 3/111, 4/158

బౌలింగ్: అర్షాద్ ఖాన్ 3-0-45-1, మొహిసిన్ ఖాన్ 4-0-29-0, యుధ్‌వీర్ సింగ్ 2-0-28-0, నవీన్-ఉల్-హక్ 4-0-51-2, రవి బిష్ణోయ్ 4-0-26-1, కృనాల్ పాండ్య 2-0-20-0, దీపక్ హుడా 1-0-9-0

హెచ్‌సీఏ ఎథిక్స్ ఆఫీసర్‌గా రిటైర్డ్ జడ్జి ఈశ్వరయ్య



హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎథిక్స్ ఆఫీసర్‌గా విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య నియమితులయ్యారు. మంగళవారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌సీఏ సెక్రటరీ దేవ్‌రాజ్, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు, ట్రెజరర్ సీజే శ్రీనివాస్ రావు, సిఈఓ సునీల్ కంటే, రిటైర్డ్ జడ్జి ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మెయిన్ డ్రాకు మస్నన్ అర్హత

థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మెయిన్ డ్రాకు మస్నన్ అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో మస్నన్ 21-19, 21-9తో హాంకాంగ్‌కు చెందిన కె.జె.హంగ్‌ను చిత్తుచేశాడు. అంతకుముందు తొలిరౌండ్‌లో మస్నన్ 15-21, 21-14, 21-16తో భారత్‌కే చెందిన దలాల్‌ను ఓడించాడు. తొలిరౌండ్‌లో మస్నన్ భారత్‌కే చెందిన స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌తో తలపడనున్నాడు. బుధవారం జరిగే ఇతర తొలిరౌండ్ పోటీల్లో ఎస్‌కె. కరుణాకరన్ సింగపూర్‌కు చెందిన జాసన్‌తో, కిరణ్ జార్జి.. డెన్మార్క్‌కు చెందిన క్రిస్టోఫర్ సేన్‌తో తలపడనున్నారు. ఇక మహిళల సింగిల్స్‌లో మాల్విక బన్సోద్ చైనా షట్లర్ వై. హాన్‌తో, ఆకర్షి కశ్యప్.. థాయ్‌లాండ్‌కు చెందిన ఒంగ్బ్రముంగ్సాన్‌తో తలపడనున్నారు. ఇతర పోటీల్లో ఫరూఖీ చైనా షట్లర్ జియోతో, హుడా.. జర్మనీకి చెందిన టాన్‌తో అమీతుమీ తేల్చుకోనున్నారు.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
కోల్‌కతా	13	9	3	1	19	1.42
రాజస్తాన్	12	8	4	0	16	0.34
చెన్నై	13	7	6	0	14	0.52
సన్‌రైజర్స్	12	7	5	0	14	0.40
బెంగళూరు	13	6	7	0	12	0.38
ఢిల్లీ క్యాపిటల్స్	13	6	7	0	12	-0.48
లక్నో	12	6	6	0	12	-0.76
గుజరాత్	13	5	7	1	11	-1.32
ముంబయి	13	4	9	0	8	-0.27
పంజాబ్‌కింగ్స్	12	4	8	0	8	-0.42

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; ర: రద్దు;నె.ర.:నెట్‌రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌కు బంగ్లాదేశ్ జట్టు ప్రకటన

శాంటోకు పగ్గాలు

ఢాకా : వెస్టిండీస్, అమెరికా వేదికగా జూన్ 2నుంచి జరిగే టి20 ప్రపంచకప్‌కు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బిసిబి) 15మంది ఆటగాళ్లతో కూడిన జట్టును ప్రకటించింది. నజ్ముల్ హుసేన్ శాంటో కెప్టెన్‌గా, సీనియర్ పేసర్ తస్కిన్ అహ్మద్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. 15మందితో ఆటగాళ్ల జట్టును మెగా టోర్నీకి సెలెక్టర్లు బలమైన బృందాన్ని ఎంపిక చేశారు. సీనియర్ ఆటగాడు మహ్మదుల్లాకు సెలెక్టర్లు తుది స్క్వాడ్‌లో చోటు కల్పించారు. ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో అదరగొట్టిన తౌహిద్ హృదయ్ టి20 వరల్డ్ కప్ బెర్తు దక్కించుకున్నాడు. బంగ్లా స్క్వాడ్‌లో ఉన్న సీనియర్ ఆల్‌రౌండర్ షకిబుల్ హసన్‌కు ఇదే చివరి టి20 వరల్డ్ కప్ కావొచ్చు. అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలనాలకు చిరునామాగా మారిన బంగ్లాదేశ్ సీనియర్లు, జూనియర్ల కాంబినేషన్‌తో పటిష్టంగా కనిపిస్తోంది. గత ఏడాది వన్డే ప్రపంచకప్, ఆసియాకప్‌లలో వైఫల్యం తర్వాత ఇటీవలికాలంలో బంగ్లాదేశ్ టెస్టు, వన్డే, టి20ల్లో అదరగొడుతోంది. ఈ మెగా టోర్నీలో బంగ్లాదేశ్ జూన్ 8న గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్ శ్రీలంకతో తలపడనుంది.



జట్టు : నజ్ముల్ హుసేన్ శాంటో(కెప్టెన్), తస్కిన్ అహ్మద్(వైస్ కెప్టెన్), లిట్టన్ దాస్, సౌమ్య సర్కార్, తంజిద్ హసన్ తమీమ్, షకిబ్ అల్ హసన్, తౌహిద్ హృదయ్, మహ్మదుల్లా రియాద్, జకెర్ అలీ అనిక్, తన్వీర్ ఇస్లాం, షక్ మహెది హసన్, రిషద్ హొసేన్, ముస్తాఫిజర్ రెహ్మాన్, షోరిఫుల్ ఇస్లాం, తంజీం హసన్ షకీబ్.

భిన్న కాన్సెప్ట్‌తో వేట్టయాన్



రజనీకాంత్ టైటిల్ పాత్రలో, 'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో 'వేట్టయాన్' అనే చిత్రం రూపొందుతోంది. పాన్ ఇండియా రేంజ్‌లో ఎన్నో ప్రముఖ చిత్రాలను నిర్మిస్తున్న లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ మీద సుభాస్కరన్ భారీ ఎత్తున ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించి అప్డేట్ వచ్చింది. రజనీకాంత్ ఈ మూవీ షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తి చేయడంతో చిత్రయూనిట్ ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియాలో ట్వీట్ వేస్తూ ఈ విషయాన్ని ప్రకటించింది. యూనిట్ సభ్యులు అంతా కలిసి రజినీకాంత్‌కి గ్రాండ్‌గా వీడ్కోలు పలికారు.

ఇప్పటికే ఈ సినిమా మీద అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయన్న సంగతి తెలిసిందే. ఈ మూవీని ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు.

కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్, జీఎం సుందర్, రోహిణి, అభిరామి, రావు రమేష్, రమేష్ తిలక్, రక్షణ, సాబుమోన్ అబుసమద్, సుప్రీత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ప్రొడ్యూసర్: సుభాస్కరన్, రచయిత - దర్శకుడు: టీ.జే. జ్ఞానవేల్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: ఎస్.ఆర్. కతీర్ ఐ.ఎస్.సి, ప్రొడక్షన్ డిజైనర్: కె. కధీర్, యాక్షన్ డైరెక్టర్: అన్బరివ్, ఎడిటర్: ఫిలోమిన్ రాజ్, క్రియేటివ్ డైరెక్టర్: బి కిరుతిక, ఆర్ట్ డైరెక్టర్: శక్తి వెంకట్ రాజ్.


ఆ పిల్ల కనులే..


గాయత్రి భరద్వాజ్, అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మంగళవారం ఫస్ట్ సింగిల్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు ఈ మూవీ ఫస్ట్ సింగిల్ 'ఆ పిల్ల కనులే..'ను రిలీజ్ చేయబోతున్నట్లు తెలిపారు. హిప్ హాప్ తమీజా ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. రిలీజ్ డేట్‌ను త్వరలోనే మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.

నవచిత్రం

భారీ సెట్‌లో క్లయిమాక్స్



నాని తన అప్ కమింగ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోద శనివారం'లో సూర్య పాత్రలో మునుపెన్నడూ చూడని ఇంటెన్స్ పవర్-ప్యాక్డ్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ యూనిక్ అడ్వంచర్‌ని హై బడ్జెట్‌తో డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా చిత్ర బృందం క్లైమాక్స్ చిత్రీకరణను ప్రారంభించింది. ఈ యాక్షన్ ఎపిసోడ్ కోసం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఓ భారీ సెట్‌ను నిర్మించారు.

ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తుండగా, ఎస్జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్టు 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వివేక్ ఆత్రేయ, సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మురళి జి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.

వినోదభరితంగా సంగీత్



తేజు అశ్విని, నిఖిల్ విజయేంద్ర సింహా, కార్తికేయ

లహరి ఫిలిమ్స్, ఆర్.బి. స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'సంగీత్' చిత్రం మంగళవారం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. పలువురు సినీ ప్రముఖులు హాజరైన ఈ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. నిహారిక కొణిదెల చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించగా, శౌర్య కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు షాట్‌కు ఎస్.ఎస్. కార్తికేయ క్లాప్ కొట్టారు.

'హంబుల్ పొలిటీషియన్ నోగ్‌రాజ్' తో మంచి గుర్తింపు పొందిన రచయిత-దర్శకుడు సాద్ ఖాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిసున్నారు.

సోషల్ మీడియా ద్వారా ఎందరో అభిమానులను సంపాదించుకున్న నిఖిల్ విజయేంద్ర సింహాను ఈ చిత్రం ద్వారా లహరి ఫిల్మ్ పరిచయం చేస్తోంది. నిఖిల్‌కి జోడిగా తేజు అశ్విని కనిపించనుంది.

ఈ చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా నిఖిల్ విజయేంద్ర సింహా మాట్లాడుతూ, "సంగీత్' నా హృదయానికి దగ్గరగా ఉన్న కథ. కథానాయకుడిగా సమర్థ్ పాత్రలోని భావోద్వేగాలను చూపించడం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ చిత్రం ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని నేను నమ్ముతున్నాను. ఇందులో భాగమైనందుకు నేను గౌరవంగా భావిస్తున్నాను. దర్శక, నిర్మాతలకు, చిత్ర బృందానికి నా కృతజ్ఞతలు' అని అన్నారు.

స్వర పాత్రలో నటిసున్న తేజు అశ్విని మాట్లాడుతూ, 'ఈ చిత్రం బాంధవ్యాల గురించి, జీవితంలోని మధురానుభూతుల గురించి ఉంటుంది. ఎంతో ప్రతిభగల చిత్ర బృందంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. స్వర పాత్రలో నటించడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను' అని తెలిపారు.

'పెళ్లి సమయంలో ఓ కుటుంబంలో జరిగే సంఘటనలను వినోదభరితంగా చూపిస్తూ ప్రేక్షకులను నవ్వించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్మాతలు నవీన్, చంద్రు, శ్రవంతితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది' అని దర్శకుడు సాద్ ఖాన్ చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాజ్ ఖాన్ నేతృత్వంలోని రైన్‌షైన్ కంపెనీ ఫస్ట్‌యాక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, శ్రవంతి నవీన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఎస్‌ఎస్‌డి టీచర్, నటుడు విక్రమ్ శివ, సూర్య గణపతి, హాస్యనటుడు హర్ష చెముడు తదితరులు కీలక పాత్రలలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: కళ్యాణ్ నాయక్, సమర్పణ: జి. మనోహరం, ఎల్.బాలకృష్ణ.

ఆ మాస్క్ కథేంటి?


వాణి భోజన్, భరత్

'ప్రేమిస్తే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన భరత్ ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ మూవీ 'మిరల్'తో ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

భరత్ హీరోగా, వాణి భోజన్ హీరోయిన్‌గా విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కించిన ఈ మూవీని సీహెచ్ సతీష్ కుమార్ నిర్మించారు. హర్రర్, సస్పెన్స్, సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రాబోతోన్న ఈ చిత్రానికి ఎం శక్తివేల్ దర్శకత్వం వహించారు. రీసెంట్‌గా విడుదల చేసిన ట్రైలర్ అందరినీ ఎంతగా భయపెట్టిందో అందరికీ తెలిసిందే. ట్రైలర్‌తో ఒక్కసారిగా ఈ మూవీ మీద అంచనాలు పెరిగాయి.

జగన్మోహిని, జి ఢిల్లి బాబు సమర్పణలో రానున్న ఈ సినిమాను ఈనెల 17న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.

సినిమా కథ ఏంటి? ఏ పాయింట్ చుట్టూ తిరుగుతుంది? ప్రధాన పాత్రలు ఏంటి? అనేది కూడా ఈ పోస్టర్‌లోనే చూపించారు. ట్రైలర్‌లోనూ ఓ వింత మాస్క్ హైలెట్ అయింది. ఇప్పుడు ఈ పోస్టర్‌లోనూ ఆ మాస్క్‌ను చూపించారు. అసలు ఆ మాస్క్ కథ ఏంటి? అనే ఆసక్తిని రేకెత్తించేలా ట్రైలర్, పోస్టర్‌ను డిజైన్ చేశారు. మీరాకృష్ణన్, రాజ్‌కుమార్, కావ్య అరివుమణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత : సిహెచ్ సతీష్ కుమార్, దర్శకుడు: ఎం.శక్తివేల్, కథ-స్క్రీన్ ప్లే: ఎం.శక్తివేల్, మ్యూజిక్ కంపోజర్: ప్రసాద్ ఎస్ ఎన్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ బాలా, ఎడిటర్: కలైవానన్ ఆర్, ఆర్ట్ డైరెక్టర్: మణికందన్ శ్రీనివాసన్, యాక్షన్ కొరియోగ్రఫీ : డేంజర్ మణి.

రియలిస్టిక్ ఎంటర్‌టైనర్


కృష్ణమాచారి

జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను 'రాజు యాదవ్'తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈనెల 17న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు కృష్ణమాచారి మీడియాతో మాట్లాడుతూ, 'మాది మహబూబ్ నగర్. 15 ఏళ్ల క్రితం ఇండస్ట్రీకి వచ్చాను. నీది నాది ఒకే కథ, విరాటపర్వం చిత్రాలకు దర్శకుడు వేణు ఉడుగుల దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశాను. దీంతో పాటు ఒక స్పానిష్ ఫిల్మ్, మరిన్ని కొన్ని చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేశాను. దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. దాదాపు 90 శాతం మనుషుల్లో ఏదో ఒక చిన్న లోపం ఉంటుంది. ఈ కథకు ఒక లోపం ఉన్న పాత్ర కావాలి. ఈ తరహాలో కొత్త క్యారెక్టరైజేషన్ చెప్పాలని భావించాను. అలాంటి సమయంలో రాజేంద్రప్రసాద్, అలీ నటించిన ఓ సినిమాలో కోటి రూపాయిలు లాటరీ టికెట్టు తగిలితే నవ్వుతూనే చనిపోయిన ఓ సీన్ ఉంటుంది. సినిమా అంతా అలా నవ్వుతూనే ఉంటాడు. అది నా మైండ్‌లో బాగా రిజిస్టర్ అయ్యింది. అలాగే క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి చిన్నప్పుడు ఏదో సర్జరీ జరిగింది. దాని కారణంగా ఆయన మొహం ఎప్పుడూ నవ్వుతూ ఉన్నట్లే కనిపిస్తుంది. తన నవ్వు వెనుక ఉన్న రహస్యాన్ని ఓ సందర్భంలో ఆయనే చెప్పారు.

ఇలాంటి లోపంతో క్యారెక్టరైజేషన్ రాసుకుంటే బావుంటుందనిపించింది. చాలా ఫన్ జనరేట్ అయ్యే పాత్ర ఇది. సహజత్వం కూడకున్న సినిమాలంటే ఇష్టం. రాజు యాదవ్ కూడా రియలిస్టిక్‌గా ఉంటుంది. అన్నీ రియల్ లోకేషన్స్‌లో షూట్ చేశాం. ఇది వెరీ పెర్ఫార్మెన్స్ బేస్డ్ క్యారెక్టర్. గెటప్ శ్రీను ఈ పాత్రకు పర్ఫెక్ట్ అనిపించారు. ఆయన నటన మెస్మరైజ్ చేస్తుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.